# జనబలం

ప్రజలే ప్రభువులు

జూన్ 2024 | లోక్‌సత్తా ఉద్యమ సంస్థ మాస పత్రిక | రూ.10/-











## Defining Elections:

## NDA కూటమి విజయం, కాంగ్రెస్ బలపడటం అభినందనీయం



## ఎన్నికల్లో పౌర సమాజం పాత్రపై విమర్శలు

## సమాఖ్య వ్యవస్థలో ఆర్థిక క్రమశిక్షణ

## AI ఎన్నికలు

## ఓటరూ! వాతావరణం మారుతోంది



# ఎన్‌టీఆర్ ఆర్థిక సమతూకం ఇప్పుడెంతో అవసరం

సంక్షేమంతోపాటు అభివృద్ధికి పెద్దపీట వేసిన నాయకుడు ఎన్.టి రామారావు అని ప్రజాస్వామ్య పీఠం (ఎఫ్‌డీఆర్), లోక్‌సత్తా వ్యవస్థాపకుడు డాక్టర్ జయప్రకాష్ నారాయణ్ అన్నారు. ప్రజాధనం ప్రతి రూపాయి విలువైనదని ఆచరణలో చూపారని, ఆర్థిక క్రమశిక్షణ పాటించారన్నారు. దేశంలో ఆర్థిక సంస్కరణలు ప్రారంభం కావటానికి ముందే వాటిని అమలు చేశారని తెలిపారు. హైదరాబాద్ పొట్టి శ్రీరాములు తెలుగు విశ్వవిద్యాలయంలోని ఎన్‌టీఆర్ కళామందిరంలో చెన్నపురి తెలుగు అకాడమీ ఆధ్వర్యంలో ఎన్‌టీఆర్ జయంతి సందర్భంగా, ఎన్‌టీఆర్@100, ట్యాంక్‌బండ్ ఉత్సవాల ప్రశస్తి పుస్తకాల సమీక్ష కార్యక్రమంలో జేపీ పాల్గొన్నారు. ఎన్‌టీఆర్ వచ్చాకే రాజకీయాల్లో సామాన్య ప్రజలకు విలువ ఏర్పడిందని, పెత్తందారీ రాజకీయాల స్థానంలో ప్రజల రాజకీయాల్ని తీసుకొచ్చారన్నారు. ఎన్‌టీఆర్ నిఖార్సయిన జాతీయ భావాలు గల నాయకుడన్నారు. ఓటుబ్యాంకు రాజకీయాల కోసం విద్వేషాలను రెచ్చగొట్టలేదన్నారు. దేశంలో కాంగ్రెస్ గుత్తాధిపత్యాన్ని సవాలు చేస్తూ ప్రత్యామ్నాయ, పోటీ రాజకీయాన్ని నిర్మించి ప్రజాస్వామ్యాన్ని బలోపేతం చేశారన్నారు. ఫెడరలిజం అంటే ఏమిటో పెద్దగా తెలియని రోజుల్లో ఆ అంశాన్ని ప్రజల్లోకి తీసుకెళ్లి ఇతర ప్రాంతీయ పార్టీల నాయకుల్ని సమీకరించి రాష్ట్రాలకు అధికారాల్ని సాధించారన్నారు. ప్రాంతీయ పార్టీని స్థాపించిన వ్యక్తి దేశ రాజకీయాల్లో అంత సంచలనం సృష్టించటం అసాధారణమన్నారు. సీనియర్ సంపాదకుడు రామచంద్రమూర్తి అధ్యక్షత వహించిన కార్యక్రమంలో రచయిత సుధాకర్ నాయుడు తదితరులు పాల్గొన్నారు.









# జనబలం

లోక్‌సత్తా ఉద్యమ సంస్థ మాసపత్రిక

ప్రజలే ప్రభువులు

జూన్ 2024

సంపుటి 25 సంచిక 06


**జనబలం చందా రుసుము వివరాలు**

| | | |
|---|---|---|
| సంవత్సర చందా | : | రూ. 100.00 |
| మూడు సంవత్సరాలకు చందా | : | రూ. 290.00 |
| ఐదు సంవత్సరాలకు చందా | : | రూ. 475.00 |
| జీవితకాలపు చందా | : | రూ. 1200.00 |


సంపాదకవర్గం

బండారు రామ్మోహనరావు

శిరమని నరేష్

వర్కింగ్ ఎడిటర్

దూసనపూడి సోమసుందర్




*జనబలంలో ప్రచురితమవుతున్న వ్యాసాలలో రచయిత(త్రు)లు వెలిబుచ్చే అభిప్రాయాలు కేవలం వారి సొంతం. జనబలం సంపాదకవర్గం ఆ అభిప్రాయాలతో ఏకీభవిస్తున్నట్టు కాదు.*


**చందాదారులకు విజ్ఞప్తి**

చందా మొత్తాలను, ప్రకటనల ధర మొత్తాలను చెక్కుగాని, డి.డి. ద్వారా గాని FOUNDATION FOR DEMOCRATIC REFORMS పేర పంపవచ్చును. NEFT సౌకర్యము ద్వారా పంపదలచినవారు SBI PUNJAGUTTA BRANCHలోని SB A/C. No. 52086568057కి IFSC CODE No. SBIN0020072కు పంపి, Transaction I.D. No. మరియు తారీఖు తప్పనిసరిగా తెలియజేయవలెను. నగదు రూపంలో చెల్లించదలచిన వారు లోక్‌సత్తా సంస్థ కేంద్ర కార్యాలయంలో ఇచ్చి రశీదు పొందవలెను.

**కార్టూన్ కార్నర్**




## లోపలి పేజీలలో..


➥ ఎన్‌డీయే కూటమి విజయం, కాంగ్రెస్ బలపడటం అభినందనీయం 5

➥ అభివృద్ధి, ఉపాధి అవకాశాలపై ఏకాభిప్రాయం అవసరం 8

➥ ఎన్నికల్లో పౌరసమాజం మద్దతుపై విమర్శలు 10

➥ ఈడీ దాడులు..ఎన్నికలు 15

➥ ఉచిత పథకాలు ఉండాలా, వద్దా? 21

➥ ఎన్నికల్లో AI – ప్రజాస్వామ్యం 22

➥ కొత్త ప్రభుత్వాలు వేగిరం ఈ మార్పులు తెస్తాయా? 24

➥ సమాఖ్య వ్యవస్థలో ఆర్థిక క్రమశిక్షణ – బాధ్యతలులేని హక్కులు అసాధ్యం 29

➥ వాతావరణం మారుతోంది, ఓటరు అడిగితేనే మార్పు సాధ్యం 31



కార్యాలయ చిరునామా : H.NO. 6-3-678, B-106 , పాషా కోర్టు, 71 , సోమాజిగూడ, త్రిభువన్‌దాస్ జ్యూయలరీ వెనుక, హైదరాబాద్-500 082 ఫోన్: 040-23310288, 040-23419949

Email: accountsdept@loksatta.org

# సంకీర్ణ పక్షాల దన్నుతో మరోసారి మోదీ!

సంపాదకీయం

పద్దెనిమిదో లోక్‌సభకు జరిగిన సార్వత్రిక ఎన్నికల సమరం ముగిసింది. జూన్ 4న ఎన్నికల ఫలితాలు వెలువడ్డాయి. నరేంద్రమోదీ నేతృత్వంలో ముచ్చటగా మూడోసారి ఎన్.డి.ఎ. ప్రభుత్వం అధికారంలోకి వచ్చింది.

ప్రపంచంలోనే అతిపెద్ద ప్రజాస్వామ్య దేశం మనది. 140 కోట్ల జనాభా కలిగిన మనదేశంలో దాదాపు 96.88 కోట్లమంది ఓటర్లుగా ఉన్నారు. ఏడుదశల్లో జరిగిన పోలింగులో 66.4 శాతం ఓట్లు పోలయినట్లు తాత్కాలిక గణాంకాలు చెబుతున్నాయి. దాదాపు 64.2 కోట్లమంది ఓటు హక్కు వినియోగించుకున్నారు. అందులో 31.2 కోట్లమంది మహిళలు ఉన్నారు. మన జాతీయ మధ్యగత వయసు 29 ఏళ్ళు కావడంతో యువ జనాభా ఎక్కువ ఉన్న దేశంగా భారత్ పేరు పొందింది. 18-29 వయోవర్గ యువ ఓటర్లు సుమారు 21.5 కోట్లమంది ఓటింగులో పాల్గొన్నారు. యువత రాజకీయాలపై అనాసక్తి ప్రదర్శిస్తారని, ఓటింగుకు రారనే భావన ఒకప్పుడు ఉండేది. కానీ తాజా ఎన్నికల్లో పార్లమెంటరీ ప్రజాస్వామ్య ప్రక్రియలో యువతరం పెద్దఎత్తున భాగస్వామ్యం కావడం ఒక ఆశాజనక పరిణామం.

దేశంలోని మొత్తం పదిలక్షల పోలింగు స్టేషన్లలో కోటిన్నర మంది సిబ్బంది ఎన్నికల విధుల్లో పాల్గొన్నారు. మరో 65 వేల బృందాలు పర్యవేక్షక విధుల్లో నిమగ్నం అయ్యాయి. ఎలక్ట్రానిక్ ఓటింగు యంత్రాల వాడకంపై మన సమాజంలో ఏకాభిప్రాయం లేకపోయినప్పటికీ 2024 ఎన్నికల్లో సుమారు 55 లక్షల ఈవిఎంలను వినియోగించారు.ప్రపంచంలోనే అతి పెద్దదైన ఇలాంటి ప్రజాస్వామ్య యజ్ఞాన్ని నిర్వహించడం ఆషామాషీ కాదు. అక్కడక్కడా కొన్ని హింసాయుత ఘటనలు చోటు చేసుకున్నా, ప్రాణ నష్టం జరిగినా మొత్తమ్మీద ప్రక్రియ పరిమాణాన్ని దృష్టిలో ఉంచుకుని చూస్తే భారత ఎన్నికల కమిషన్ ఉన్నంతలో తన బాధ్యతలను విజయవంతంగా పూర్తి చేసిందనే చెప్పాలి. ఎన్నికల ఫలితాలు వెలువడిన తర్వాత ప్రధాన రాజకీయ పక్షాలు ఎన్నికల కమిషన్ పనితీరు గురించి పెద్దగా ఆరోపణలు చేయకపోవడం ఒక సానుకూల పరిణామం.

2024 సార్వత్రిక ఎన్నికల్లో వెలువడిన ప్రజల తీర్పు మన సమాజంలోని వైవిధ్యాన్ని, బహుళత్వాన్నీ ప్రతిబింబించిందని చెప్పవచ్చు. పదేళ్లుగా దేశాన్ని పరిపాలిస్తున్న ఎన్.డి.ఎ.కూటమికి గతంలో ఉన్న 353 స్థానాలకు గానూ ప్రస్తుతం 293 స్థానాలు మాత్రమే లభిం చాయి. కూటమిలో అతిపెద్ద పార్టీగా ఉన్న బీజేపీకి గతంలో 303 స్థానాలు ఉండగా ప్రస్తుతం 240 స్థానాలు మాత్రమే దక్కాయి. బీజేపీ 63 స్థా నాలు కోల్పోయింది. దైవాంశ సంభూతులయిన నాయకులను సైతం సామాన్య ఓటర్లు అదుపు చేయగలరని రుజువు అయ్యింది. ప్రజాస్వామ్యం లో తామే నిజమైన ప్రభువులమని అవకాశం వచ్చిన ప్రతిసారీ ఓటర్లు స్పష్టం చేస్తూనే ఉన్నారు. కూటమికి 400 స్థానాలు దాటాలని, తమకు సొంతంగా 370 స్థానాలు సాధించాలని గట్టిగా కోరుకున్న బీజేపికి ఓటర్లు అలాంటి అవకాశాన్ని ఇవ్వలేదు. మూడింట రెండొంతుల మెజారిటీ ఇస్తే రాజ్యాంగాన్ని మారుస్తామని కొందరు ఆపార్టీ నేతలు చేసిన ప్రచారం ఓటర్లకు నచ్చలేదు. అలాంటి వాదనలకు ప్రజలు గట్టిగా బుద్ధి చెప్పారు!

గత పదేళ్లుగా కూటమి ప్రభుత్వమే అధికారంలో ఉన్నా కేవలం సొంతపార్టీ బలం దన్నుతోనే పాలన సాగించిన మోదీ ఇకనుండి భాగస్వామ్య పక్షాల మద్దతుపై ఆధారపడిన సంకీర్ణ ప్రభుత్వాన్ని నడపాల్సి ఉంటుంది. సొంత అజెండాతో దూకుడుగా ముందుకు వెళ్ళే సావకాశం ఇకముందు ఆయనకు ఉండదు. సంకీర్ణ ప్రభుత్వాన్ని నడిపే రాజకీయ చతురతను కూడా ఆయన కొత్తగా అలవరచుకోవాల్సి ఉంటుంది.

ఇండియా కూటమికి ఈ ఎన్నికల్లో 234 స్థానాలు లభించాయి. లోక్‌సభలో బలమైన ప్రతిపక్షం ఏర్పడింది. కాంగ్రెస్ 2014లో 44 స్థానాలు, 2019 లో 52 స్థానాలు మాత్రమే పొందగలిగింది. ఈ ఎన్నికల్లో 99 స్థానాల్లో గెలుపొంది పదేళ్లుగా లభించని ప్రధాన ప్రతిపక్ష హోదాను ఈసారి దక్కించుకున్నది. సామాన్యుల సమస్యలను లేవనెత్తడం ద్వారా కాంగ్రెస్ చర్చను పరిపుష్టం చేసిందని భావించాలి.

2024 ఎన్నికల సందర్భంగా "ఎన్నికల పర్వం - దేశానికి గర్వం" అంటూ ఎన్నికల కమిషన్ ఇచ్చిన ప్రచార నినాదం ఆకర్షణీయంగా ఉన్నమాట నిజమే. కానీ మన ఎన్నికల వ్యవస్థలోని దీర్ఘకాలిక రుగ్మతలను తొలగించడంలో కమిషన్ విఫలం అయ్యిందని చెప్పక తప్పదు. ఎన్నికల్లో నానాటికీ పెరిగిపోతున్న ధనప్రభావాన్ని అరికట్టడం సాధ్యం కావడంలేదు. ప్రస్తుత ఎన్నికల్లో అభ్యర్థుల నుండి సుమారు పదివేల కోట్ల రూపాయల నగదును స్వాధీనం చేసుకున్నట్లు ఎన్నికల కమిషన్ ప్రకటించింది.

ఓటర్లను ప్రలోభపెట్టడానికి అభ్యర్థులు చేసిన ఖర్చులో ఈసొమ్ము అతి స్వల్పం మాత్రమే. తమిళనాడు, కర్ణాటక, ఆంధ్రప్రదేశ్ , తెలంగాణ రాష్ట్రాల్లో అభ్యర్థులు ఓటర్లకు పంచే డబ్బు వేలకోట్లలో ఉంటుంది. ఒక్క ఏపీలోనే ఒక్కో శాసనసభా నియోజకవర్గంలో ఒక్కో అభ్యర్థి ఓటర్లకు పంచే డబ్బు యాభై కోట్ల రూపాయలు ఉందని అందరికీ తెలుసు. అలాగే ఒక్కొక్క లోక్‌సభ నియోజకవర్గంలో ఒక్కొక్క అభ్యర్థి వ్యయం 200 కోట్లు దాటుతుందనీ తెలుసు.ఈ లెక్కన 175 శాసనసభ నియోజకవర్గాలలో, 25 లోక్ సభ నియోజక వర్గాలలో అందరు అభ్యర్థులూ కలిపి చేసిన ఖర్చు రూ. 15 వేల కోట్ల వరకూ ఉండవచ్చని ఒక అంచనా. ఈ జబ్బు ఇప్పుడిప్పుడే ఉత్తరభారత రాష్ట్రాలకు విస్తరిస్తున్నదని సమాచారం.

చట్టసభలకు నేరచరితులు ఎన్నికవడం కూడా ఒక ధోరణిగా స్థిరపడింది. విచారణ ప్రక్రియలో జరుగుతున్న తీవ్ర జాప్యం నేర చరితులు పదవుల్లో నిరంతరాయంగా కొనసాగడానికి వీలు కల్పిస్తున్నది. అలాంటి సభ్యులతో నిండిన చట్టసభల పనితీరు ఘోరంగా తయారవుతున్నది. చట్ట సభలు కుస్తీ గోదాలుగా మారుతున్నాయి. చర్చలలో రాజకీయ నాయకుల, ప్రజాప్రతినిధుల భాష సభ్యతా సంస్కారాల హద్దులను దాటిపోతున్నది. అత్యున్నత బాధ్యతలలో ఉన్న నేతలు సైతం సభ్యతా సంస్కారాలను వదిలి అసత్యాలు, వక్రీకరణలు, ఆధారాలు లేని నిందలు, విద్వేష వ్యాఖ్యలు చేయడం మన బహిరంగచర్చ స్థాయిని దిగజార్చుతున్నది. సామాజిక మాధ్యమాల యుగంలో సాగుతున్న ఇలాంటి విచ్చలవిడి ప్రచార వ్యూహాలు సమాజంలో కలుషిత వాతావరణాన్ని వ్యాప్తి చేస్తున్నాయి. రాజకీయ పార్టీలకు చట్టబద్ధంగా విరాళాలు పొందడానికి వీలుగా తెచ్చిన ఎలక్టొరల్ బ్యాండ్ల విధానం కొత్త అవినీతికి బాటలు పరిచింది. ప్రహసనంగా మారిన మన ప్రజాస్వామ్యాన్ని తిరిగి గాడిలో పెట్టేందుకు ప్రస్తుత ఎన్నికల విధానాన్ని మార్చాల్సిన అవసరంపై చర్చ జరగాల్సి ఉంది.

అన్ని రాజకీయ పక్షాలకు వాటి బలానికి తగిన ప్రాతినిధ్యం లభించాలి. ఎన్నికల బరిలో అందరికీ సమానావకాశాలు ఇచ్చే వీలు కల్పించాలి. కొందరి చేతుల్లోనే మీడియా కేంద్రీకృతం కావడంతో కొన్ని పక్షాలకు మోతాదుకు మించిన ప్రచారం లభిస్తోంది. ధనబలం, కండబలం లేని, కుల, మత, ప్రాంతీయ, భాషా, వివక్షల ప్రభావం లేని ఎన్నికల వ్యవస్థ రావాలి. అవినీతి రహిత నిష్పాక్షిక స్వేచ్ఛాయుత ఎన్నికలకు దామాషా ప్రాతినిధ్య ఎన్నికల విధానమే శరణ్యం. అందుకోసం భారతీయ సమాజం ఇప్పటికైనా సంసిద్ధం కావాలి.

డి. సోమ సుందర్

# Defining Elections:

# ఎన్‌డీయే కూటమి విజయం, కాంగ్రెస్ బలపడటం అభినందనీయం

లోక్‌సభ, ఆంధ్రప్రదేశ్ అసెంబ్లీకి జరిగిన నిర్ణయాత్మక ఎన్నికల్లో ఎన్‌డీయే కూటమి విజయం పట్ల ప్రజాస్వామ్య పీఠం (ఎఫ్‌డీఆర్), లోక్‌సత్తా వ్యవస్థాపకుడు డాక్టర్ జయప్రకాష్ నారాయణ్ హర్షం వ్యక్తం చేశారు. జేపీ స్పందన ముఖ్యాంశాలు:

ఆంధ్రప్రదేశ్‌లో అసాధారణ మద్దతుని ప్రజల నుంచి పొందిన ఎన్‌డీయే కూటమికి మనసారా అభినందనలు. గతంలో చెప్పాను, ఆర్థిక ప్రగతి లేని సంక్షేమం సమాజాన్ని సర్వనాశనం చేస్తుంది. దాంతోపాటు ప్రభుత్వం ఒక మాఫియా రాజ్యంలాగా నడిస్తే, అసలే చట్టబద్ధపాలనలేని దేశంలో మరింతగా మాఫియాలాగా అడ్డూఆపూ లేకుండా వ్యవహరిస్తే ఏమవుతుందో ఏపీ ఒక ఉదాహరణ. ఆ నేపథ్యంలో ప్రజలు ప్రజాస్వామ్య స్ఫూర్తిని పూర్తిగా ప్రదర్శించారు. పెద్ద మెజారిటీని కట్టబెట్టారు తెలుగుదేశం పార్టీ, జనసేన, బీజేపీ కూటమికి. వారిని మనసారా అభినందిస్తున్నాను. ప్రజల ఆకాంక్షల్ని నెరవేరుస్తారని, భవిష్యత్తుని కాపాడతారని, ఆర్థిక ప్రగతి, సంక్షేమం, చట్టబద్ధపాలన ఈ మూడింటిని వేగవంతం చేస్తారని మనసారా ఆశిస్తున్నాను.


ఇక జాతీయస్థాయిలో ఎన్‌డీయే కూటమికి మూడోసారి మెజారిటీ వచ్చింది. ఇది అసాధారణ విజయం. ఎందుకంటే, ఒక పేద దేశంలో ఒక ప్రభుత్వం ఆర్థిక ప్రగతి, ఆర్థిక క్రమశిక్షణ, సంక్షేమం వీటిని పాటిస్తూ మూడోసారి ఎన్నికల్లో గెలవటమనేది అసాధారణమైన విషయం. 1962 తర్వాత ఏ ప్రభుత్వమూ మూడుసార్లు నెగ్గలేదు వరుసగా. అయితే బహుశా బీజేపీ శ్రేణులకు, మరికొొంతమందికి ఇది చాలా బాధాకరంగా అనిపిస్తుంది. ఎందుకంటే, 400 సీట్లు వస్తాయని చెప్పి తమను తాము నమ్మించుకుని చాలా హడావుడి చేశారు. ఇంగ్లిష్‌లో ఒక మాట అంటుంటారు. Snatching defeat from the jaws of victory అని. విజయం కోరల్లో నుంచి అపజయాన్ని లాక్కున్నారు. గెలుపును ఓటమిగా మార్చుకోవటం కేవలం అలవిమాలిన ఆత్మవిశ్వాసం వల్ల జరిగుంటుంది. కానీ దాదాపు 290-300 సీట్లు సాధించి NDA కూటమి మూడోసారి మెజారిటీ ప్రభుత్వాన్ని ఏర్పాటు చేయటం ఇంత వైవిధ్యభరితమైన సమాజంలో, ఒకపక్క ఆర్థిక ప్రగతిని వేగవంతంగా కొనసాగిస్తూ, మరోపక్కన క్రమశిక్షణ పాటిస్తూ చేయటమన్నది అసాధారణమైన విజయం. దానికి



సంతోషపడాలి. మనసారా ఎన్‌డీయే ప్రభుత్వాన్ని, ఆ పార్టీలని, నాయకత్వం అందించిన నరేంద్ర మోదీ గారిని అభినందిస్తున్నాం.

ఇక రెండోది, ప్రతిపక్ష కాంగ్రెస్ పార్టీ, వారి మిత్రపక్షాలు, 'ఇండి' కూటమి. వారినీ మనసారా అభినందించాలి. బలమైన ప్రతిపక్షంలేని ప్రజాస్వామ్యం రసహీనమవుతుంది. అధికార దుర్వినియోగానికి దారితీస్తుంది. చాలాకాలంపాటు ప్రతిపక్షాలు పేలవంగా ఉన్నాయి భారతదేశంలో. ఈవేళ కాంగ్రెస్, అలాగే 'ఇండి' మిత్రపక్షాలు పుంజుకోవటం దేశ ప్రజాస్వామ్యానికి శుభసూచకం. మనకు స్థిరమైన ప్రభుత్వం కావాలి, బలమైన ప్రతిపక్షం కావాలి. ప్రతిపక్షం అన్నది రేపొద్దున అధికారంలో అవసరమైతే, అవకాశం వస్తే కూర్చోబోయే పక్షం. కాబట్టి కాంగ్రెస్ పార్టీ ఈరకంగా పుంజుకోవటం దేశ ప్రజాస్వామ్యానికి చాలా మంచిది. కాంగ్రెస్, భవిష్యత్తులో పాలించే అవకాశం ఉంటుందన్న బాధ్యతను గుర్తించి అలవిమాలిన సంక్షేమ పథకాలు కాకుండా, అభివృద్ధిని, సంక్షేమాన్ని మిళితం చేస్తుందని, ఆర్థిక క్రమశిక్షణ పాటిస్తుందని, ఒక సమతూకాన్ని పాటిస్తుందని మనసారా నేను ఆశిస్తున్నాను.

మూడోది, ఇటీవలకాలంలో ఎప్పుడూ లేనట్లుగా ఈ ఎన్నికల్లో ఏదన్నా అన్యాయం చోటుచేసుకుందేమో, ఈవీఎంలలో గందరగోళం ఉందేమో, ఎన్నికల సంఘం పక్షపాతం ఉందేమో ఇలాంటివన్నీ కూడా వచ్చాయి. ఇవన్నీ పూర్తిగా అసత్యాలు. ఎన్నో సందర్భాలలో నేను మళ్లీమళ్లీ చెప్పాను. మన దేశంలో


ప్రజాస్వామ్యంలో చాలా లోపాలున్నాయి, ఓట్ల కొనుగోలు ఉన్నది, తాత్కాలికమైన తాయిలాలతో ప్రజలను మభ్యపెడుతున్నారు, కులం, మతం, ప్రాంతం, భాష పేరుతో విభజిస్తున్నారు. ఇవన్నీ పొరపాట్లే కానీ, రాజకీయ వ్యవస్థలో ఉన్న పొరపాట్లు, రాజకీయ సంస్కృతిలో ఉన్న పొరపాట్లుగానీ, ఎన్నికల నిర్వహణలో పొరపాట్లు కాదు. ఎన్ని ప్రతికూల పరిస్థితులున్నా కూడా మన ఓటర్లు స్వచ్ఛందంగా, వాళ్లిష్టమొచ్చినట్లు ఓటేస్తున్నారు. బలవంతంగా ఎవరూ వేయించటంలా. అలాగే ఎన్నికలని నిష్పాక్షికంగా, సమర్థంగా నిర్వహిస్తున్నారు. ఓట్లని నిజాయతీగా లెక్కిస్తున్నారు. ఎన్నికల ఫలితాలు ప్రకటించాక, అన్ని పార్టీలు, దేశంలో అన్ని వర్గాలూ కూడా వెంటనే వాటిని ఆహ్వానిస్తున్నాయి, ఆమోదిస్తున్నాయి. ఇప్పటిదాకా ఆ సంస్కారం నడిచింది, ఆ పద్ధతి నడిచింది. ఇటీవలికాలంలో నే గెలిస్తే ఒప్పుకుంటాం, నే ఓడిపోతే ఎన్నికలు సరిగ్గా జరిగినట్లు కాదు అనే ప్రచారానికి అమెరికాలో ట్రంప్ రీతిన తెర లేచింది. అది చాలా ప్రమాదకరం ప్రజాస్వామ్యానికి. పార్టీలు బాధ్యతతో మెలగాలి. ఈవేళ కాంగ్రెస్ పుంజుకోవటంతో ప్రతిపక్షాలకి మరింత బలం చేకూరటంతో ఎన్నికల నిర్వహణ మీద ఉన్నటువంటి అనుమానాలు, సందేహాలు, శంకలు పూర్తిగా పటాపంచలయ్యాయని నమ్ముతున్నాను. ఇకముందు ఇలాంటి ధోరణులకు స్వస్తిపలకాలి. ఎన్నికల్లో ఫలితాలు ప్రజలు నిర్ణయిస్తారుగానీ ఎన్నికల సంఘం కాదు, నాయకుల పెడబొబ్బలు కాదు. ఆ బాధ్యతను ప్రదర్శిస్తారని మనసారా ఆశిస్తున్నాను.

ఇక తర్వాతి అంశం. ఇప్పుడేం చేయాలి, దేశంలోగాని, తెలుగునాట గాని. ఒక్కో రాష్ట్రానికి ఒక్కో తీరున్నా మౌలికంగా ఆంధ్రప్రదేశ్‌లో ఆర్థిక వ్యవస్థను గట్టెక్కించాలి, ఆర్థిక క్రమశిక్షణ పాటించాలి. చాలా హామీలిచ్చారు ప్రజలకు న్యాయం చేద్దామని. కానీ ఆ హామీల్ని వెంటనే అమలు చేసి డబ్బులేని పరిస్థితుల్లో అప్పులపాలైపోయి సంక్షోభంలో కూరుకుపోకుండా క్రమపద్ధతిలో అమలు చేయాలి. అలాగే మరికొన్ని హామీల్ని పునర్వ్యవస్థీకరించి, పిల్లల చదువులు బాగుపడటం, ఆరోగ్యం బాగుపడటం, ఆదాయాలు పెరగటం మొదలైన లక్ష్యాలకు అనుగుణంగా మార్పులు చేస్తూ ఆ డబ్బులు సద్వినియోగం చేసే ఏర్పాట్లు చేయాలి. అలాగే నిజమైన బీదలని గుర్తించి అర్హులయిన కుటుంబాలకి సంక్షేమ పథకాలని అందించాలి.

అలాగే అభివృద్ధి నమూనాను మార్చాలి. దేశమంతటా ఒకరకంగా నరేంద్ర మోదీ ప్రభుత్వానికి ప్రజలు ఈవేళ ఇచ్చిన సూచన ఏమిటంటే, అభివృద్ధి అవసరం, కానీ మాకు చాలా వేగంగా ఫలితాలు అందాలి. పేదలకి అభివృద్ధిలో పాత్ర కావాలి. అభివృద్ధి వల్ల మనకున్న పరిస్థితుల్లో ప్రధానంగా నైపుణ్యం ఉన్నవాళ్లకి, పెట్టుబడి ఉన్నవాళ్లకి ఎక్కువగా ఫలితాలు వస్తాయి. అభివృద్ధి వల్ల అందరికీ లాభం ఉంటుంది. అన్ని వర్గాలకీ, అట్టడుగున ఉన్న నిరుపేదలకి కూడా లాభం ఉంటుంది. కానీ కొన్ని వర్గాలకి గణనీయంగా లాభం కనిపిస్తుంది. మిగతా వర్గాలకి అనుకున్నంత వేగంగా ఫలితాలు అందవు. ఆ ఫలితాలు అందాలంటే, అభివృద్ధి నమూనాలో కొన్ని మార్పులు కావాలి. ప్రస్తుతమున్న పద్ధతిని, మౌలిక సదుపాయాల కల్పన, ఆర్థిక క్రమశిక్షణ, వాటిని కొనసాగిస్తూనే అభివృద్ధి నమూనా మారాలి. మంచి ప్రమాణాల విద్య అందరికీ అందకపోయినట్లయితే, నైపుణ్యం రాకపోయినట్లయితే, ఏ కులంలో, ఏ కుటుంబంలో పుట్టినా కూడా ఎదిగే అవకాశం రాకపోతే, ఉత్తుత్తి చదువిస్తే, ఆధునిక ఆర్థిక వ్యవస్థలో ఎలా బాగుపడతారు? ఒక్క పైసా ఖర్చు లేకుండా మంచి విద్య అందించే ఏర్పాట్లు చేయవచ్చు. దాని మీద శ్రద్ధ పెట్టకుండా ఖర్చులు చూపెడుతున్నాం, తాయిలాలు పంచుతున్నాం. రెండోది, మంచి ప్రమాణాల ఆరోగ్యం. అన్ని రకాల ఆరోగ్యం. ఒక్క ఆరోగ్యశ్రీ ఉంటే చాలదు. సంపూర్ణ ఆరోగ్యం కావాలి. ఫ్యామిలీ డాక్టర్ దగ్గర్నుంచి తృతీయ స్థాయి వైద్యం దాకా జేబులో నుంచి పైసా ఖర్చు లేకుండా, ప్రభుత్వానికి పెద్ద భారం లేకుండా మంచి ఆరోగ్యం అందించే అవకాశం ఉంది. ఆ ప్రయత్నం చేస్తే చాలామేరకు ఊరట కలుగుతుంది, ఉత్పాదకత పెరుగుతుంది. మూడోది, చిన్న పట్టణాల్ని చేపట్టాలి. అందరూ మహానగరాలకు వలస పోవాలంటే, అక్కడ తక్కువ నైపుణ్యంతో, చాలని జీతాలతో బతకటం చాలా కష్టం. జీవితమంతా గందరగోళంగా ఉంటుంది. ఎక్కడికక్కడ చిన్న పట్టణాల్ని అభివృద్ధి చేసినట్లయితే, గ్రామాలు-పట్టణాలు అనుసంధానం అయినట్లయితే, చిన్న చిన్న నైపుణ్యాలతో చిన్న ఉద్యోగంలో కూడా సంతృప్తిగా బతకొచ్చు. ఆలనాపాలనా

# ఏపీ ప్రజలు విజ్ఞతతో ఓటు వేశారు

ఆంధ్రప్రదేశ్ ప్రజలు రాష్ట్ర భవిష్యత్తుని దృష్టిలో పెట్టుకుని విజ్ఞతతో తెలుగుదేశం, జనసేన, బీజేపీ ఎన్‌డీయే కూటమికి ఓటు వేసి ఆదరించారని లోక్‌సత్తా పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు భీశెట్టి బాబ్జీ అన్నారు. లోక్‌సత్తా వ్యవస్థాపకుడు డాక్టర్ జయప్రకాష్ నారాయణ్ కూటమికి తన సంపూర్ణ మద్దతును ప్రకటించటంతో, సంక్షేమం మాత్రమే అందించే రాజకీయమా, లేక, సంక్షేమంతోపాటు అభివృద్ధి కూడా అందించే రాజకీయమా అనే చర్చ రాష్ట్రంలో మొదలైందని, యువత స్పందించి ఈ నిర్ణయాత్మక ఎన్నికల్లో కూటమికి మద్దతు పలికారన్నారు. సంక్షేమంతోపాటు అభివృద్ధి కూడా కావాలంటూ పెద్దఎత్తున ఓట్లు వేశారన్నారు. రాష్ట్రంలో సంక్షేమ పథకాల అమలుకు కూటమి ప్రణాళికాబద్ధంగా వ్యవహరించాలని మితిమీరిన ఆర్థిక భారం లేకుండా క్రమపద్ధతిలో అమలు చేయాలన్నారు. ఆర్థిక క్రమశిక్షణ, పెట్టుబడులను ప్రోత్సహించటం, మౌలిక వసతులతో యువతకు ఉపాధి అవకాశాలను కల్పించాలన్నారు. జాతీయ స్థాయిలో ప్రభుత్వం నుంచి విభజన హామీల్ని సాధించుకునేందుకు స్వతంత్ర నిపుణులతో లోక్‌సత్తా రూపొందించిన ప్రామాణిక నివేదికను ఉపయోగించుకోవాలని విజ్ఞప్తి చేశారు.

ఉంటుంది, పేదలకి చాలా మేలు జరుగుతుంది, ఈ వ్యవస్థలో భాగస్వాములం అనే నమ్మకం కలుగుతుంది.

నాలుగోది, శరవేగంగా పెట్టుబడుల్ని పెంచాలి, మౌలిక సదుపాయాల్ని బాగుచేయాలి, ప్రాజెక్టుల్ని, ఆగిపోయిన ప్రాజెక్టుల్ని వెంటనే పూర్తి చేయాలి. రాజధాని నిర్మాణం కావచ్చు, గ్రీన్‌ఫీల్డ్ సిటీ నిర్మాణం కావచ్చు, పోలవరం లాంటి ప్రాజెక్టులు కావచ్చు, ఎన్నో పెట్టుబడి పెట్టాల్సిన అవసరాలు కావచ్చు, ఒకసారి పెట్టుబడి పెట్టాక, ఆ పెట్టుబడి పెట్టేవాళ్లకి, ఆర్థిక వ్యవస్థకి ప్రోత్సాహానిచ్చేవాళ్లకి నమ్మకాన్ని కలిగించాలి. కోల్పోయిన విశ్వాసాన్ని మళ్లీ తిరిగి ఇవ్వాలి. దాంతోపాటు పెట్టుబడులకు, ఆర్థిక ప్రగతికి అడ్డుగా ఉన్న విధానాలు, కార్మిక చట్టాలు, వాటిలో మార్పులు తీసుకురావాలి. మేం పెట్టుబడి పెడితే, ఒక పరిశ్రమ పెడితే, వ్యాపారం పెడితే నాకు ఉరి అవుతుంది, నాకు ఉచ్చు అవుతుంది, నాకెందుకీ గొడవ, ఒక చిన్న స్థలం కొనుక్కుందామన్న ధోరణి కాకుండా, రిస్క్ తీసుకుందాం, ఉపాధి కలిగిద్దాం, సంపద పెంచుదాం అన్న వాతావరణం కల్పించాలి. ఈ ప్రయత్నాలు శరవేగంగా చేయాలి. అవి చేస్తారన్న విశ్వాసంతోనే చంద్రబాబు నాయుడు గారికి, ఆయన నాయకత్వంలో ఉన్న కూటమికి బ్రహ్మాండంగా పట్టం కట్టారు. ఇవాళ ఆ బాధ్యతను నెరవేర్చుకోవాలి.

చివరిగా, ఈ ఎన్నికల్లో డబ్బు ప్రవాహాన్ని మనం చూశాం, ముఖ్యంగా ఆంధ్రప్రదేశ్‌లో. ఈవేళ ఆంధ్రప్రదేశ్, కర్ణాటక, తమిళనాడు రాష్ట్రాలు ఎన్నికల్లో అక్రమ ఖర్చుకి అగ్రస్థానంలో ఉన్నాయి. దక్షిణాది రాష్ట్రాలు గొప్పగా ఉంటాయనుకుంటే, రాజకీయాన్ని ఎంత పతనం చేశారో మనకు అర్థమవుతోంది. కొన్ని నియోజకవర్గాల్లో పదుల కోట్లు, 100-120 కోట్లు ఖర్చు పెట్టారనే వాస్తవాలు అసెంబ్లీ నియోజకవర్గాలకు సంబంధించి బయటకు వస్తున్నాయి. ఈ రకంగా ఖర్చు పెడితే అది ప్రజాస్వామ్యం ఎట్లా అవుతుంది? వ్యవస్థను నాశనం చేయటం కాక, అవినీతిని పెంచటం కాక, ప్రజాస్వామ్యాన్ని పోషించటం ఎట్లా అవుతుంది? అందువల్ల, ఎన్నికల వ్యవస్థలో మార్పులు కావాలి. మోదీ గారికి ఈ అనుభవంతో అర్థమై ఉంటుంది. గత రెండు ఎన్నికల్లో పెద్ద మెజారిటీని చాలా సులువుగా సాధించారు. ఈ ఎన్నికల్లో ఎంత కష్టపడ్డా, ఎంత మంచి ఫలితాలు సాధించినా కూడా ఈ ప్రజాస్వామ్యంలో అందరినీ కలుపుకుపోవటం, ఏకాభిప్రాయాన్ని సాధించటం ఎంత కష్టమో, అభివృద్ధిని పెంచటం ఎంత కష్టమో, ఆర్థిక క్రమశిక్షణను పాటించటం ఎంత ప్రయాసో ఆయనకు అర్థమై ఉంటుంది. కాబట్టి ఎన్నికల సంస్కరణలకు నడుం కట్టాలి. ఓట్ల కొనుగోలు వల్ల మొట్టమొదటి ప్రశ్న, ఎంత డబ్బు ఖర్చు పెడతావు? దాన్నుంచి వ్యవస్థ మారాలి అంటే, ప్రధాన పార్టీలు అందరికీ మేలు జరిగే రీతిలో దామాషా పద్ధతిని తేవాలి. అప్పుడు అత్యుత్తముల్ని రాజకీయంలోకి తీసుకురావచ్చు. ఈ డబ్బు ఖర్చుని ఆపవచ్చు. ఈ రెండూ జరగాలంటే, ఎన్నికల వ్యవస్థ మారాలి. చాలా తేలిగ్గా మార్చవచ్చు ఇవాళ రాజకీయంలో ఉన్న పెద్దలు పూనుకున్నట్లయితే. కచ్చితంగా బీజేపీకి ఈ అనుభవంతో మార్పు గురించిన ఆలోచన వస్తుందని ఆశిస్తున్నాను. అలాగే కాంగ్రెస్ పార్టీ గానీ, మరో పార్టీ గానీ ఈ రాజకీయం నుంచి బయటపడకుండా ఎంతసేపటికీ అమీతుమీ తేల్చుకుందామని భావించినట్లయితే ఎవరు గెలిచినా దేశ ప్రజలు నష్టపోతున్నారు. అలాకాకుండా ప్రజాస్వామ్యానికి గెలుపు కావాలి, దేశానికి గెలుపు కావాలి, మీకూ రాజకీయం అందంగా, గౌరవ ప్రదంగా నిజాయతీగా ఉండాలి. అందుకోసం ఎన్నికల వ్యవస్థని మార్చి, సులువైన పద్ధతుల్లో దామాషా ఎన్నికల పద్ధతిని తీసుకురావాలి. దానికి సవరింపులు చేద్దాం మన దేశంలో పద్ధతులకనుగుణంగా. ఒకపక్కన స్థిరత్వాన్ని సాధిద్దాం, మరోపక్కన ఈ దేశంలో డబ్బులు ఖర్చు పెట్టే అవసరం లేకుండా సమర్థులు, నిజాయతీపరులు రాజకీయంలోకి వచ్చే ఏర్పాట్లు చేద్దాం. అందుకు పూనుకుంటారని ఆశిస్తూ, ఎన్నికైన ప్రతినిధులను మరోసారి మనసారా అభినందిస్తున్నాను. ప్రజాస్వామ్యంలో ఎన్నికైతే అంతకంటే గౌరవం ఇంకోటి లేదు. ప్రజలు వారి బాధ్యతను మీ మీద పెట్టారు. అంతకంటే గౌరవం ఇంకోటి లేదు. ఆ గౌరవాన్ని కాపాడుకుంటారని, ఆంధ్రప్రదేశ్‌లో గాని, దేశంలో గాని ఆర్థిక ప్రగతికి, మంచి పాలనకి దోహదం చేస్తారని మనసారా ఆశిస్తున్నా.

# అభివృద్ధి, ఉపాధి అవకాశాలపై ఏకాభిప్రాయం అవసరం

- డాక్టర్ జయప్రకాష్ నారాయణ్-

దేశాన్ని మళ్లీ ఎన్నికల జ్వరం ఆవహించింది. ఎన్నికల హోరు, హోరాహోరీ పోరు, పండుగ తరహా కోలాహలంలో బహుశా ఏ దేశం మనకు సాటి రాదేమో. ఆ శబ్దాడంబరాల్ని, వాగాడంబరాల్ని పట్టించుకోకుండా చూస్తే, ఒక దేశంగా మనం రెండు అతి పెద్ద సవాళ్లను ఎదుర్కొంటున్నాం. ఒకటి, ఎక్కువ ఆర్థికాభివృద్ధి రేటును కాపాడుకోవటం. రెండోది, ఉపాధి అవకాశాల్ని సృష్టించి అభివృద్ధి ఫలాల్ని ఎక్కువ మంది ప్రజలకు అందించటం.

మనం అతి పెద్ద ప్రజాస్వామ్యం, వైవిధ్యభరితమైన, సంక్లిష్టమైన దేశం మాత్రమే కాదు, పేదరికం, అవిద్య, నిరుద్యోగం అపారంగా ఉన్న సమాజం కూడా. కేంద్రీకృత పాలన వల్ల మన ప్రజలకు రోజువారీ సేవలు సక్రమంగా అందవు. ఈ పరిస్థితుల్లో, తాము వేసే ఓటుకి, తమ జీవితానికి మధ్య సంబంధం అర్థం చేసుకోవటం ప్రజలకు కష్టమైంది. తాత్కాలిక ప్రలోభాలు, వ్యక్తిగత సంక్షేమానికి ఆకర్షితులయ్యే ఓటర్లు భారీగా పెరిగారు. జాన్ మెనార్డ్ కీన్స్ సుప్రసిద్ధంగా చెప్పారు "దీర్ఘకాలంలో మనం ఎవరం మిగలం". దీర్ఘకాల ప్రజాహితం మీదే దృష్టి పెడితే ప్రజాస్వామ్య రాజకీయాలు మనుగడ సాగించలేవు; కానీ దీర్ఘకాల ప్రయోజనాల్ని పణంగా పెట్టి తాత్కాలిక వ్యక్తిగత లబ్ధి మీద మాత్రమే కేంద్రీకరిస్తే సమాజం నిరంతర పేదరికంలో, వెనుకబాటుతనంలో కూరుకు పోతుంటుంది.

"ఒక పని చేయాలా, వద్దా అని ప్రజాజీవనంలో ఉన్నవారికి ఎప్పుడైనా సందేహం వస్తే, మారుమూలున్న అత్యంత పేద, బలహీనమైన వ్యక్తి గురించి ఒక్క క్షణం ఆలోచించండి. మీరు చేసే పని వల్ల ఆ వ్యక్తి తన కాళ్ల మీద తాను నిలబడగలుగుతాడా? అతనికి తన జీవితం మీద పట్టు వస్తుందా? అంటే, అతని సంపాదన శక్తి పెరుగుతుందా? అలా పెరిగేట్లయితే అది అతనికి నిజమైన స్వరాజ్యం. అతడి ఆత్మవిశ్వాసాన్ని, శక్తిని పెంచగలిగినట్లయితే అది నువ్వు చెయ్యదగిన పని. లేకపోతే నిరర్థకమైన పని" అన్న సందేశంతో గాంధీజీ ఒక మంత్రంలాంటి ప్రమాణాన్ని నిర్దేశించారు.


కానీ మనం 'ఎలాగోలా అధికారమే పరమావధి' మంత్రంగా మారిన రాజకీయంలో ఉన్నాం. మన అపరిపక్వ



ప్రజాస్వామ్యానికి గాంధీజీ మంత్రం చాలా కఠినమైన, అందుకోలేని ప్రమాణంగా తయారైంది. కోట్లాది ప్రజలు పేదలుగా, అవకాశాలు అందనివారుగా ఉన్న సమాజంలో, ఓటర్లు ఎన్నికలలో సరికొత్త తాత్కాలిక పథకాలను ఆశించటాన్ని తప్పు పట్టలేం. వ్యక్తిగత తాత్కాలిక సంక్షేమ పథకాల చేతిలో ఆర్థికాభివృద్ధి, దీర్ఘకాలిక ఉమ్మడి అవసరాలు ఓడిపోవటం మళ్లీ మళ్లీ చూస్తున్నాం. 2004లో వాజపేయి ప్రధానమంత్రిగా తిరిగి ఎన్.డి.యే ప్రభుత్వం అధికారంలోకి వస్తుందని చాలామంది విశ్లేషకులు, రాజకీయ పండితులు బలంగా నమ్మారు. కానీ కాంగ్రెస్ పార్టీ తాత్కాలిక సంక్షేమ హామీల దెబ్బకి మౌలిక వసతులు, ఉమ్మడి అవసరాలు, అభివృద్ధి ధామ్మని ఓడిపోయాయి.

అభివృద్ధిలేని తాత్కాలిక సంక్షేమ పథకాలు ఎక్కువకాలం కొనసాగలేవు. ప్రజలకు మేలు చేస్తున్నట్లు కనిపిస్తాయిగానీ, చివరికి పేదరికాన్ని కొనసాగిస్తాయి. వేగంగా అభివృద్ధి ఉంటేనే, ప్రజలు పెద్దఎత్తున పేదరికం నుంచి బయటపడగలరు. అభివృద్ధి ఉంటేనే, సంక్షేమాన్ని ఇంకా పెద్దఎత్తున చేపట్టటానికి అవసరమైన అదనపు ఆదాయం లభిస్తుంది. అభివృద్ధే లేకపోతే, సంక్షేమానికి అప్పులు తేవాల్సి ఉంటుంది. ఎక్కువ అప్పుల వల్ల



ఎక్కువ వడ్డీ చెల్లించాల్సి రావటంతో సంక్షేమానికి వనరులు ఉన్నకొద్దీ తగ్గిపోతాయి. పాత అప్పులు తిరిగి చెల్లించటానికి కొత్త అప్పులు చేస్తూ చివరికి అప్పుల ఊబిలో కూరుకుపోతాం. శ్రీలంక, పాకిస్తాన్, జింబాబ్వే, వెనిజువెలా వంటి దేశాలు ఎదుర్కొంటున్న సంక్షోభం అదే.

మరి ఏమిటి పరిష్కారం? మనం సంక్షేమానికి, అభివృద్ధికి మధ్య సమతూకం సాధించాలి. పేదరికం బాధ తగ్గించటానికి, సమాజంలో స్థిరత్వాన్ని, శాంతి సామరస్యాలను కొనసాగించటానికి, ప్రజాస్వామ్య రాజకీయంలో భాగంగా అన్ని వర్గాలనూ కలుపుకెళ్లటానికి మనకు సంక్షేమ పథకాలు అవసరం. ఇదేసమయంలో, డబ్బులు పొదుపు చేసి, మౌలిక వసతుల నిర్మాణానికి, పారిశ్రామిక వ్యవస్థాపక చొరవను, పెట్టుబడులు, సంపద, ఉద్యోగాల సృష్టిని ప్రోత్సహించటానికి అవసరమైన అన్ని చర్యలూ తీసుకోవాలి. ఆర్థిక నిర్వహణ ఈ రకమైన విజ్ఞతతో ఉండాలి. అప్పుడు మాత్రమే మనం ప్రజల్ని పేదరికం నుండి శాశ్వతంగా బయటపడేయగలం; పుట్టుకతో, తల్లిదండ్రుల ఆస్తిపాస్తులతో సంబంధం లేకుండా తన సామర్థ్యాన్ని సంపూర్ణంగా వికసింపచేసుకుని, స్వేచ్ఛ, ఆత్మ గౌరవం, గౌరవప్రదమైన జీవితాన్ని ఆస్వాదించే అవకాశాన్ని ప్రతి బిడ్డకూ అందించగలం.

1991 నుండి 2014 వరకు, ఏ పార్టీ అధికారంలో ఉన్నా ఆర్థిక ప్రగతిపై స్థూలంగా ఏకాభిప్రాయం ఉండేది. మిగిలిన విషయాల్లో విధానాలపై ఎన్ని అభిప్రాయభేదాలున్నా అభివృద్ధిపై ఏకాభిప్రాయంతో పాలన జరిగేది. పకడ్బందీ ఆర్థిక నిర్వహణ, మౌలిక వసతులు, ఆర్థిక ప్రగతి పట్ల ప్రధాన పార్టీలు అంగీకారానికి వస్తే, ఎవరు అధికారంలోకి వచ్చినా ఒక దేశంగా మనం సురక్షితంగా ఉంటాం.


ఆర్థిక సంస్కరణలకు నాంది పలికి కాంగ్రెస్ పార్టీ 2014 తర్వాతి కాలంలో ఆర్థికాభివృద్ధిని వదిలేసినట్లు కనిపిస్తుంది. ఆర్థిక నిర్వహణ, మౌలిక వసతులు, ఎంటర్‌ప్రెన్యూర్‌షిప్, అభివృద్ధిని విస్మరించి, తాత్కాలిక పథకాల మీదే ఆధారపడటం ఉన్నకొద్దీ పెరుగుతూ వస్తోంది. మన రాజకీయానికి, ఆర్థిక వ్యవస్థకి ఇది పెనుప్రమాదం. నరేంద్ర మోదీ నేతృత్వంలో ఎన్.డి.యే ప్రభుత్వం మూడోసారి అధికారంలోకి వస్తుందని చాలామంది భావిస్తున్నారు. ఎన్నికల ఫలితం ఏదైనా, ఏ పార్టీ లేదా వ్యక్తి అధికారంలో శాశ్వతంగా ఉండరని మనం గుర్తించాలి. ప్రజాస్వామ్య రాజకీయాల్లో ప్రధాన ప్రతిపక్షం అంటే, ఏదోక రోజు ప్రభుత్వం ఏర్పాటు చేసే పక్షం అని అర్థం. పటిష్ఠ ఆర్థిక నిర్వహణ, అభివృద్ధిని ప్రోత్సహించటంపై ఏకాభిప్రాయం ఎండమావి అయితే, దేశం తీవ్ర ప్రమాదకర పరిస్థితిని ఎదుర్కొంటుంది.

సుస్థిరాభివృద్ధిని సుదీర్ఘకాలంపాటు సాధించటానికి ఇప్పుడు దేశానికి ఒక నిజమైన అవకాశం అందుబాటులో ఉంది. రెండు ప్రధాన పార్టీలు లేదా కూటములు గనక ప్రజాకర్షక పథకాల పంపిణీలో, ఆర్థిక పతనంలో పోటీపడుతుంటే ఈ అవకాశం జారవిడుచుకున్నవారమవుతాం. ఆదాయ మార్గాలు లేకుండా అవాస్తవికమైన సంక్షేమ వ్యయాలు, రుణమాఫీలు చేయటం, కార్మిక చట్టాల సంస్కరణల నుంచి వెనక్కెళ్లటం, ఆచరణసాధ్యంకాని ధరలతో ఆహారధాన్యాల సేకరణకు చట్టబద్ధత కల్పించటం అనివార్యంగా ఆర్థిక వినాశనానికి దారితీస్తాయి. అభివృద్ధి కుచించుకుపోతుంది. సంస్థలు ఇచ్చే ఉద్యోగాల సంఖ్యను బట్టి ప్రోత్సాహకాలివ్వటం, మౌలిక వసతులు, పెట్టుబడి, తక్కువ నైపుణ్యాలున్న గ్రామీణ కార్మికులకు వ్యవసాయేతర రంగాల్లో ఉపాధి అవకాశాలు కల్పించటానికి గ్రామాల మధ్య ఆర్థికాభివృద్ధి కేంద్రాలుగా చిన్న పట్టణాల అభివృద్ధి, నాణ్యమైన ఆరోగ్యం, పాఠశాల విద్యాప్రమాణాలను మెరుగుపరచటం మాత్రమే భవిష్యత్తుకు మార్గం. ప్రతి సంవత్సరం 1.3 కోట్ల మంది యువత ఉపాధి మార్కెట్‌లోకి అదనంగా వస్తున్నారు. మనం ఆర్థికరంగాన్ని పెంచి, ఇబ్బడి ముబ్బడిగా ఉపాధి అవకాశాల్ని సృష్టించాల్సిన అవసరముంది. ఆదాయాన్ని పెంచటం, ఉపాధి అవకాశాల్ని సృష్టించటం, జీవన నాణ్యతను మెరుగుపరచటం, ప్రజలకు తమ జీవితాలపై, తమ భవిష్యత్తుపై పట్టు లభించేలా తోడ్పాటు అందించటం ద్వారా మాత్రమే పేదరికాన్ని నిర్మూలించగలం. ఏ కూటమి అధికారం లోకి వచ్చినా, పటిష్ఠ ఆర్థిక నిర్వహణ, పెట్టుబడులు, ఆర్థికాభివృద్ధి, ఉపాధి అవకాశాల సృష్టికి ప్రధాన పార్టీలన్నీ నిబద్ధమై ఉండాలి. అప్పుడు మాత్రమే మన భవిష్యత్తు సురక్షితం. ★

# ఎన్నికల్లో పౌర సమాజం మద్దతుపై విమర్శలు

2024 ఎన్నికలు అంతకుముందుతో పోలిస్తే ఆలోచనల మధ్య పోరాటంలా సాగాయనే అభిప్రాయం వ్యక్తమవుతోంది. ఇది మామూలు పోరాటం కాదు, 'సంక్షేమమే పరిపాలన అనే రాజకీయానికి, సంక్షేమంతోపాటు అభివృద్ధి కూడా కీలకం అనే రాజకీయానికి మధ్య జరుగుతున్న నిర్ణయాత్మక పోరాటమని' ప్రజాస్వామ్య పీఠం (ఎఫ్‌డీఆర్), లోక్‌సత్తా వ్యవస్థాపకుడు డాక్టర్ జయప్రకాష్ నారాయణ్ ఈ ఎన్నికలకు ఒక నేపథ్యాన్ని నిర్దేశించారు. ఈ ప్రకటనపై కూడా ఆలోచనల మధ్య ఘర్షణ జరిగింది. జేపీ ప్రారంభించిన లోక్‌సత్తా పార్టీ ప్రస్తుతం ఎన్నికల్లో పోటీ చేయనందున, ఆయన రాజకీయ, పాలనా సంస్కరణల కృషిని ప్రధానంగా ఎఫ్‌డీఆర్ ద్వారా చేస్తున్నారు. ఒక పౌర సమాజ సంస్థకు నేతృత్వం వహిస్తూ రాజకీయ పార్టీకి లేదా కూటమికి మద్దతు పలికితే నిష్పాక్షికంగా పనిచేసే శక్తిని, విశ్వసనీయతను కోల్పోరా? అనే ప్రశ్న తలెత్తింది. మిగతా పౌర సమాజ సంస్థలు ఇటీవల ఎన్నికల్లో ఒక పార్టీకి అనుకూల వైఖరి తీసుకుంటున్నా ఇంత ప్రస్ఫుటంగా ఈ ప్రశ్న ఇంతవరకు సమాజం ముందుకు రాలేదు. ఏపీలో బీజేపీ, టీడీపీ, జనసేనల ఎన్‌డీయే కూటమికి మద్దతు ప్రకటిస్తున్నట్లు జేపీ ప్రకటించిన వెంటనే ఆయనపై విమర్శలు వెల్లువెత్తాయి. కులం, వర్గం అంటూ ఆరోపణలతోపాటు నిష్పాక్షికతపై నిష్టూరాలాడారు. వారిలో కొందరు ఉద్దేశపూర్వకంగా విమర్శించినా, ఎక్కువమంది కొంత బాధను వ్యక్తం చేస్తూ స్పందించారు. ముఖ్యంగా జేపీని అనుసరించే వైకాపా మద్దతుదారులు నిరుత్సాహం వ్యక్తం చేశారు. అంతకుముందెన్నడూలేని రీతిలో ఒక కూటమికి విస్పష్ట మద్దతు పలకటం వల్ల జేపీ ఆలోచనల్లో నిష్పాక్షికత స్థానంలో పక్షపాతం చోటుచేసుకుందని ఆరోపించారు. అందుకే వారిని ఉద్దేశించి జేపీ ప్రత్యేకంగా విజ్ఞప్తి చేశారు.

నిజానికి జేపీ విశ్లేషణలు, ప్రతిపాదనలు వాస్తవాలు, తర్కం, హేతుబద్ధత, గణాంకాలు, ప్రపంచంలో, దేశంలో అంతకుముందు అనుభవాలు ఆధారంగా ఉంటాయి తప్ప, వ్యక్తిగత ఇష్టాఇష్టాల ఆధారంగా ఉండవు. అందువల్ల విశ్వసనీయతను కోల్పోవటమన్న ప్రశ్న తలెత్తదు. మనం ఉద్దేశపూర్వకంగానో, పక్షపాతాలతోనో కాకుండా నిజాలు, పరిష్కారాలు తెలుసుకోవాలని జేపీ వీడియోలను చూస్తే లేదా రచనల్ని చదివితే ఈ విషయం తేలిగ్గా అర్థమవుతుంది. కాబట్టి ఇది జేపీ విశ్వసనీయతకు సంబంధించిన అంశం కాదు. లోక్‌సత్తా పార్టీ వ్యవస్థాపకుడిగానే కాకుండా, పౌర సమాజ నేతగా చురుకైన పాత్ర పోషిస్తూ జేపీ ఒక పార్టీకి, కూటమికి మద్దతివ్వటం కరెక్టేనా అనేది ప్రశ్న. ఇక్కడ కూడా జేపీ అనుసరించే ప్రమాణాలే ప్రాతిపదికలవుతాయి.



ఒక పౌర సమాజ సంస్థ ఎన్నికల్లో ఓ రాజకీయ పార్టీకి మద్దతు ప్రకటించటం తప్పు కాదు. సమాజంలో సంక్షోభ పరిస్థితులు తలెత్తాయని భావించినప్పుడు మద్దతివ్వటం, ప్రచారం చేయటం ఆ సంస్థల బాధ్యత కూడా. అయితే హేతుబద్ధంగా, వాస్తవాలు, గత చరిత్ర ఆధారంగా, తర్కబద్ధంగా తమ వాదనల్ని రూపొందించాలి. అందరి ప్రయోజనాలనూ సమన్వయం చేసేలా పరిష్కారాలతో ఎజెండాను ప్రతిపాదించాలి. తాను ఎందుకు ఎన్‌డీయే కూటమికి మద్దతివ్వాల్సి వచ్చిందో జేపీ ఇలా స్పష్టంగా ప్రజల ముందుంచారు. ఏపీలో వైసీపీ, టీడీపీ-జనసేన-బీజేపీ కూటమి, జాతీయ స్థాయిలో కాంగ్రెస్ నేతృత్వంలోని యూపీయే, బీజేపీ నేతృత్వంలోని ఎన్డీయే కూటమి రెండూ ఆర్థికాభివృద్ధి అవసరం అనే విషయంలో ఒకే తీరుగా వ్యవహరించి ఉంటే, మిగతా విషయాల్లో అన్ని పార్టీలూ ఒకేలా ఉన్నాయి కాబట్టి తాను తటస్థంగా, పార్టీలకతీతంగానే తన కృషిని కొనసాగించేవాడినని, కానీ ఒక పక్షం సంక్షేమం తప్ప అభివృద్ధి అక్కర్లేదు, మరో పక్షం సంక్షేమంతోపాటు అభివృద్ధి కూడా అవసరం అని విడిపోవటం వల్ల ఆర్థిక భవిష్యత్తు పరిరక్షణకు ఎన్‌డీయే కూటమికి మద్దతు ప్రకటించాల్సి వచ్చిందని జేపీ చాలా స్పష్టంగా తెలియచేశారు.

అంతకుముందు తెలంగాణ అసెంబ్లీ ఎన్నికల్లోనూ ఆర్థికాభివృద్ధి ప్రాతిపదికన బీఆర్ఎస్‌కి పరోక్షంగా మద్దతు ప్రకటించినా, ఈసారి చాలా స్పష్టంగా సుదీర్ఘ ప్రెస్‌మీట్ పెట్టి మరీ అన్ని అంశాల్నీ కూలంకషంగా వివరిస్తూ బీజేపీ, తెలుగుదేశం, జనసేనల ఎన్‌డీయే కూటమికి జేపీ మద్దతు ప్రకటించారు. ఈవేళ భారతదేశంలో జరుగుతున్న ఎన్నికలు మామూలు పోటీ కాదని, సంక్షేమమే పరిపాలన అనే రాజకీయానికి, సంక్షేమంతోపాటు అభివృద్ధి కూడా అవసరం అనే రాజకీయానికి మధ్య జరుగుతున్న పోరని, ఈ తేడా ఆంధ్రప్రదేశ్‌లో మరీ నలుపు, తెలుపుగా విస్పష్టంగా ఉన్నందున ఏపీలో జరుగుతున్న ఎన్నికలు నిర్ణయాత్మకమైనవని పేర్కొన్నారు. సంక్షేమం అవసరమని, కానీ సంక్షేమం తప్ప వేరేమీ లేకుండా అదే పరిపాలన అయితే, ఎన్నేళ్లు సంక్షేమం ఇచ్చినా పేదలు, వారి పిల్లలు పేదలుగానే మిగిలిపోతారని హెచ్చరించారు. సంక్షేమమే పరిపాలన అంటూ బటన్ నొక్కి ఆ పథకాలు అందించినందుకు తనకు ఓటు వేయాలని, అభివృద్ధి గురించి మాట్లాడేవాళ్లు పేదలకు శత్రువులన్నట్లు వ్యవహరిస్తూ ఎన్నికల్ని క్లాస్‌వార్‌గా

అభివర్ణిస్తూ విద్వేషాల్ని రెచ్చగొట్టిన జగన్ పార్టీ తీరును ఖండించారు. నిజానికి అభివృద్ధి కావలసినది పేదలకని, సంక్షేమమే పరిపాలన అని వారిని మభ్యపెట్టటం పేదరికాన్ని నిరంతరం కొనసాగించటమని స్పష్టం చేశారు.
వచ్చే 25 ఏళ్లపాటు భారతదేశానికి ఆర్థిక రంగంలో వేగంగా ఎదిగే అవకాశముందని, అప్పులు చేసి మరీ సంక్షేమం అందించకుండా సంక్షేమం, అభివృద్ధి మధ్య సమతూకం పాటిస్తే 7–8% వృద్ధి రేటు స్థిరంగా కొనసాగి భారత్ సంపన్న దేశాల సరసన చేరే అవకాశముందని జేపీ తెలిపారు. కులం, వర్గం, ఫ్యాక్షన్ దృక్పథం లేకుండా అభివృద్ధిని, బిడ్డల ఆర్థిక భవిష్యత్తుని దృష్టిలో పెట్టుకుని ఓటు వేయాలని విజ్ఞప్తి చేశారు. అదేవిధంగా జాతీయ స్థాయిలో కూడా కాంగ్రెస్ పార్టీకి విరుద్ధంగా బీజేపీ స్పష్టమైన ఎజెండాతో అభివృద్ధికి హామీ ఇవ్వటంతో బీజేపీ నేతృత్వంలోని ఎన్డీయేకి జేపీ మద్దతు ప్రకటించారు. నిజానికి జాతీయస్థాయిలో మోదీ సారథ్యంలోని ఎన్డీయే మేనిఫెస్టో ఆర్థిక క్రమశిక్షణతో అభివృద్ధికి పెద్ద పీట వేసింది. ఆర్థికాభివృద్ధి విషయంలో మోదీ నేతృత్వంలోని ఎన్డీయే ప్రభుత్వానికున్న ట్రాక్ రికార్డు మొదటినుంచీ కాదనలేనిది. ఎన్నికలకు ముందు ఫిబ్రవరిలో ప్రకటించిన తాత్కాలిక బడ్జెట్‌లో కూడా ఆనవాయితీకి భిన్నంగా వ్యవహరించి, ఎటువంటి అదనపు తాత్కాలిక పథకాలను ప్రకటించలేదు. 2024 ఎన్నికల మేనిఫెస్టోని కూడా ఇదే ఒరవడిలో రూపొందించారు. 2014లో తమ హయాంలో ప్రారంభించిన దేశాభివృద్ధిని వికసిత్ భారత్ స్థాయికి తీసుకెళ్లటానికి స్వతంత్ర భారతానికి వందేళ్లు పూర్తయ్యే 2047 దాకా అమలయ్యే దీర్ఘకాలిక రోడ్‌మ్యాప్‌కి ఈ ఎన్నికలు గట్టి పునాది కావాలని ఓటర్లకు విజ్ఞప్తి చేస్తూ, అభివృద్ధి, సంక్షేమం మధ్య సమతూకాన్ని పాటించే రీతిని కొనసాగిస్తూ 'సంకల్ప పత్రం' పేరుతో మేనిఫెస్టోను బీజేపీ విడుదల చేసింది. 10 సామాజిక సమూహాలు, 14 ప్రధాన అంశాలను దృష్టిలో పెట్టుకుని దీన్ని రూపొందించారు. ఈసారి గెలిపిస్తే దేశంలో పెద్దమార్పులు తీసుకొస్తామని ప్రకటించింది. బీజేపీ తన గత మేనిఫెస్టోల్లో ఇచ్చిన హామీల్ని ఎంత చిత్తశుద్ధితో అమలు చేసిందో వివరిస్తూ, పౌరసత్వ సవరణ చట్టం, మహిళా రిజర్వేషన్ చట్టం, విదేశాల్లో భారతదేశ ప్రతిష్ఠ పెరగటం మొదలైన అంశాల్ని విస్తృతంగా ప్రజల్లోకి తీసుకెళ్లే ప్రయత్నం చేసింది. దేశ చరిత్రలోనే రికార్డు స్థాయిలో మౌలిక వసతులకు రూ.13 లక్షల కోట్లకు పైగా చేసిన కేటాయింపుల వల్ల ఉపాధి అవకాశాలకు హామీ ఇచ్చింది. 80 కోట్ల మందికి ఉచిత ఆహార ధాన్యాల పథకాన్ని మరో అయిదేళ్లపాటు పొడిగించటం మినహాయించి, మేనిఫెస్టోలోని మిగిలిన తాత్కాలిక పథకాలు చాలామేర ఉత్పాదకతను పెంచే సంక్షేమ పథకాలు. ఉదాహరణకు, పేదలకు 3 కోట్ల ఇళ్లు, పేద కుటుంబాలకు ఉచిత సౌర విద్యుత్తు పథకం, పంటలకు ఎరువులు పిచికారి చేసే డ్రోన్లు, 3 కోట్ల మంది మహిళా స్వయంసహాయక బృందాలకు అందించి ఆదాయం పొందేలా చేయూత, నగరాల్లో తోపుడుబండ్లపై పండ్లు, కూరగాయలు, ఇతర వస్తువులు విక్రయించే వారికి రుణాలిచ్చే స్వనిధి యోజన చిన్న పట్టణాలకు, గ్రామాలకు విస్తరణ, రూ.50 వేల రుణపరిమితి పెంపు. ఉత్పత్తుల మార్కెటింగ్, చిన్న వ్యాపారులు, ఎంఎస్ఎంఈ పారిశ్రామికవేత్తలు సాంకేతికతను ఉపయోగించుకుని వ్యాపారాన్ని విస్తరించుకునే ఏర్పాట్లు వంటివి. దేశంలో డిజిటల్, డేటా, సుపరిపాలన కోసం మౌలిక వసతులు కల్పిస్తామని హామీ ఇచ్చింది. ఈ నేపథ్యంలో తెలంగాణ లోక్‌సభ ఎన్నికల ప్రచారంలోనూ ఎన్డీయేకు మద్దతుగా కొన్ని కార్యక్రమాల్లో జేపీ పాల్గొన్నారు.

ప్రచారంలో మోదీ తడబాటు, తొందరపాటు వల్ల ఆ పౌర సమాజ సంస్థలు గొంతు పెంచేందుకు అవకాశం లభించింది. అయితే అప్పుడు కూడా ప్రజాస్వామ్యాన్ని నినాదానికే పరిమితం చేశారు. ప్రజాస్వామ్యాన్ని పరిపుష్టం చేయటానికి నిర్మాణాత్మక ఎజెండాను చూపకుండా సంకీర్ణ ప్రభుత్వాన్ని పరిష్కారంగా చూపే ప్రయత్నం చేశారు.

### ఎజెండా లేకుండా మోదీని గద్దె దించటమే లక్ష్యంగా కొన్ని పౌర సమాజ సంస్థలు

అదేవిధంగా ఎన్నికల సమయంలో ప్రజాభిప్రాయాన్ని మలచటంలో ఇటీవలికాలంలో చురుగ్గా ఉన్న కొన్ని ఇతర పౌర సమాజ సంస్థలు తీసుకున్న వైఖరిని చూస్తే, ఏపీలో పనిచేసిన కొన్ని సంస్థలు, కొందరు పౌర ప్రముఖులు అభివృద్ధికి అనుకూలంగా జేపీ వాదనకు మద్దతివ్వగా, తెలంగాణలో ఎక్కువ సంస్థలు అసెంబ్లీ ఎన్నికల సమయంలో వ్యవహరించినట్లే ఒక నిర్మాణాత్మక ఎజెండా లేకుండా బీజేపీని గద్దె దించటమే ప్రధాన లక్ష్యంగా పనిచేశాయి. మోదీ వల్ల దేశంలో ప్రజాస్వామ్యం ప్రమాదంలో పడిందని వారి వాదన. అణగారిన కులాలు, పేదలకు రిజర్వేషన్లు, స్కీములు అందించాలంటే కులగణన ఎందుకు అవసరం వంటి చర్చ కూడా చేయకుండా పలు అంశాల్లో ప్రతిపక్షాల వాదనను బలపరిచారు.

### మోదీ తడబాటుతో సంకీర్ణం వాదనలు

దశలవారీ ఎన్నికలు మొదలయ్యాక ప్రచారంలో మోదీ తడబాటు, తొందరపాటు వల్ల ఆ పౌర సమాజ సంస్థలు గొంతు పెంచేందుకు అవకాశం లభించింది. అయితే అప్పుడు కూడా ప్రజాస్వామ్యాన్ని నినాదానికే పరిమితం చేశారు. ప్రజాస్వామ్యాన్ని పరిపుష్టం చేయటానికి నిర్మాణాత్మక ఎజెండాను చూపకుండా సంకీర్ణ ప్రభుత్వాన్ని పరిష్కారంగా చూపే ప్రయత్నం చేశారు.
సార్వత్రిక ఎన్నికలకు కొన్ని నెలల ముందు వరకు నరేంద్ర మోదీ నేతృత్వంలోని ఎన్డీయే కూటమి భారీ మెజారిటీతో గెలుస్తుందని, కాంగ్రెస్ భాగస్వామ్యమున్న ప్రతిపక్షాల 'ఇండి' కూటమి పరిస్థితి బలహీనంగానే ఉందని అంచనాలు వెలువడ్డాయి. అయోధ్యలో రామమందిర ప్రారంభ సమయంలో ప్రధాని మోదీ ఎన్డీయేకి 400కి పైగా సీట్లు ఖాయమని ప్రకటించారు. వీటిలో ఆర్టికల్ 370 రద్దుకు చిహ్నంగా బీజేపీకే

సొంతంగా 370 సీట్లు అందించాలని ప్రజల్ని కోరారు. ఖాయంగా ఆ సీట్లు వస్తాయని విశ్వాసం వ్యక్తం చేశారు. ఎన్నికల తర్వాత 100 రోజుల కార్యాచరణపై శాఖల వారీగా నివేదికల్ని సిద్ధం చేసుకోవాలని మంత్రివర్గ సమావేశం పెట్టి మరీ ఆదేశాలిచ్చి, ఫలితాలు వెలువడిన వెంటనే హామీల అమలుకి వేగంగా ప్రారంభిస్తామని కూడా ప్రకటించారు. అయితే దేశ చరిత్రలో ఇప్పటివరకూ జరిగిన ఎన్నికల తీరును బట్టి, ప్రస్తుత రాజకీయ వాతావరణాన్ని బట్టి 50 శాతం పైబడి ఓట్లు సాధించటం అసాధ్యమైన లక్ష్యంగా కనిపిస్తుంది. నాలుగొందల సీట్ల లక్ష్యాన్ని సాధిస్తామని ప్రకటనైతే చేశారు గానీ, ఇది ఆచరణసాధ్యమా అనే సంశయం మోదీకి కూడా ఉన్నట్లు కనిపిస్తుంది. ఇప్పటి వరకూ చెప్పిన ఎజెండాను అమలు చేస్తోందన్న విశ్వసనీయత బీజేపీకి ఉన్నా, అయోధ్య మందిరం అంశానికి ప్రజల్లో ఎంత స్పందన వచ్చినా, తాను స్వయంగా దేశమంతా ఆలయాలు తిరిగి అయోధ్య రాముడి విగ్రహ ప్రతిష్ఠాపన కార్యక్రమంలో పాల్గొని సర్వం తానే అన్నట్లు వ్యవహరించినా, ప్రచారాన్ని హోరెత్తించినా తాను ఆశించిన స్థాయి భారీ మెజారిటీ కష్టమనే అనుమానం వల్లే ఎక్కడ వీలుంటే అక్కడ ఎన్డీయే భాగస్వాముల సంఖ్యను పెంచుకునే ప్రయత్నం చేస్తూ వచ్చారనే విమర్శలున్నాయి. అదే విధంగా ఈడీ (ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్) దాడులను కూడా ఎన్నికల సమయంలో వ్యూహాత్మకంగా ఉధృతం చేశారు. ఇంతస్థాయిలో యుద్ధం అవసరం లేకుండానే ఎన్డీయేకి సాధారణ మెజారిటీ సాధ్యమైనా, పెద్ద మార్పుల కోసమే మోదీ ఇవన్నీ చేశారన్నవాళ్లూ ఉన్నారు. అయితే ఈ తీరు వల్ల ఎన్నికలు మొదలయ్యాక మోదీ ప్రతిపక్షాల నుంచి ఒత్తిడిని ఎదుర్కొని అభద్రతకు గురయ్యే పరిస్థితులు ఏర్పడ్డాయి.




ఈడీ దాడులతో ప్రతిపక్షాల్లో ఐక్యత పెరగటానికి, భయాందోళనలతో గట్టిగా పోరాడటానికి ఒక రకంగా మోదీయే కారణమయ్యారు. బీజేపీ మేనిఫెస్టోకి 'మోదీకి గ్యారంటీ' అంటూ మొత్తం ప్రచారానికి తననే కేంద్రబిందువు గావించుకున్నారు. మోదీ వర్సెస్ ప్రతిపక్షాలు అనే పరిస్థితిని స్వయంగా కల్పించుకున్నారు. ఇది సంస్థాగతంగా పార్టీ పనితీరుపై కొంత ప్రతికూల ప్రభావం చూపగా, ప్రజల్లో కూడా కొంత అసంతృప్తిని కలిగించింది. ఎంత తాము అభిమానించే నాయకుడయినా మరీ గొప్పలకు పోవటం నచ్చని సమాజం మనది. ప్రతిపక్షాలు గట్టిగా పోరాటం చేయటం, మోదీ వ్యక్తిగత ప్రచారం శ్రుతి మించినట్లుండటం, నిరుద్యోగం, ధరల పెరుగుదల వంటి రోజువారీ ప్రభావం చూపే కీలకాంశాలలో ప్రజల్లో అప్పటికే ఉన్న వ్యతిరేకత కలగలసి మొదటి రెండు దశల ఓటింగ్‌లో ప్రతిఫలించిందనే అభిప్రాయం వ్యక్తమైంది. దీనివల్లే రెండో దశ ఓటింగ్‌కు ముందు ప్రధానిగా తన స్థాయిని మరచి, కాంగ్రెస్ గెలిస్తే హిందువుల ఆస్తుల్ని లెక్కించి ముస్లింలకు పంచుతారని ఆ పార్టీ మేనిఫెస్టోను ప్రస్తావిస్తూ మోదీ వ్యాఖ్యానించారని భావిస్తున్నారు. అదేవిధంగా ఎన్డీయే నాలుగొందల సీట్ల లక్ష్యం పట్ల ప్రజల్లో అనుమానాలు రేకెత్తించేలా ప్రతిపక్షాలు రాజ్యాంగం, రిజర్వేషన్ల పట్ల ప్రచారం చేయటంతో అప్పటిదాకా తాను చెప్పదలచుకున్న అంశాల స్థానంలో కులం, మతం వంటి అంశాలపై ప్రతికూల ఉద్వేగాలను రెచ్చగొట్టారు.

ఈ ఎన్నికల్లో మోదీకి అన్నీ అనుకూలంగా ఉన్నాయని తొలుత భావించిన మోదీ వ్యతిరేక పౌర సమాజ సంస్థలు, ఎప్పుడైతే బీజేపీకి ఏకపక్షంగా మెజారిటీ రాదని అంచనాలు రావటం మొదలైందో సంకీర్ణ ప్రభుత్వ వాదనలు మొదలుపెట్టాయి. సంకీర్ణ ప్రభుత్వాలు వస్తే ప్రజాస్వామ్యాన్ని కాపాడుకోవచ్చని ప్రచారం చేస్తూ మిగిలిన దశల్లో ఓటింగ్‌ను ప్రభావితం చేసే ప్రయత్నం చేశాయి. ఈ వాదనలో కూడా ఎలాగోలా మోదీని గద్దె దించాలన్న తాత్కాలిక ధోరణి తప్ప, భావ సారూప్యం, దేశ ఆర్థిక భవిష్యత్తు కోసం స్పష్టమయిన ప్రణాళిక లేకుండా సంకీర్ణ ప్రభుత్వాలు ఎలా సర్వరోగనివారణి అవుతాయో స్పష్టత లేదు. సంకీర్ణంలో ప్రభుత్వాలు కొంత పారదర్శకంగా, పట్టువిడుపులతో వ్యవహరించవచ్చు, కొన్ని మంచి నిర్ణయాలు తీసుకొని ఉండవచ్చు, కానీ సంకీర్ణం వల్లే పీవీ నరసింహారావు, మన్మోహన్‌సింగ్, వాజపేయి దేశ ఆర్థిక వ్యవస్థకి గట్టి పునాది వేశారని, కొన్ని దీర్ఘకాల పాలనా నిర్ణయాలు తీసుకున్నారని భావించగలమా? ప్రభుత్వం, మంత్రివర్గం ఏకోన్ముఖంగా కదలకుండా నిరంతరం కలహించుకునే సంకీర్ణ ప్రభుత్వాల వల్ల కొన్ని కీలక నిర్ణయాలు వాయిదా పడటం, భాగస్వామ్య పక్షాలు బెదిరింపు ధోరణులతో తమ అడ్డగోలు డిమాండ్లను సాధించుకోవటం వల్ల ఈ దేశం నష్టపోయిన సందర్భాలు కూడా ఉన్నాయి. కాబట్టి మన దేశం ఎదుర్కొంటున్న సంక్షోభాలకు, మోదీ ప్రభుత్వ వైఫల్యాలకు సంకీర్ణాలు వంటి పరిష్కారాలు వెతకటం, ప్రభుత్వాలకు వ్యతిరేకంగా ఎంత రోడ్డెక్కగలిగితే, ఎంత పచ్చిగా విమర్శలు చేయగలిగితే అంత ప్రజాస్వామ్యం ఉందని భావించటం పలాయనవాదమవుతుంది తప్ప పరిష్కారమవదు.

నిస్సందేహంగా మన దేశంలో ఎన్నికయిన ప్రభుత్వాలలో,

కొందరు నాయకులలో అప్రజాస్వామిక ధోరణులు, ఒంటెద్దు పోకడలు ఉన్నాయి. రాహుల్‌గాంధీపై హడావుడిగా వేటువేయటం, కాంగ్రెస్ పార్టీ నిధులని జప్తు చేయటం, ముఖ్యమంత్రులని ఎన్నికల ముందు అరెస్టు చేయటం, మైనారిటీలపై విరుచుకుపడి సమాజంలో విభజనల్ని పెంచటం – ఇవన్నీ చేయకూడని పొరపాట్లు. అయితే పార్టీలు ఎంతగా కులం, మతం, ప్రాంతం, భాష పేరుతో విభజించే ప్రయత్నం చేసినా, ఒక పరిమితి దాటితే మన సమాజం ఈ విభజనలని తిరస్కరిస్తుందని గత 75 ఏళ్ళలో మళ్ళీ మళ్ళీ రుజువయింది. అందుకు ఈ ఎన్నికల ఫలితాలే తిరుగులేని రుజువు. రాజకీయాన్ని, పాలనా వ్యవస్థని సమూలంగా సంస్కరించటం అవసరం. కాని మన ప్రజాస్వామ్యాన్ని బతికిస్తోంది మన సమాజం, మన ఓటర్లు. కాబట్టి వ్యవస్థాగత పరిష్కారాలపై దృష్టి సారించాలి తప్ప, ప్రతిరోజు ప్రజాస్వామ్యం అంతరించిపోతోందని, నియంతృత్వం వచ్చేస్తోందని వాపోవటం అతిశయోక్తి. బుద్ధుడు చెప్పినట్లుగా సమ్యక్ దృక్పథం ఉంటేనే మన రాజకీయాన్ని, పరిపాలనని సంస్కరించటం సాధ్యమవుతుంది. మన రాజకీయం దేవతలు-రాక్షసుల మధ్య పోరాటం కాదు; అది లోపభూయిష్టమయిన శక్తుల మధ్య పోరాటం.

**మీడియా రాజకీయ మొగ్గు**

అదేవిధంగా మీడియా రాజకీయ మొగ్గు చూపటం కూడా ఈ ఎన్నికల్లో చర్చకొచ్చింది.

అధికార పార్టీ ఒత్తిడుల వల్ల కావచ్చు, ఇతరత్రా కారణాలరీత్యా కావచ్చు, మీడియా ఎన్నికల్లో కొన్ని పార్టీల పట్ల మొగ్గు చూపటం మన దేశంలో ఎప్పటినుంచో ఉంది. అయితే ఈ ఎన్నికల్లో ప్రచారం గతంలో ఎన్నడూలేని స్థాయిలో, పార్టీల వీరాభిమానులు కూడా కొన్నిసార్లు అయోమయానికి గురయ్యేలా, నిజమేంటో అర్థంకాక తరచూ గందరగోళపడే రీతిలో జరగటం తీరు చూశాక, అసలు మీడియా ఒక పార్టీ పట్ల మొగ్గు చూపటం ప్రజాస్వామ్యంలో సరైన చర్యేనా? అని మరింత లోతుగా అనుమానం కలగకమానదు. ప్రజాస్వామ్యం, రాజకీయం గురించి అవగాహన కలిగినవారు చెప్పేదేంటంటే, నిష్పాక్షికంగా వార్తలను, విశ్లేషణను అందించటంతోపాటు ప్రజాహితాన్ని పట్టించుకోవాల్సిన బాధ్యత కూడా మీడియాకు ఉంది. సమాజానికి హాని చేసే భావాల్ని, నాయకుల్ని నియంత్రించటంతోపాటు పనికొచ్చే భావాల్ని మీడియా ప్రచారం చేయాలి. సమస్యల్ని ఎత్తిచూపటంతోపాటు నిర్మాణాత్మక పరిష్కారాల్ని ప్రపంచం నలుమూలల్నుంచి సేకరించి అందించాల్సిన బాధ్యత మీడియాది. కొవిడ్ సమయంలో కావచ్చు, ఇతరత్రా కొన్ని సంక్షోభాలు తలెత్తినప్పుడు కావచ్చు, ప్రజలను మేలుకొలపటంలో, వారికి అండగా నిలవటంలో మీడియా కీలక పాత్ర పోషించింది. పలు కుంభకోణాల్ని వెలికితీయటంలో, అవినీతిపై ప్రజల్లో చైతన్యం పెంచటంలో, హక్కుల పరిరక్షణలో మీడియా విలువైన పాత్ర నిర్వహించింది. అలాంటి మీడియా విస్తృత ప్రజాహితంలో భాగంగా ఏదోక పార్టీ వైపు ఎన్నికల్లో మొగ్గు చూపటంలో తప్పు లేదు. అయితే ఈసారి తరచూ ఆ గీత దాటిపోయి మన మీడియా నిజమైన సమస్యల్ని, నిర్మాణాత్మక పరిష్కారాల్ని కాకుండా, కుల, మత స్పృహను, విద్వేషాల్ని రెచ్చగొట్టేలా ప్రచారం చేసిందని సమాజహితం కోరేవారు అభిప్రాయపడుతున్నారు. తాము మద్దతిస్తున్న పార్టీల తప్పుల్ని, లోపాల్ని పూర్తిగా కప్పిపుచ్చి, కేవలం అవతలిపక్షం మీద దాడి చేసే రీతిలో మీడియా వ్యవహరించిందన్న ఆరోపణలున్నాయి. ఈ ఎన్నికల్లో ప్రచారం ఎక్కువగా సోషల్ మీడియా ద్వారా జరిగినా, పలు పత్రికలు, టీవీ ఛానళ్ల పాత్ర కూడా గణనీయంగానే ఉంది. నిజానికి సోషల్ మీడియా వీడియోలు, కంటెంట్‌కు చాలా సందర్భాల్లో ఇవి మూలవనరుగా ఉపయోగపడ్డాయి, చర్చను నిర్దేశించాయి.

కాబట్టి ఎన్నికల్లో పౌర సమాజ చురుకైన పాత్రను ప్రోత్సహించటం, నిర్మాణాత్మక పరిష్కారాల దిశగా ఉపయోగించుకోవటం సరైన వైఖరి అవుతుంది.

2024 ప్రపంచవ్యాప్తంగా ఎన్నికల సంవత్సరం. పలు దేశాల్లో ఎన్నికలు జరుగుతున్నాయి. ఎన్నికలు జరుగుతున్నాయి గదా అని చాలా దేశాల్లో ప్రజాస్వామ్యం పరిఢవిల్లుతోందనుకోనక్కర్లేదు. ప్రజాస్వామ్యానికి దిక్సూచిగా చెప్పుకునే అమెరికా లాంటి దేశంలో కూడా ఒడిదుడుకులనెదుర్కొంటోంది. చాలా దేశాల్లో ప్రజాస్వామ్యం మొక్కుబడిగా తయారైంది. కానీ ప్రజాస్వామ్య ముద్ర కోసం పోటీపడుతున్నందున నియంతలు కూడా తమ దేశాల్లో ఎన్నికలు నిర్వహిస్తున్నారు. ఎన్నికల్లో నేరపూరితంగానైనా భారీ మెజారిటీ సంపాదించి ప్రజల మద్దతున్న నేతలమని చాటుకుంటున్నారు. మన దేశంలో కూడా ప్రజాస్వామ్యం ఎన్నికలకే పరిమితమైందన్న విమర్శలున్నాయి. నియంతృత్వ దేశాల స్థాయిలో కాకున్నా, ఎన్నికల సమయంలో ప్రజాభిప్రాయాన్ని కృత్రిమంగా నిర్మించేందుకు వ్యవస్థలను అడ్డం పెట్టుకుని పెద్దఎత్తున ప్రయత్నం జరుగుతోందనే ఆరోపణలున్నాయి. పెద్దఎత్తున నల్లడబ్బు వినియోగమవుతోంది. కానీ, లోపభూయిష్టమైనా మనకు ప్రజాస్వామ్యం ఉంది. మనది బలమైన ప్రజాస్వామ్యం, నిజమైన ప్రజాస్వామ్యం. ప్రపంచానికి ఆధునిక ప్రజాస్వామ్య స్ఫూర్తినందించిన అమెరికా కంటే కొన్ని విషయాల్లో మనం మెరుగ్గా ఉన్నామని భారత్‌లో అమెరికా రాయబారి ఎరిక్ గార్సెట్టి సైతం ఇటీవల వ్యాఖ్యానించారు. మన ప్రజాస్వామ్యంలోని లోపాల్ని తొలగించటం ఎలా అనే చర్చ చేసి అంశాలవారీగా నిర్దిష్ట ఎజెండాను ప్రతిపాదించకుండా మోదీని దించితే లేదా సంకీర్ణ ప్రభుత్వం ఏర్పడితే సమస్యలు పరిష్కారమవుతాయనటం అపరిపక్వ పోరాటమవుతుంది. ఈ ఎన్నికలు గతంతో పోలిస్తే భారత్‌లో కొంత ఆలోచనల మధ్య పోరాటంగా జరిగాయని పౌర సమాజం పాత్ర, ప్రచారం తీరు చూస్తేనే అర్థమవుతుంది. వచ్చే పాతికేళ్లపాటు భారతదేశానికి ఉన్న ఆర్థికాభివృద్ధి అవకాశాన్ని సద్వినియోగం చేసుకునేలా. పరిపక్వ ప్రజాస్వామ్యాన్ని

నిర్మించుకునేలా ఈ ఆలోచనల మధ్య సంఘర్షణ, చర్చ సాగాలి. నిర్మాణాత్మకమయ్యేలా ఆలోచనలు పదునెక్కాలి. భావాల మధ్య విభేదాలు సహజం. కానీ మన ప్రయోజనాలేమిటో, మన పిల్లల భవిష్యత్తు ఏ రకంగా అయితే మెరుగ్గా ఉంటుందో తెలుసుకోగలిగే విజ్ఞత ఉంటే చాలు, వాస్తవాలు, హేతుబద్ధత ఆధారంగా ఏకాభిప్రాయానికి లేదా మధ్యేమార్గానికి రావటం పెద్ద కష్టం కాదు. అందరికీ ఎదిగే అవకాశాలున్న ప్రజాస్వామ్యాన్ని నిర్మించుకోవటం అప్పుడు సాధ్యమవుతుంది. ప్రజాస్వామ్యం అంటే కేవలం నినాదమివ్వటం కాదు.

ప్రజాస్వామ్యం అంటే పుట్టుకతో వివక్ష లేకుండా అందరికీ సమానావకాశాలుండాలి, అందరికీ సమాన న్యాయం అందాలి, ప్రజలు తాము వేసే ఓటుకి, తమ జీవితంలో వచ్చే మార్పుకి మధ్య సంబంధం అర్థం చేసుకునేలా వ్యవస్థ నిర్మాణం ఉండాలి. ఇందుకోసం చట్టబద్ధపాలన, వ్యక్తిగత ఆర్థిక భారం లేకుండా ప్రజలందరికీ నాణ్యమైన విద్య, ఆరోగ్యం, ఉపాధి అవకాశాల్ని సృష్టించేలా మౌలిక వసతులు, పెట్టుబడులను ప్రోత్సహించటం, కేంద్రీకృత పాలన స్థానంలో స్థానిక ప్రభుత్వాల సాధికారత, నిజాయతీ, నిబద్ధత గల సామాన్య ప్రజలు చట్టసభలకు ఎన్నికయ్యేలా దామాషా ఎన్నికల పద్ధతి మొదలైన ఏర్పాట్లు నిర్మించుకోవాలి. ఎన్నికల్లో ఎవరు గెలిచారు, ఎవరు ఓడారు అని కాకుండా ఎన్నికల సమయంలో మనం ప్రదర్శించిన ఆలోచనా చైతన్యాన్ని ఎన్నికల తర్వాత ఈ ఎజెండా సాధించేందుకు నిర్మాణాత్మకంగా ఉపయోగించాలి. ఎన్నికల్లో ఎవరు గెలిచినా ఈ ఎజెండాను అమలు చేయించేందుకు మనందరం కలసి కృషి చేయాలి. ప్రజాస్వామ్యాన్ని బలోపేతం చేయాలి.

### ఎక్కువ ఫలితాలు సాధించేలా ఎఫ్‌డీఆర్ కృషి

ఇంకో అంశం. జేపీ ఎన్నికల్లో ఎన్‌డీయే కూటమికి మద్దతివ్వటాన్ని సమర్థించిన పలువురు, ఆయన మరిన్ని ఎక్కువ బాధ్యతలు తీసుకోవాలని సూచనలు చేస్తున్నారు. ఎన్నికల్లో పోటీ చేయాలని, విద్యను బాగు చేయటానికి కొన్ని నమూనా స్కూళ్లు స్థాపించాలని కోరుతున్నారు. రాజకీయ ఉద్యమం, పౌర సమాజం పాత్రకి ఈ రకమైన స్పందన మంచి పరిణామం. మన ప్రజాస్వామ్య పరిధిని విస్తృతం చేస్తుంది. ఈసారి ఎన్నికల్లో, ముఖ్యంగా ఏపీలో ఎంత ఖర్చయిందో అందరం చూశాం. అంచేత డబ్బు, ప్రలోభాలు, తాత్కాలిక తాయిలాలు లేకుండా ఎన్నికల్లో పోటీకి తెలుగునాట ప్రస్తుతానికి అవకాశాలు తక్కువని వేరే చెప్పనక్కర్లేదు. ఎప్పుడైనా పరిస్థితులు మెరుగై కనీసం 10 శాతం ఓట్లు ప్రలోభాలకు లోనుకాకుండా హేతుబద్ధ విధానాలకు, నిబద్ధత గల రాజకీయానికి నిలకడగా వస్తుంటే, అప్పుడు ఎన్నికల్లో పోటీ గురించి లోక్‌సత్తా ఆలోచించవచ్చు. అదేవిధంగా విద్యలో లోక్‌సత్తా ప్రతిపాదించే విధానాలతో కొన్ని స్కూళ్లు ఏర్పాటు చేయాలనే ప్రతిపాదన పార్టీ ఎన్నికల్లో పోటీ చేసే సమయంలో కూడా వచ్చింది. అయితే ఎక్కువ సమయం, నిరంతరం పర్యవేక్షణ అవసరమైన అంశం కావటంతో, దాంతో పోలిస్తే విధానపరంగా రాజకీయ ఎజెండాను ప్రభావితం చేయటం వల్ల ఎక్కువ ఫలితమొచ్చే అవకాశం ఉంటుంది కాబట్టి, అప్పట్లో ప్రతిపాదనను పక్కనపెట్టారు. ఆ తర్వాత 2020లో జాతీయ నూతన విద్యావిధానంలో లోక్‌సత్తా ఆలోచనలకి చోటు లభించింది. తాజాగా ఎఫ్‌డీఆర్, లోక్‌సత్తా తరపున విద్యను బాగుచేసేందుకు ఒక బృహత్తర కార్యక్రమాన్ని జేపీ చేపట్టారు. మన దేశంలో ప్రస్తుతం 28 కోట్ల మంది స్కూలు విద్యార్థులున్నారు. వారిలో 80 శాతం మంది దాకా విద్యాప్రమాణాలు లేక భవిష్యత్తును నష్టపోయే ప్రమాదంలో ఉన్నారు. అందువల్ల పాఠశాల విద్యాప్రమాణాలు మెరుగుపరిచేందుకు సాంకేతికత సాయంతో ఎఫ్‌డీఆర్ కృషి చేస్తోంది. ఇప్పటికే విద్యలో విలువైన కృషి చేస్తున్న పలు సంస్థలను, వ్యక్తులను, ఉపాధ్యాయులను ఇందులో భాగస్వాముల్ని చేస్తోంది. ఈ ప్రయత్నం ద్వారా దేశంలోని కనీసం 10 శాతం మంది పిల్లలకైనా తొలిదశలో విద్యాప్రమాణాలు మెరుగుపరచాలని ప్రయత్నిస్తోంది. మిగిలిన సంస్కరణల కోసం చేస్తున్న రాజకీయ కృషి యధావిధిగా ప్రతిరోజూ కొనసాగిస్తూనే విద్యాప్రమాణాల కోసం ఈ ప్రయత్నం చేస్తోంది. అదేవిధంగా, ప్రతి ఒక్కరూ, ముఖ్యంగా యువతీ యువకులు దేశంలో తమ కెరీర్‌ని, ఆదాయాల్ని చూసుకుంటూనే, తమకు మెరుగైన రోజువారీ అవసరమైన సేవలు, భవిష్యత్తు కోసం చుట్టూ ఉన్న పరిపాలనను ఏ రకంగా బాగుచేసుకోవాలి? రాజకీయాన్ని ఏ రకంగా మెరుగుపరచాలి? ప్రభుత్వాల విధానాలు, ప్రతిపక్షాల ప్రత్యామ్నాయాల మధ్య సరైన విధానాన్ని ఏ రకంగా నిగ్గుతేల్చుకోవాలి? అందుకు ప్రాతిపదికలు ఏమిటి? మొదలైన అంశాలపై ప్రాథమిక అవగాహన పెంచుకునేలా ఒక ఆన్‌లైన్ శిక్షణా కార్యక్రమాన్ని కూడా ఎఫ్‌డీఆర్ ప్రారంభించనుంది. ఈ అవకాశాన్ని ఉపయోగించుకున్న యువత ప్రత్యక్ష రాజకీయాల్లో ఆసక్తి ఉంటే, స్థానిక ఎన్నికల్లో పోటీ చేసి ప్రజాసేవలో భాగస్వామువ్వచ్చు, రాజకీయాల్లో మార్పుల్ని ప్రభావితం చేస్తూ క్రమంగానైనా పైస్థాయికి ఎదగొచ్చు. ఎన్నికల్లో పోటీ వల్ల ప్రచారం లభించవచ్చుగానీ, ఆశించిన ఫలితం వచ్చేంతవరకూ సమయాన్ని, వనరులనూ వృథా చేయటమవుతుంది. దానికి బదులు, ప్రభుత్వాలు, రాజకీయ పార్టీల ద్వారా సంస్కరణల్ని సాధించేందుకు కృషి చేయటం, విధానాల మీద ప్రజలను చైతన్యపరచటం, యువతను అవగాహనగల నాయకులుగా తీర్చిదిద్దటం మొదలైన అంశాల కోసం సమయాన్ని వెచ్చించటం వల్ల ఎక్కువ ఫలితాల్ని సాధించగలం. కచ్చితంగా మన ప్రజాస్వామ్యం మెరుగుపడుతుంది. సాధ్యమైనంత వేగంగా మార్పు వచ్చేలా, ప్రజలు సంక్షుభిత సవాళ్లను ఎదుర్కొనేటప్పుడు, మార్పుకి సిద్ధమైనప్పుడు గందరగోళానికి ఆస్కారం లేకుండా వెంటనే హేతుబద్ధ ఎజెండాతో వారికి మార్గదర్శనం చేసేలా ఎఫ్‌డీఆర్, లోక్‌సత్తా ఆచరణసాధ్యంగా దీర్ఘకాలిక పోరాటం సాగిస్తున్నాయి, తక్కువ వనరులతో ఎక్కువ ఫలితాలను సాధిస్తున్నాయి.

*

# ఈడీ దాడులు - ఎన్నికలు

నరేంద్ర మోదీ ప్రధానమంత్రి అయిన తర్వాత నుంచి తరచూ వార్తల్లోకొస్తూ 2024 సార్వత్రిక ఎన్నికల సమయం వచ్చేసరికి ప్రతిపక్షాల ప్రచారాంశంగా మారిన వివాదం ఈడీ (ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్) దాడులు, అరెస్టులు, సీబీఐ దర్యాప్తు తీరు. ప్రతిపక్షాలను బలహీనపరచటానికి ఈడీ దాడులను మార్గంగా ఎంచుకున్నారని, అరెస్టులకు పాల్పడుతున్నారని ఎన్ని ఆరోపణలొచ్చినా మోదీ లెక్కచేయలేదు. ఇందులో ప్రభుత్వ ప్రమేయమేమీ లేదని వాదించారు. అయితే, ఈడీ కేవలం ప్రతిపక్ష పార్టీల నేతల మీదే, ఎంపిక చేసిన రీతిలో దాడులు చేస్తోందనటానికి స్పష్టమైన ప్రాథమిక ఆధారాలు కనిపిస్తున్నాయి. ఈడీ కేసులు కూడా నిరాధారమని చెప్పలేం గానీ, ప్రతిపక్షంలో ఉన్నప్పుడు ఈడీ దాడులకు గురైనవారు అధికార బీజేపీలోకి మారగానే కేసులుండటం లేదు.

కాంగ్రెస్ సహా ప్రతిపక్షాల 'ఇండి' కూటమి కూర్పు ఈడీ దాడుల వల్ల దెబ్బతింది. ఎన్నికల సమయం వచ్చే సరికి దాడులు వ్యూహాత్మకంగా పదునెక్కాయి. ప్రతిపక్ష నేతలు అధికార బీజేపీలోకి మారటం, కొందరు మౌనం వహించటంతో కాంగ్రెస్ సహా పలు పార్టీలు ఆత్మరక్షణలో పడ్డాయి. కొన్ని పార్టీలైతే ఏకంగా ఎన్డీయేలోకి శిబిరం మార్చాయి. మరికొన్ని పార్టీలు బీజేపీ అనుకూల వ్యూహాన్ని అమలు చేశాయనే విమర్శలను ఎదుర్కొన్నాయి. ఇవన్నీ చట్టబద్ధపాలన అమలు, నేర రాజకీయాల కట్టడిలో మోదీ ప్రభుత్వ చిత్తశుద్ధిని ప్రశ్నార్థకం చేశాయి.

మన దేశంలో నేరరాజకీయాల మీద చర్చ తరచూ జరుగుతోంది. ఎన్నికల్లో పోటీ చేసే నేర రాజకీయుల చరిత్రను లోక్‌సత్తా 1999లో బయటపెట్టటం భారత ప్రజాస్వామ్య చరిత్రలో ఓ పెద్ద సంచలనం. దాన్నుంచి ఎన్నికల్లో పోటీ చేసే అభ్యర్థులు తమ వివరాలు బయటపెట్టటం తప్పనిసరి అనే చట్టనిబంధన వచ్చింది. మోదీ వచ్చాక కూడా రాజకీయాల్లో నేరస్తుల ప్రభావమేమీ తగ్గలేదు. బీజేపీ ఎంపీ బ్రిజ్ భూషణ్‌పై మహిళా రెజ్లర్లు వీధుల్లోకొచ్చి పెద్దఎత్తున పోరాటం చేసినా ప్రభుత్వం స్పందించలేదు. కేవలం ఎన్నికల అవసరం రీత్యానే పలువురు నేరస్తులను మోదీ చట్టసభ సభ్యులుగా, రాజకీయ నేతలుగా కొనసాగనిస్తున్నారనటం అవాస్తవం కాదు. గత ప్రభుత్వాలూ ఈ పని చేసినా మోదీ ప్రభుత్వమంత వ్యూహాత్మకంగా మునుపెన్నడూ జరగలేదు. మోదీ హయాంలో నేర రాజకీయాల్ని ఎన్నికల్లో వినియోగించుకోవటం మరింత విస్తరించింది. ఇందుకోసం చట్టాన్ని ఆయన నేర్పుగా వినియోగించుకున్నారు. అదంతా నేరరాజకీయంపై పోరాటంలో భాగమన్నట్లు ప్రజల్లోకి తీసుకెళ్లారు. ముఖ్యంగా తాజా ఎన్నికల



నేపథ్యంలో చాలా ప్రాధాన్య వ్యూహంగా దీన్ని మోదీ అమలు చేశారు.

**అవినీతిని ఎక్కువగా నైతిక సమస్యగానే చూస్తాం కానీ..**

ఒక సమాజంగా మనం ప్రాథమికంగా అవినీతిని నేరకోణంలో చూస్తుండకపోవచ్చు. చట్టాలు, నిబంధనల కంటే మన మనసుల్లో పాతుకుపోయిన ముద్రల ఆధారంగా స్పందిస్తాం. నేరాలంటే, మన మనసులో ప్రధానంగా అత్యాచారాలు, అకృత్యాలు, గూండాగిరి, భౌతిక హింసకు పాల్పడటం. అలాంటివాళ్లు రాజకీయాల్లోకి వస్తే నేర రాజకీయాలంటూ మాట్లాడతాం, ఎన్నికల ప్రచార సమయంలో, పోలింగ్ బూత్‌లలో దాడులకు పాల్పడితే విమర్శిస్తాం తప్ప.. పదవుల్లో ఉంటూ లేదా రాజకీయంలో చురుగ్గా వ్యవహరిస్తూ పార్టీ నడపటం కోసం, ఎన్నికల అవసరాల కోసం డబ్బు తీసుకున్నవారిని నేరస్తులనుకోవటం మన తక్షణ స్పందన కాదు. అవినీతిపరులుగా భావిస్తాం. ఇదేసమయంలో అవినీతిని కేవలం నైతిక, అనైతిక కోణంలో చూడటానికి మొగ్గు చూపుతాం. కాబట్టి పెద్ద నేరంగా భావించం. ఆర్థిక నేరాలు మరీ శ్రుతి మించి, అడ్డంగా దొరికి, శిక్ష తప్పని పరిస్థితి వస్తే నేరస్తుడనే ముద్ర నుంచి ఆలోచించటం మొదలుపెడతాం. అప్పుడు కూడా అవినీతికి పాల్పడ్డాడు అంటాం తప్ప, కరడుగట్టిన నేర రాజకీయవేత్త అనుకోం. ఇటీవలి కాలంలోనైతే, ఎవరు తినటం లేదు గనక అనుకోవటం, తిన్నా మనకు కొంత పంచితే, ఎంతోకొంత పనిచేస్తే చాలు అని ఆశించటం మామూలైంది. మన దృష్టిలో నేర రాజకీయులు అంటే సమాజ నిబంధనలకు విరుద్ధంగా మరీ మొరటుగా ప్రవర్తించేవాళ్లు. అందుకే ఈడీ దాడుల్లో పట్టుబడిన నేతలపై ప్రజల్లో చాలామందికి వ్యతిరేక అభిప్రాయం, వారికి శిక్ష పడాల్సిందేననే నిశ్చితాభిప్రాయంగానీ కనిపించదు. ప్రజలు పెద్ద నేరస్తులుగా భావించనప్పటికీ, నేర రాజకీయులకు ఎన్నికల్లో స్వచ్ఛమైన రికార్డున్న అభ్యర్థుల కంటే ఎక్కువ విజయావకాశాలున్నప్పటికీ, ఈడీ దాడులకు నేతలు, పార్టీలు భయపడటానికి ప్రధాన కారణం ఆస్తులు జప్తయి

వ్యక్తిగతంగా నష్టం కలిగే అవకాశం, ఎన్నికల్లో పోటీకి వనరులు, ప్రచారావకాశాలు దెబ్బతినటం. పార్టీల అగ్రనేతలైతే వీటన్నిటితోపాటు వ్యక్తిగత అప్రదిష్ట కూడా పెద్దఎత్తున ప్రభావం చూపుతుంది. కేంద్రీకృత పాలనతోపాటు పార్టీలు ప్రయివేటు ఎస్టేట్‌లుగా మారిన ప్రస్తుత పరిస్థితుల్లో పార్టీ అధినేత జైలుకెళ్తే, వారి రాజకీయ జీవితం మీద ప్రతికూల ప్రభావం పడుతుంది. చాలా సందర్భాల్లో ఆ నేత నేరం రుజువు కాకపోయినా, తీర్పు ఎప్పటికి తెములుతుందో ఎవరికీ తెలియకపోయినా, ఆర్థిక వనరులకుతోడు, వ్యక్తిగత ప్రతిష్ఠ మసకబారితే వారి రాజకీయ జీవితం మీద ప్రతికూల ప్రభావం పడుతుంది. ప్రాథమిక సాక్ష్యాధారాలు బలంగా ఉంటే, బయటికొచ్చి సానుభూతిని పొంది తిరిగి బలంగా ప్రచారం చేసే దన్ను, రాజకీయ పరిస్థితులు లేకుంటే, ప్రత్యర్థి పార్టీ అధినేత విశ్వసనీయత, ట్రాక్ రికార్డు మెరుగ్గా ఉంటే ఎన్నికల్లో ఆ పార్టీ మూల్యం చెల్లించే అవకాశాలు ఎక్కువ.

**వ్యక్తిగతంగా సంపాదించుకోవాలని వచ్చేవారు తక్కువ**

మన సమాజంలో ఉమ్మడి విలువలు, ప్రమాణాలు ఎంత బలహీనపడ్డా, ఇంకా సామాజిక కట్టుబాట్లు, కుటుంబ విలువలు పటిష్ఠంగానే ఉన్నాయి. విశ్వాసాల్ని మించిన ధర్మనిరతి ఉంది. దీనివల్లే, మన ప్రజాస్వామ్యం ఎంత అపరిపక్వంగా ఉన్నా, ఒక స్థాయి వివేకాన్ని, నైతికతను ప్రజలు ఎన్నికల్లో ప్రదర్శిస్తున్నారు. ఎన్నికల్లో అన్ని పార్టీల వద్దా డబ్బు తీసుకున్నప్పటికీ, ఉన్నంతలో మెరుగైన అభ్యర్థి అని తాము అనుకున్నవారికే ఓటు వేస్తున్నారు. ఈ నేపథ్యంలో, నేరం ఇప్పటికిప్పుడు రుజువు కాకున్నా, దాడుల్లో దొరికితే పరువు పోగొట్టుకుని, రాజకీయంగా సవాళ్లను ఎదుర్కొని, ఒక్కోసారి రాజకీయ జీవితాన్ని కూడా కోల్పోవాల్సి ఉంటుందని తెలిసీ నాయకులు ఎందుకు ఈడీకి పట్టుబడే అవినీతికి పాల్పడుతున్నారు? వ్యక్తిగతం కోసమా? వీరంతా కేవలం వ్యక్తిగత అవినీతి సంపాదనాపరులైతే మనం చట్టపరమైన చర్యల్ని డిమాండ్ చేయటం తప్ప మాట్లాడు కోవాల్సిన అవసరం లేదు. కానీ వీరిలో ఎక్కువమంది వ్యక్తిగత అవసరాలకోసం అవినీతికి పాల్పడుతున్నవారు కాదు. ఆ మాటకొస్తే రాజకీయాల్లోకి వచ్చేవాళ్లలో అత్యధికులు ఈవేళ్టికీ సమాజానికి ఏదో చేద్దామని, తమకంటూ ఏదోక సొంత గుర్తింపు తెచ్చుకుందామనుకునే వారే ఎక్కువ. మరెందుకీ రకంగా అవినీతికి పాల్పడుతున్నారు? వ్యవస్థలోని లోపాల వల్ల, ఎన్ని కల్లో లెక్కలు చూపని డబ్బు పెద్దఎత్తున అవసరం కాబట్టి అవి నీతికి పాల్పడుతున్నారు. కొంతమంది అందులో కొంత కైంకర్యం చేస్తుండవచ్చు, కానీ మౌలిక సమస్య ఎన్నికల వ్యవస్థలో ఉంది. ఎలాగొలా గెలవాలనే తపనతో ఆ లోపాల్ని సరిచేసే సామర్థ్యం, ఎజెండా, ఓపిక లేక ఆ విషవలయంలోనే గెలవ టానికి ప్రయత్నిస్తుండటం వల్ల నేతలు ఈ తప్పులు చేస్తు న్నారు.

**ఎన్నికల గండం దాటితే చాలనుకున్న విపక్షాలు**

ఈడీ దాడులను ఎదుర్కొంటున్న ప్రతిపక్షాలు అధికారమే

“ వ్యవస్థలోని లోపాల వల్ల, ఎన్నికల్లో లెక్కలు చూపని డబ్బు పెద్దఎత్తున అవసరం కాబట్టి అవినీతికి పాల్పడుతున్నారు. కొంతమంది అందులో కొంత కైంకర్యం చేస్తుండవచ్చు, కానీ మౌలిక సమస్య ఎన్నికల వ్యవస్థలో ఉంది. ఎలాగొలా గెలవాలనే తపనతో ఆ లోపాల్ని సరిచేసే సామర్థ్యం, ఎజెండా, ఓపిక లేక ఆ విషవలయంలోనే గెలవటానికి ప్రయత్నిస్తుండటం వల్ల నేతలు ఈ తప్పులు చేస్తున్నారు. ”

పరమావధి అనే ఎన్నికల రాజకీయంలో విపరీత ఒత్తిడిని ఎదుర్కొంటున్నా, ఈ గండం గడిస్తే చాలన్నట్లు ఆలోచించాయి తప్ప సమస్య మూలాల్లోకి వెళ్లి పరిష్కరించే ప్రయత్నం చేయలేదు. రాజకీయ నినాదాలు తప్ప, నిర్మాణాత్మక పరిష్కారాలతో ఎన్డీయేను ఇరుకునపెట్టేలా ప్రశ్నించటం లేదు. అధికారంలోకి వస్తే మేం కూడా తడాఖా చూపిస్తాం, బీజేపీ అవినీతి బాగోతంపై కేసులు పెడతాం అనటం తప్ప, చట్టవిరుద్ధంగా ఇంతింత డబ్బు తీసుకోవటానికి కారణమేంటి, అనవసరంగా కేసుల్లో ఇరుక్కోవాల్సిన దుస్థితి ఎందుకొస్తోంది అన్న ప్రశ్నకు సమాదానం సమాధానం వెతికే ప్రయత్నం చేయలేదు. ఇందుకు కావలసిన చర్యల్ని వెతికే, ప్రతిపాదించే చొరవ కొరవడుతోంది. అసలు ఎన్నికల్లో ఎందుకు ఇన్నిన్ని కోట్లు చట్టవిరుద్ధ డబ్బు ఖర్చు పెట్టాల్సి వస్తోంది, ఇంత ఖర్చు పెట్టినా, ఎన్నికలకు ఎప్పట్నుంచో విపరీతంగా కష్టపడినా, వ్యక్తిగత జీవితాన్ని మానుకుని త్యాగం చేసిన హైరానా పడినా గెలుస్తామో, లేదో గ్యారంటీ లేని పరిస్థితి ఎందు కొస్తోంది అన్న ప్రశ్న గురించి కాస్తయినా లోతుగా ఆలోచించటం లేదు. ఇక ముందు ఎవరూ ఇలా ప్రతిపక్షాల మీద మాత్రమే ఎంపిక చేసుకుని దాడులు చేయటానికి వీల్లేకుండా చట్టబద్ధపాలన అమలు ఎలా చేద్దాం అని చర్చ లేవనెత్తటం లేదు. మద్యం ముడుపుల మనీలాండరింగ్ కేసులో బెయిలు మీద బయటికొచ్చిన ‘ఆప్’ వ్యవస్థాపకుడు, ఢిల్లీ ముఖ్యమంత్రి అరవింద్ కేజ్రీవాల్, ఎన్నికల్లో ‘ఇండి’ కూటమి గెలిచి అధికారం వస్తే, ఫలితాలు వెలువడిన మరుసటిరోజే జైలు నుంచి బయటకు వస్తానని బాహాటంగానే ప్రకటించారు. ఆ తర్వాత మాట సవరించుకుని, ఇండి కూటమి వస్తే వ్యవస్థలు బాగా పనిచేస్తాయని చెప్పుకొచ్చారనుకోండి. మోదీ హయాంలో కంటే వ్యవస్థల్ని బాగుచేయటానికి ఏ రకమైన ఎజెండాను ఇండి కూటమి ప్రకటించిందో మాత్రం కేజ్రీవాల్ చెప్పలేదు.

**కేవలం రాజకీయ నాయకులకు సంబంధించిన విషయం కాదు**

ఇది కేవలం రాజకీయ నాయకులకు సంబంధించినది కాదు,

## అనేక రెట్లు పెరిగిన సోదాలు, జప్తులు

తమపై రాజకీయంగా కక్ష సాధించటానికి, నిర్వీర్యం చేయటానికి మోదీ ప్రభుత్వం కేంద్ర దర్యాప్తు సంస్థలను విస్తృతంగా వినియోగిస్తున్నదని విపక్షాలు ఎన్నికల ముందు, ఎన్నికల సమయంలో తీవ్రంగా ఆరోపించాయి. వారి ఆరో పణలు నిజమని నిరూపించేలా బీజేపీ పదేళ్ల పాలనలో కేంద్ర దర్యాప్తు సంస్థ ఈడీ సోదాలు, ఆస్తుల స్వాధీనం అనూహ్యంగా పెరిగాయి. గత యూపీయే పాలనతో పోలిస్తే బీజేపీ ప్రభుత్వ హయాంలో మనీలాండరింగ్ చట్టం కింద ఏకంగా 86 రెట్లు అధికంగా సోదాలు, 25 రెట్లు అధికంగా ఆస్తుల అటాచ మెంట్లు జరిగాయని గణాంకాలు తెలియచేస్తున్నాయి. తమను కేంద్రం టార్గెట్ చేసిందనటానికి ఈ గణాంకాలు నిదర్శనమని విపక్షాలు పేర్కొంటుండగా, అవినీతిపై చిత్తశుద్ధితో పోరాటానికి ఇవి తార్కాణమని యూనియన్ ప్రభుత్వం వాదిస్తోంది.

2002లోనే మనీలాండరింగ్ నిరోధక చట్టాన్ని (పీఎంఎల్ఏ) ప్రవేశపెట్టినా 2005 జులై 1 నుంచి దీన్ని అమలు చేశారు. ఎన్డీయే హయాంలో 2014 ఏప్రిల్ నుంచి 2024 మార్చి వరకు, యూపీయే హయాంలోని 2005 జులై నుంచి 2014 మార్చి వరకు ఈడీ జరిపిన దాడులకు సంబంధించి పీటీఐ విశ్లేషించిన డేటా ప్రకారం వివరాలిలా ఉన్నాయి.

**63 మందికి శిక్షలు**

ఎన్డీయే హయాంలో 36 కేసుల్లో 63 మందికి శిక్ష పడగా, యూపీయే ప్రభుత్వ హయాంలో 73 చార్జిషీట్లను పరిష్కరించారు. ఈ కేసుల్లో ఎవరికీ శిక్ష పడలేదు. అదేసమయంలో పీఎంఎల్ఏ చట్టం కింద ఎలాంటి కేసులు పరిష్కరించలేదు. గత పదేళ్లలో విదేశాలకు పారిపోయిన నలుగురిని భారత్‌కు రప్పించారు.

**నమోదైన పీఎంఎల్ఏ కేసుల సంఖ్య**

ఎన్డీయే హయాంలో – 5,155
యూపీయే హయాంలో – 1,797

స్వాధీనం చేసుకున్న ఆస్తులు
ఎన్డీయే హయాంలో – 1,21,618 కోట్లు
యూపీయే హయాంలో 5,086.43 కోట్లు
(ఆస్తుల పెరుగుదల 25 రెట్లు)

**ఈడీ జరిపిన సోదాలు**

ఎన్డీయే హయాంలో – 7,264
యూపీయే హయాంలో – 84
(సోదాల పెరుగుదల 86 రెట్లు)

**జరిగిన అరెస్టులు**

ఎన్డీయే హయాంలో – 755
యూపీయే హయాంలో – 29
(పెరుగుదల 26 రెట్లు)

**స్వాధీనం చేసుకున్న అక్రమ నగదు**

ఎన్డీయే హయాంలో – 2,310 కోట్లు
యూపీయే హయాంలో – 43 కోట్లు

**కోర్టు అనుమతితో జప్తు చేసిన ఆస్తులు**

ఎన్డీయే హయాంలో – 15,710.96 కోట్లు
యూపీయే హయాంలో – –

కార్పొరేట్, వ్యాపార వర్గాలు కూడా ఈ సమస్యను ఎదుర్కొంటున్నాయి. విరాళాలివ్వటానికి స్వచ్ఛందంగా సిద్ధపడ్డ వ్యాపారవేత్తలు కూడా వేధింపులకు గురవుతున్నారు. ఈ అంశాన్ని కూడా పార్టీలు ప్రస్తావిస్తున్నాయిగానీ, పరిష్కారం వెతకటం లేదు. ఇటీవల ఎన్నికల బాండ్ల విషయంలో సుప్రీంకోర్టు తీర్పు నేపథ్యంలో సమస్య తలెత్తినా రాజకీయ విమర్శలు తప్ప పరిష్కారాల మీద పార్టీలు దృష్టి సారించలేదు. పార్టీలకు బాండ్ల రూపంలో ఇచ్చే విరాళాలకు లెక్కలుంటాయి, అవేమీ నల్లధనం కాదు, కానీ ఇచ్చినవాళ్లెవరో ప్రజలకు తెలిసే అవకాశముండదు. ఈడీని అడ్డంపెట్టుకుని అక్రమార్జన చేసే వ్యాపారులను బెదిరించి ప్రభుత్వం డబ్బు గుంజుతోందని, లేదా ప్రభుత్వ విధానాల్లో పక్షపాతం చూపుతూ కొందర వ్యాపారవేత్తలకు లైసెన్సులు, మినహాయింపులు వంటి ఫేవర్లు చేస్తున్నారనే ఆరోపణలున్నాయి. అధికార పార్టీకి విరాళాలివ్వగానే వీరిపై కేసుల ఊసు లేకుండా పోతోందనే విమర్శలున్నాయి. ఈ రకమైన పక్షపాతం, క్విడ్ ప్రో కో లేదని ఎవరూ అనలేరు. కొన్ని బలమైన సాక్ష్యాలు ఉన్నాయి. అయితే వ్యాపారాల్లో పక్షపాతం లేకుండా, తమకు నచ్చనివారి పట్ల కక్షసాధింపు చర్యలు లేకుండా చర్యలు తీసుకోవాలని ప్రతిపక్ష పార్టీలు డిమాండ్ చేయటం లేదు. తాము అధికారంలోకి వస్తే అలాంటి ఏర్పాటు చేస్తామని చెప్పలేదు. ఎన్నికల బాండ్ల ద్వారా కొన్ని సంస్థల నుంచి ప్రతిపక్షాలకూ, ముఖ్యంగా రాష్ట్రాల్లో అధికారంలో ఉన్న పార్టీలకు విరాళాలు వచ్చాయి. అదేవిధంగా, ఎన్నికల బాండ్ల ద్వారా వచ్చిన డబ్బు రాజకీయ పార్టీల వాస్తవ ఖర్చులో బహుస్వల్పమని, ఎన్నికల్లో చేసే ఖర్చులో నామమాత్రమని, డబ్బు ఖర్చు అత్యధికం ఓట్ల కొనుగోలు, తాయిలాల రూపంలో అవుతోందన్న వాస్తవాన్ని కూడా ప్రస్తావించటం లేదు. అసలు సమస్యేంటో అందరికీ తెలుసు, కానీ ఎన్నికల వ్యవస్థను మార్చాలన్న పరిష్కారాన్ని, అందుకోసం ఏ విధమైన మార్పులు అవసరం అనే విషయాన్ని తప్ప మిగతావన్నీ చర్చిస్తూ ఒకరి మీద ఒకరు ఆరోపణలతో పబ్బం గడుపుకుంటున్నారు.

### మరి బీజేపీ అవినీతి, అక్రమాలకు పాల్పడకుండానే ఎన్నికల్లో గెలుస్తోందా?

ప్రస్తుతం ప్రధాన పార్టీలుగా చెప్పుకుంటూ అధికార, ప్రతిపక్ష స్థానాల్లో ఉన్నవారంతా చట్టవిరుద్ధ డబ్బు ఖర్చు చేస్తున్నారు. ఆ డబ్బు కొన్ని రాష్ట్రాల్లో ఎక్కువ ఉండచ్చు, కొన్ని రాష్ట్రాల్లో తక్కువ

ఉండొచ్చు, కానీ దాదాపు ప్రతి సీటులో లెక్కలు చూపని డబ్బు ఖర్చు చేస్తున్నారు. అధికాదాయ వర్గాలు ఎక్కువ ఉండటం, ఒక నగరంలాంటి రాష్ట్రం కావటం, మీడియా అక్కడే కేంద్రీకరించి ఉండటం వంటి కారణాల వల్ల ఢిల్లీలో 'ఆప్' ఎన్నికల్లో అక్రమ డబ్బు ఖర్చు లేకుండా గెలవగలిగింది, అవినీతిరహిత పాలన అందించగలిగింది. అయితే ఎప్పుడైతే ఢిల్లీ దాటి బయటి రాష్ట్రాలకు విస్తరించాలని ప్రయత్నం ప్రారంభించారో, ఢిల్లీలో ఇస్తున్నట్లు పరిధి దాటి తాత్కాలిక పథకాల హామీలు గుప్పించినా సరిపోదని అర్థమైంది. ఎన్నికల్లో ప్రచారం, పందేరానికి భారీగా లెక్కలు చూపని డబ్బు అవసరమైంది. ఇటీవల మద్యం కుంభకోణంలో అరవింద్ కేజ్రీవాల్‌ను ఈడీ అరెస్టు చేయటం వెనక ఉన్న ప్రాథమిక ఆధారాలను బట్టి ముడుపులుగా అందుకున్న ఆ డబ్బును గోవా ఎన్నికల్లో ఖర్చు పెట్టినట్లు భావిస్తున్నారు.

అలాంటప్పుడు బీజేపీ కూడా విషవలయంలో కూరుకు పోయిందనుకోవటానికి సందేహించాలా! నరేంద్ర మోదీపై ఎవరూ వ్యక్తిగత అవినీతి ఆరోపణలు చేయలేకపోవచ్చు, కానీ బీజేపీ అవినీతి మరక అంటని డబ్బు తీసుకుందని మోదీ కూడా చెప్పలేరు. పార్టీని నడపటానికి ఖర్చు అలా ఉంచితే, ఎన్నికల్లో ఓట్ల కొనుగోలు, కేంద్రీకృత పాలన, అసమర్థ ప్రభుత్వ సేవల వ్యవస్థలో ప్రజల మద్దతు పొందేందుకు ఎన్నికల మధ్యకాలంలో కార్యకర్తల యంత్రాంగాన్ని పోషించటం, ఇతర పార్టీల నేతల్ని, ఎమ్మెల్యేల్ని కొనటం, భారీఎత్తున సభల నిర్వహణ, మీడియాలో, సామాజిక మాధ్యమాల్లో ప్రచారం మొదలైన వాటికి చట్టబద్ధ విరాళాల ద్వారా వచ్చే డబ్బు కన్నా అనేకరెట్లు ఎక్కువ కావాల్సుంటుంది. అయితే, లెక్కలు చూపని డబ్బుపై ప్రతిపక్షాలు అధికారంలోకి వచ్చి తనపై కూడా విచారణ జరిపిస్తాయన్న భయం బీజేపీలో వ్యక్తమవలేదు.

తిరిగి అధికారంలోకి వస్తామన్న ధీమా, సుదీర్ఘకాలం కొనసాగగలమన్న ఆత్మవిశ్వాసం ఉండటం వల్లే తన నిధుల సేకరణలో లొసుగులపై విచారణ జరుగుతుందన్న ఆందోళన బీజేపీలో లేనట్లు కనిపిస్తోంది.

## ఎన్నికల కోసం రాజకీయ అవినీతి జరుగుతోందని బహిరంగంగానే చెబుతున్న ప్రధాని

మళ్లీ అధికారంలోకి వస్తామని మోదీకి ధీమా ఉండొచ్చు, 2047 దాకా అధికారంలో కొనసాగుతామని పటిష్ఠ ప్రణాళిక వేసుకుని ఉండొచ్చు, కానీ ఆ అధికారాన్ని ఉపయోగించి ఇప్పటికైనా ఎన్నికల వ్యవస్థను, చట్టబద్ధపాలనను బాగుచేయాలని ఎందుకు ప్రయత్నించటం లేదు?

దేశంలో ఎన్నికల కోసం రాజకీయ అవినీతి పెద్దఎత్తున జరుగుతోందని మోదీ బహిరంగంగానే చెబుతున్నారు. కరీంనగర్, వరంగల్ లోక్‌సభ ఎన్నికల ప్రచార సభల్లో మాట్లాడుతూ, అయిదేళ్ల పాటు అంబానీ, అదానీ అని విమర్శించిన కాంగ్రెస్ యువరాజు ఇప్పుడు ఎన్నికల వేళ

## సంస్కరణలు లేకుండా చట్టం చాలదు

దేశంలో నేరరాజకీయాల మీద చర్చ తరచూ జరుగుతోంది. ఎన్నికల్లో పోటీ చేసే నేర రాజకీయుల చరిత్రను లోక్‌సత్తా 1999లో బయటపెట్టటం భారత ప్రజాస్వామ్య చరిత్రలో ఓ పెద్ద సంచలనం. దాన్నుంచే ఎన్నికల్లో పోటీ చేసే అభ్యర్థులు తమ వివరాలు బయటపెట్టటం తప్పనిసరి అనే చట్ట నిబంధన వచ్చింది.

1999లో నేరచరిత్రుల వివరాల్ని లోక్‌సత్తా, ఎఫ్‌డీఆర్ వెల్లడించిన తర్వాత ఏడీఆర్ సంస్థకు చెందిన కొందరు మిత్రులు ఢిల్లీ హైకోర్టులో పిటిషన్ దాఖలు చేశారు. నేర చరితుల వివరాల్ని తెలుసుకునే హక్కు ప్రజలకుందని, వాటిని సేకరించి ప్రజల ముందు పెట్టే బాధ్యత ఎన్నికల సంఘానిదని, ఆ విధంగా ఎన్నికల సంఘాన్ని ఆదేశించాలని ఆ దరఖాస్తులో కోరారు. ఎన్నికల నిఘా ఉద్యమంలో లోక్‌సత్తా విడుదల చేసిన నేరచరితుల జాబితాను, అందుకు అనుసరించిన ప్రమాణాలను, పద్ధతులను కోర్టులో సాక్ష్యంగా అందచేశారు. ఆ వాదనలు విన్నాక, అభ్యర్థుల నేరచరిత్రను, వారి వ్యక్తిగత, కుటుంబ ఆస్తిపాస్తుల వివరాలను, అర్హత సమాచారాన్ని సేకరించి ప్రజల ముందుంచాలని ఎన్నికల సంఘాన్ని ఆదేశిస్తూ 2000, నవంబర్ 2న ఢిల్లీ హైకోర్టు తీర్పు ఇచ్చింది. ఆ తీర్పుపైన యూనియన్ ప్రభుత్వం సుప్రీంకోర్టులో అప్పీల్ చేసింది. అభ్యర్థుల వివరాలను బయటపెడితే వారి వ్యక్తిగత హక్కులకు భంగం వాటిల్లుతుందన్న యూనియన్‌లోని ఎన్డీయే ప్రభుత్వ వాదనకు ప్రతిపక్ష కాంగ్రెస్ పార్టీ కూడా వత్తాసు పాడింది. కానీ సుప్రీంకోర్టు వారి వాదనలను కొట్టిపారేసింది. వివరాల్ని ప్రజల ముందుంచాల్సిందేనని 2002లో తీర్పునిచ్చింది. ఆ తర్వాత కూడా సుప్రీంకోర్టు తీర్పును నిర్వీర్యం చేసేందుకు ఆర్డినెన్స్ రూపంలో ప్రభుత్వం ప్రయత్నించింది. లోక్‌సత్తా ఆధ్వర్యంలో ప్రజాస్వామ్యవాదులు పార్టీలకతీతంగా అప్పటి రాష్ట్రపతి అబ్దుల్ కలాంను కలిసి విషయాన్ని వివరించగా, ఆయన ఆర్డినెన్స్‌పై సంతకం చేయకుండా తిప్పిపంపారు. అయినా కూడా పాలకులు లెక్కచేయలేదు. ఆర్డినెన్స్‌ను ఆమోదించాలని మంత్రివర్గం తిరిగి రాష్ట్రపతికి పంపటంతో మరో మార్గంలేక ఆయన ఆమోదించారు. కొద్దిపాటి మార్పులతో పార్లమెంటులో చట్టంగా చేశారు. తిరిగి లోక్‌సత్తా సుప్రీంకోర్టును ఆశ్రయిం చింది. ఈ నేపథ్యంలో 2003లో సుప్రీంకోర్టు తీర్పునిస్తూ, అభ్యర్థుల వివరాలను తెలుసుకునే హక్కు పౌరులకు ఉందని, దాన్ని చట్ట బద్ధం చేయాలని విస్పష్టంగా ఆదేశించింది.

అయితే, అభ్యర్థుల నేర చరిత్ర, ఇతర వివరాలు తెలియటం, ప్రజల్లో, రాజకీయ వ్యవస్థలో ప్రజాస్వామిక చైతన్యాన్ని పెంచ టంలో ఒక మైలురాయేగానీ దాని వల్ల అద్భుతాలేమీ జరగవని, మన ఎన్నికల వ్యవస్థలో నల్లడబ్బు, లెక్కలు చూపని డబ్బు ప్రభావాన్ని నిర్మూలించకుండా నేరరాజకీయాలపై చర్చ చేసి ఉప యోగం లేదని ప్రజాస్వామ్య పీఠం (ఎఫ్‌డీఆర్), లోక్‌సత్తా వ్యవ స్థాపకుడు డాక్టర్ జయప్రకాష్ నారాయణ్ పలు సందర్భాల్లో తెలిపారు.

ఎందుకు మాట్లాడటం లేదు? ఏం లావాదేవీలు జరిగాయి? ఎన్ని టెంపోల డబ్బు చేరింది? అని రాహుల్ గాంధీపై విమర్శలు చేశారు. పార్టీలో మోదీ తర్వాత శక్తిమంతుడిగా భావించే అమిత్‌షా ఓ ఎన్నికల ప్రచారంలో మాట్లాడుతూ, కాంగ్రెస్ పార్టీకి తెలంగాణ రాష్ట్రం ఏటీఎంలా మారిందని, ఇక్కడ బీజేపీకి అధికారం ఇస్తే కాంగ్రెస్ ఏటీఎం బంద్ అవుతుందని అన్నారు. మన దేశంలో ఎన్నికల నిధులకు, అధికారానికి మధ్య లాలూచీకి ఇంతకంటే పెద్ద అధికారిక సాక్ష్యం అక్కర్లేదు.

ప్రజల్లో గణనీయ సంఖ్య ఓటును అమ్మకం సరకుగా చూడటం, డబ్బు పంచినవారు ఎన్నికయ్యాక అంతకంత అక్రమంగా సంపాదించటం, ఆర్థిక ప్రయోజనాల కోసం అధికార పార్టీలోకి ఫిరాయించటం యథేచ్ఛగా జరుగుతున్నా, వాటి గురించి వర్ణనలు, విమర్శలు, రాజకీయాన్ని తిట్టిపోయటం తప్ప పరిష్కారం ఎక్కడుందనే చర్చ మీడియాలో, ఆలోచనాపరుల్లో కూడా పెద్దగా కనిపించటం లేదు.

**సుప్రీంకోర్టు, ఈసీ పరిష్కరించలేవు**

సుప్రీంకోర్టో, ఎన్నికల సంఘమో ఈ సంక్షోభాన్ని పరిష్కరించలేవు. ఇప్పుడున్న పరిస్థితుల్లో ఎన్నికల సంక్షోభానికి తక్షణ పరిష్కారం మన ఎన్నికల వ్యవస్థను మార్చటంలో ఉంది. మన దేశంలో అక్షరాస్యత పెరిగినా నాణ్యమైన చదువు లేకపోవటం, పనిచేసేవారిలో అత్యధికులు అల్పాదాయం, తక్కువ ఉత్పాదకత శక్తితో అసంఘటిత రంగంలో ఉండటం వల్ల, కులం, మతం, ప్రాంతం, భాష వంటి భిన్నత్వాలు ప్రపంచంలో ఎక్కడాలేని స్థాయిలో ఉండటం, లైసెన్స్ రాజ్ అవశేషాలు, పెత్తందారీ సామాజిక ధోరణులు కొనసాగుతుండటం, ప్రభుత్వోద్యోగ వ్యవస్థలో జవాబుదారీతనం లేకపోవటం వంటి కారణాల వల్ల ఓటు వల్ల తాత్కాలిక లాభాలకు తప్ప దీర్ఘకాలిక ప్రయోజనాలకు మన ప్రస్తుత ఫస్ట్ పాస్ట్ ది పోస్ట్ ఎన్నికల వ్యవస్థ ప్రోత్సాహకంగా లేదు. ఓటుకు డబ్బులివ్వాలని పలుచోట్ల ప్రజలు రోడ్ల మీద కొచ్చి బహిరంగంగా డిమాండ్ చేస్తున్నారు. డబ్బులిచ్చిన అభ్యర్థులంతా గెలుస్తారని గ్యారంటీ లేదు గానీ, డబ్బులివ్వకపోతే అరుదైన సందర్భాల్లో తప్ప ఓటమి ఖాయం.

ఎన్నికల్లో బలమైన అభ్యర్థి అనిపించుకోవాలంటే లెక్కలు చూపని డబ్బు ప్రవేశ రుసుముగా మారింది. డబ్బు రాజకీయాన్ని, పాతుకుపోయిన పార్టీలను తట్టుకుని పరిష్కారాల్ని, కొత్త ఆలోచనల్ని ప్రతిపాదించేవారికి అవకాశాలు అందటం అరుదైపోయింది. దీంతో మూడో పార్టీకి స్థానం లేని మన ఎన్నికల వ్యవస్థను మరింత జటిలమైంది. రెండు పార్టీల మధ్యే పోటీ, వారిద్దరి మధ్య కూడా ఒక్క ఓటు ఎవరికి ఎక్కువ వస్తే వారు గెలిచినట్లు, మిగిలినవారికి ఎన్ని ఓట్లు వచ్చినా వృథా. దీంతో మూడో పార్టీకి గొప్ప ప్రత్యామ్నాయంగా గణనీయ సంఖ్యలో ప్రజల మద్దతున్నా, ఆ ఆదరణ ఓటుగా మారటం లేదు. డబ్బులు పంచే పార్టీల్ని తట్టుకుని ప్రత్యామ్నాయ రాజకీయ పార్టీ గెలవదు అనుకున్నాక, ఆ పార్టీకి ఓటు వేస్తు అని భావిస్తారు. మొదటిసారి ఓటు వేసినవారు కూడా ఆ పార్టీ గెలవదని తెలిశాక, ఓటు వేయటం తగ్గిపోతుంది. ప్రత్యామ్నాయ విధానాలకు నిలకడగా ఓటు వేసి నిలదొక్కుకునేలా చేసే పరిస్థితి లేదు. ఈ ఎన్నికల వ్యవస్థ స్థానంలో ప్రతి ఓటుకూ విలువ ఉండేలా దామాషా ఎన్నికల పద్ధతిని మన దేశ పరిస్థితులకనుగుణంగా తీసుకొస్తే చాలావరకు డబ్బు రాజకీయాలకు అడ్డుకట్ట పడుతుంది. సమర్థులు, నిజాయతీపరులు చట్టసభలకు పెద్దసంఖ్యలో ఎన్నికవగలుగుతారు. దీంతోపాటు చట్టబద్ధపాలనను కాగితాల మీద నుంచి వాస్తవం చేస్తే, నేర రాజకీయ నాయకులకు కళ్లెం వేయవచ్చు. ఎజెండా ద్వారా ఎన్నికలు గెలిచేవారి సంఖ్య పెరుగుతుంది. ఓ కొత్త ఆలోచన హేతుబద్ధంగా వస్తే, వాళ్లు గెలుస్తారా, ఓడతారా అనే సందేహం లేకుండా ఓట్లు వేసి ఆ భావాలకు బలాన్నివ్వటానికి ప్రజలు గణనీయ సంఖ్యలో ముందుకొస్తుంటారు. దీనివల్ల అంతిమంగా సమాజం, ప్రజాస్వామ్యం లాభపడతాయి.

**చట్టబద్ధపాలన ప్రధానంగా రాష్ట్రాల పరిధి అంశం**

మనం ఈడీ దాడుల గురించి ఎక్కువ మాట్లాడుకుంటున్నాంగానీ, చట్టబద్ధపాలన ప్రధానంగా రాష్ట్రాల పరిధిలోని అంశం. అధికారం చేజారిపోకుండా పోలీసుల్ని, దర్యాప్తు సంస్థల్ని ప్రత్యర్థుల మీద ప్రయోగిస్తుండటం పలు రాష్ట్రాల్లో మామూలన్నట్లు జరుగుతోంది. ఒక్కోసారి ఎటువంటి ఆధారాలులేని కేసుల్లో కూడా అరెస్టులు జరుగుతున్నాయి. రాష్ట్ర ప్రభుత్వాలు నేరరాజకీయాల కట్టడికి జవాబుదారీతనంతో వ్యవహరించాలి. నేరపరిశోధన విభాగ పోలీసుల్ని రాజకీయ జోక్యం పరిధి నుంచి తప్పించటం ఇందుకు అవసరం. చట్టం అందరికీ సమానంగా వర్తించేందుకు వ్యవస్థీకృత ఏర్పాట్లు జరిగినంత వరకూ ఈ వికృత ఎన్నికల రాజకీయ క్రీడ కొనసాగుతుంటుంది.

ఎన్నికల వ్యవస్థను సంస్కరించి దామాషా ఎన్నికల పద్ధతిని, రాష్ట్రాల్లో ముఖ్యమంత్రుల ప్రత్యక్ష ఎన్నికను తీసుకురావటం, జాతీయ, రాష్ట్రాల స్థాయిలో చట్టబద్ధపాలనకు పటిష్ఠ చర్యలు తీసుకోవటం, వీటితోపాటు ప్రజలు పాలన, రాజకీయాలపై పునాది స్థాయి పరిజ్ఞానాన్ని తెలుసుకుని, ఓటును సద్వినియోగం చేసుకునేందుకు, నాయకులుగా ఎదిగేందుకు స్థానిక ప్రభుత్వాలకు అధికారాల్ని, నిధుల్ని జవాబుదారీతనంతో విధిగా బదిలీ చేయటం కోసం వ్యవస్థీకృత ఏర్పాట్లు చేయాలి. వీటి గురించి మాట్లాడకుండా, అవినీతి, రాజకీయ కక్షసాధింపు గురించి ఎంత పరస్పర ఆరోపణలు చేసుకున్నా ప్రజలకొచ్చే వాస్తవ ప్రయోజనం ఉండదు. ఈ ఎన్నికల తర్వాతైనా ప్రభుత్వం, ప్రతిపక్షాలు సమస్యలకు వాస్తవ పరిష్కారాల్ని చర్చిస్తారని, ఆచరణసాధ్యమైన సంస్కరణల్ని వాయిదా వేయకుండా అమలు చేసి ప్రజాప్రయోజనాల్ని, ప్రజాస్వామ్యాన్ని పరిరక్షిస్తారని ఆశిద్దాం.

*

# జుగాడ్ ఓటర్ల ఉద్యమం

ప్లాట్ నం: బి- 64, రోడ్ నం. 10, హుడా కాలనీ,
సరూర్‌నగర్, హైదరాబాద్ - 500 035
ఈమెయిల్: mpstexer@gmail.com



ఎం. పార్థసారథి
(ఫౌండర్ ప్రెసిడెంట్)

## Vote Jugaad June 2024! జుగాడ్ 50:50 రాజనీతి

## మనమంతా భారతీయులమే. మనది ఏకైక ఓటర్ల జాతి !

ఓటర్ల డబ్బూ, సమయమూ దుర్వినియోగం కాకుండా సుపరిపాలన సాగాలంటే, ప్రభుత్వాన్ని ఏర్పరిచే పార్టీలకు ముందుగా తమ పార్టీని నిజాయితీగా, క్రమశిక్షణతో నిర్వహించుకునే సామర్థ్యం ఉండాలి.వారే ప్రభుత్వనిధులనూ, ప్రభుత్వసమయాన్నీ దుర్వినియోగం కాకుండా కాపాడగలరు. అధికారం అంతా గుప్పిట్లో పెట్టుకుని పార్టీలను నడిపే వ్యక్తులందరూ ఖచ్చితంగా నియంతలే. 2024 Mayలో జరిగిన ఎమ్మెల్యే ఎంపీ ఎన్నికలే అందుకు ప్రత్యక్ష నిదర్శనం.

50 ఏళ్ల గతంలో "ముల్కీ రూల్స్" కి వ్యతిరేకంగా "ప్రత్యేక ఆంధ్ర ఉద్యమం" అయింది. ఆ తర్వాత మా నీళ్ళు మా ఉద్యోగాలంటూ ఉద్భవించిన "ప్రత్యేక తెలంగాణ ఉద్యమం". ఈ రెండు ఉద్యమాల ద్వారా అశాస్త్రీయంగా రెండు తెలుగు రాష్ట్రాలు ఏర్పడ్డాయి తప్ప, ఇరు రాష్ట్రాల ఓటర్ల కు ఒరిగిందేమీ లేదు. పొలిటికల్ పార్టీలు మాత్రం అత్యంత విలువైన భూఆక్రమణల ద్వారా లబ్ధి పొందేయి. పైగా, ఉభయ తెలుగు రాష్ట్రాల ఓటర్ల నెత్తిమీద పది లక్షల కోట్ల రూపాయల అప్పులు మిగిలాయి. కుటుంబంలో అన్నదమ్ముల మధ్య కలహాలతో ఆస్తులు పంచుకున్నట్టు, పొలిటికల్ పార్టీల మధ్య వైషమ్యాల ద్వారా దేశ సహజ వనరులైనటువంటి నీటిని ఖనిజ సంపదలను కొన్ని పొలిటికల్ పార్టీలు రైతులపేరిట పంచుకుని లాభపడ్డాయి. ఉభయతెలుగు రాష్ట్రాలలో నియంతలే గత పదేళ్లు పాలించారు. అందుచేత "ఓటర్లే ప్రభువులు" కాబట్టీ ప్రజాస్వామ్య రక్షణకై ఓటర్లే సొంత డబ్బులతో సంఘటితంగా పార్టీ పెట్టి నడుపుకోవాలి.

జుగాడ్ ఓటర్లచే ప్రతిపాదించబడిన "జుగాడ్ జాతీయ ద్విపక్ష పొలిటికల్ పార్టీ" ఎమ్మెల్యే నియోజక వర్గం ప్రాతిపదికగా ఓటర్లంతా సమానమే, కాబట్టీ ఓట్ల వ్యాపారం జరగదు. జుగాడ్ పార్టీ అభ్యర్థిని చూడగానే జనాలు గౌరవిస్తారు. కండువాలుండవు, కటౌట్లుండవు. ఈపార్టీలో నేరచరితులకు B-Form లభించదు. ఈపార్టీ అభ్యర్థులందరూ గెలుపు గుర్రాలే. ఎవర్నిఎన్నుకుంటారో ఓటర్ల ఇష్టం. ఎన్నికల ఖర్చు ఎన్నికలకమిషన్ పరిమితికి మించేప్రసక్తేలేదు. జుగాడ్ ఓటర్లు తమ కష్టార్జితమైన 2000 రూపాయలు లేదా ఐదువేల రూపాయలు లేదా పదివేల రూపాయలు జీవితంలో ఒకేసారి ఇచ్చే విరాళాలతో పార్టీ నిర్మించబడుతుంది.

ఏ పార్టీలో నయినా అధికార వికేంద్రీకరణ, ఆర్థిక వికేంద్రీకరణ, అంతర్గత ప్రజాస్వామ్యం, స్వయందిద్దుబాటు అవకాశాలు మొదలైన అంశాలు లోపించడం మూలంగా పార్టీ ప్రారంభదశ లోనే అవినీతికి అంకురార్పణ జరుగుతుంది. అటువంటి అవినీతిని అంతం చేయాలని ఓటర్లు పంతం పడితే సరిపోదు. పార్టీ యజమానికి లేని చిత్తశుద్ధీ, కార్యదక్షతా పార్టీలోని కార్యకర్తలకు ఎక్కడనుంచి వస్తుంది? నాడు అన్నాహజారే తో అవినీతి-వ్యతిరేక ఉద్యమం నడిపిన కేజరీవాల్ స్వయంకృత అపరాధానికి నేడు మోడీని నిందిస్తే, యేమిప్రయోజనం ? !!

25 నుండి 60 సంవత్సరముల వయస్సు కలిగిన యువతీ-యువకులందరికీ "ప్రతిపాదిత జుగాడ్ పార్టీ ఓటరు" గా ఇదే నా వ్యక్తిగతమైన ఆహ్వానం! **Cooperation based on trust** (నమ్మకం పై ఆధారపడిన పరస్పర సహకారం) అనే సంకల్పంతో సంఘటితంగా ఒక ప్రయత్నం చేద్దాం రండి. వివరాలకై రాబోయే 2024 జూలై జన బలం సంచికకై ఎదురు చూడండి !!

**Contact: Jugaad Parthasarathy (9866416798) With (1) MLA Constituency name (2) your name and gender (3) your age (4) your. Cell No:**

(Advt)

# ఉచిత పథకాలు ఉండాలా, వద్దా?

శ్రీరామ్

*ప్రభుత్వాన్ని మనం ఎందుకు ఏర్పాటు చేసుకున్నాం? మన ఉమ్మడి అవసరాలు తీర్చడానికి. అంటే, తాగునీరు, రహదారులు, ఇతరత్రా మౌలిక సదుపాయాలు, భద్రత, విద్య, వైద్యం మొదలైన పనుల కోసం! ఇవన్నీ మనకి మనం చేసుకోలేం కాబట్టి పన్ను రూపేణా ప్రభుత్వానికి కొంత డబ్బులు ఇచ్చి ఆ వసతుల్ని సమకూర్చుకుంటాం. అయితే మన ఉమ్మడి అవసరాల కోసం డబ్బులు తీసుకుంటున్న ప్రభుత్వం ఆ డబ్బుల్ని వ్యక్తిగత తాత్కాలిక పథకాల పేరుతో పంచిపెట్టటం సరైన పనేనా?*

'పేదవారున్న ధనిక దేశం భారత్' అని తరచూ వింటుంటాం. మన దేశంలో అధికారిక గణాంకాల మీద వివాదాలు ఇటీవల మరింత ఎక్కువయ్యాయి. వీటిల్లో బహుశా అన్నిటికంటే పెద్ద వివాదం పేదలు ఎంతమంది ఉన్నారనేది. ఒక్కొక్కళ్లు ఒక్కో లెక్కచెబుతారు. కానీ అనేక రంగాల్లో భారత్ వేగంగా ఎదుగుతున్నా, ప్రపంచంలో విస్మరించలేని స్థాయిలో ఉన్నా, మనది ఇప్పటికీ పేద దేశమని ఒప్పుకోవాలి. పేదరికాన్ని నిర్మూలించేస్థాయిలో ఆర్థికంగా ఎదిగే గొప్ప అవకాశం భారత్‌కి ఈవేళ అందుబాటులో ఉంది. మనం గతం నుంచి కొన్ని పాఠాలు నేర్చుకుని ఈ అవకాశాన్ని అందుకోగలగాలి. కానీ ఓట్ల కోసం పేదలకు సాయం పేరుతో ఆర్థికాభివృద్ధిని దెబ్బతీసే రాజకీయం ఇటీవల ఎక్కువైంది. పేదలకు ప్రభుత్వం సాయం చేయాలి. కానీ పేదరికం నుంచి వాళ్లంతా బయటపడటానికి కీలకమైన ఆర్థికాభివృద్ధి వాళ్లకు లేకుండా చేసి, నిరంతరం పేదరికాన్ని కొనసాగించేరీతిలో తాత్కాలిక పథకాల్ని అమలు చేయటమే పరిపాలన అన్నట్లు వ్యవహరించటం అసలు సమస్య. కాబట్టి పేదలకు సంక్షేమం అందించటం కాదు సమస్య, ఈ సంక్షేమం అందించే విధానంతోటే అందరికీ సమస్య. పేదవారికి డబ్బు పంచటమే పరిపాలన అయితే, ఆ డబ్బుతో ఆరోజు ఆకలి, మహా అయితే రేపటి ఆకలి తీరుతుంది. ఆ తరువాత రోజు ఎలా? ఎంత పెద్ద ప్రభుత్వమైనా, ఎంత డబ్బులున్న ప్రభుత్వమైనా పెరుగుతున్న పేదవారి అవసరాలకు సరిపడా ఎప్పటికీ ఇవ్వలేదు. ఆర్థికాభివృద్ధి అవకాశం చేజారితే ఆ సాయం అందించటం కూడా కష్టమవుతుంది.

**⏭ మరి ఏమి చేయాలి?**

పనిచేయలేని, ఆధారపడటానికి సరైన కుటుంబంలేని వికలాంగులకు, ఇంకా వృద్ధులకు పింఛను ఇవ్వాలి. పనిచేయగలిగినవారందరికీ ఉపాధి అవకాశాల్ని కల్పించాలి. అంటే, ఉపాధి హామీ పథకం అనుకుంటారేమో, ప్రభుత్వం అందరికీ పనివ్వలేదు! ప్రభుత్వం పనిచేయాలనుకునేవారికి సరైన పని లభించే వాతావరణాన్ని కల్పిస్తే చాలు. పనిచేయటం సరిగ్గారాని వారికి కొంత నైపుణ్యం పెంచుకునే అవకాశం అందుబాటులోకి తేవాలి.

**⏭ ప్రజలందరికీ ప్రభుత్వం ఎలా పని కల్పించగలదు?**

అతి చిన్న, చిన్న, పెద్ద, అతిపెద్ద పరిశ్రమలకు ప్రోత్సాహకాలు ఇవ్వటం, ఇంకా ఆ పరిశ్రమలు ఏర్పాటై అక్కడ ఉన్నవారికి పనికల్పించేలా చేయటం. దీనితోపాటు అక్కడ దగ్గరలో ఉన్న మండలాలవారికి ఆయా పరిశ్రమలకి సంబంధించిన పనిచేసే



నైపుణ్యం నేర్పించేందుకు చర్యలు తీసుకోవాలి.

**⏭ ఏయే పరిశ్రమలు దీనికి అనువైనవి?**

మన దేశంలో జనాభా సాంద్రత ఎక్కువ. మనం ఈ పరిశ్రమ అయితే మంచిది, ఇది మనకు సరిపడదు అనే పరిస్థితిలో లేము. మనకి అన్ని రకాల పరిశ్రమలు కావాలి. వీటిల్లో వస్త్ర పరిశ్రమలు లాంటివి మనకు బాగా అవసరం. పత్తి ఉత్పత్తి దగ్గర్నుంచి మనకున్న సానుకూలతల రీత్యా ఈ రంగంలో ఎక్కువమందికి ఉపాధి లభిస్తుంది. సేవలరంగాన్ని ప్రోత్సహిస్తూనే తయారీరంగాన్ని ఎక్కడికక్కడ విస్తరించాలి.

**⏭ ఎన్ని పరిశ్రమలు ఉండాలి?**


నా దృష్టిలో జిల్లాకి కియా లాంటివి రెండు లేదా మూడు ఉండాలి. కియా లాంటి ఒక్కో పరిశ్రమ వల్ల కొన్నివేలమందికి ప్రత్యక్షంగాను, దానికి రెండు మూడు రెట్ల మందికి పరోక్షంగానూ ఉపాధి లభిస్తుంది. ప్రతి పెద్ద పరిశ్రమతోపాటు అనుబంధ పరిశ్రమలు కూడా వస్తాయి.

ఇది మీరు చదివేసరికి ఆంధ్రప్రదేశ్‌లో ఎన్నికల ఫలితాలు వచ్చేస్తాయి. ఏ పార్టీ ప్రభుత్వం ఏర్పాటు చేసినా ఆ ప్రభుత్వం ఈ తరహాలో పనిచేసేట్లు చేద్దాం. దానికి మనందరం సోషల్ మీడియాలో కొత్త పరిశ్రమలు రప్పించటం గురించి మాట్లాడుకుందాం. ❖

# ఎన్నికల్లో AI – ప్రజాస్వామ్యం

సంతోషిణి

ప్రజాస్వామ్య దేశాల్లో పోటీ ఎన్నికల రాజకీయాలు ప్రజలను సమీకరించి ఓట్లను పొందటం చుట్టూ కేంద్రీకృతమై ఉంటాయి. రాజకీయ ప్రక్రియలో భాగంగా ప్రజలను చేరుకోవటానికి పార్టీలు, నాయకులు వివిధ ప్రచార పద్ధతులను అనుసరిస్తారు. తమ ఎజెండాను వివిధ రూపాలలో తెలియచేస్తుంటారు. పెరుగుతున్న సాంకేతికత ప్రభావం, అందుబాటు వల్ల సాంప్రదాయ ప్రచార వ్యూహాలు, ప్రజలను చేరుకునే పద్ధతులు కొత్త పుంతలు తొక్కుతున్నాయి. ఏఐ ఆవిర్భావం, వినియోగం ప్రపంచవ్యాప్తంగా రాజకీయ పరిణామాలపై లోతైన ప్రభావాన్ని కనబరుస్తోంది. నిర్దిష్ట పార్టీలు ఓటరు నమోదు డేటాబేస్‌లు, సోషల్ మీడియా ప్లాట్‌ఫాంలు, వినియోగదారుల ప్రవర్తన డేటా నుండి సమాచారాన్ని సేకరిస్తాయి. బీజేపీ 'సరళ్' యాప్, నమోదు సమయంలో పేరు, ఈ–మెయిల్, సంప్రదింపు నంబర్, మతం, వర్గం, కులం వంటి ఓటరు సమాచారాన్ని సేకరించింది. ఈ ప్రొఫైల్‌ల ద్వారా వయసు, లింగం, నివాసం, ఆసక్తులు వంటి జనాభాపరమైన కీలక మార్పుల్ని గుర్తిస్తారు. పార్టీల ఓటరు విభాగాలు నిర్దిష్టంగా సందేశాలు, ప్రచార అంశాలను రూపొందించడానికి ఈ సమాచారం సాధనంగా మారుతుంది. గత ఓటింగ్ ప్రవర్తన,



లక్ష్యానికి అనుగుణంగా ఎనలిటిక్స్, ప్రచార తీరు నుండి అధునాతన ఓటరు విశ్లేషణా సాధనాల వరకు, ఎన్నికల్లో పోటీతత్వంతో తలపడే రాజకీయ నాయకులకు ఏఐ (ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్) నూతన సాధనంగా మారింది. రాజకీయాలకు సాంకేతికతను జోడించటం ఎన్నికల ప్రచారాల పనితీరును క్రమంగా మారుస్తోంది. రకరకాల సామాజిక విభజనల ప్రాతిపదికన ఓటుబ్యాంకును నిర్మించుకోవటం లక్ష్యంగా సాగే భారతదేశ రాజకీయాలు, ఎన్నికల్లో, ఏఐ ప్రభావం, దాని వల్ల పరిణామాలను పరిశీలించటం అవసరం.

భారత రాజకీయ పార్టీలు తమ ఎన్నికల వ్యూహాలను మెరుగుపరిచేందుకు ఏఐ ఆధారిత ప్రచారం, డేటా అనలిటిక్స్, మెషిన్ లెర్నింగ్‌ల వాడుకను వేగవంతం చేశాయి. ఓటరు డేటా విశ్లేషణ కోసం ఏఐని వినియోగించటం ఇందులో కీలకమైనది. సమగ్ర ఓటరు వివరాలను రూపొందించటానికి రాజకీయ సోషల్ మీడియా స్పందనలు, ఇతర ఆన్‌లైన్ కార్యకలాపాలను విశ్లేషించడం ద్వారా, అల్గారిథమ్‌లు ఓటరు ప్రాధాన్యతలు, వైఖరులను కచ్చితత్వంతో అంచనా వేయగలవు. రాజకీయ పార్టీల ప్రచారాన్ని సూక్ష్మ స్థాయి వరకు తీసుకెళ్లి, ఊహించిన ప్రాధాన్యతల ఆధారంగా వ్యక్తిగతీకరించిన సందేశాలను అందించగలవు.

2019 లోక్‌సభ ఎన్నికలలో, నరేంద్రమోదీ మెసేజింగ్ యాప్‌ల ద్వారా ఓటర్లతో సంభాషించటానికి, వ్యక్తిగతీకరించిన సమాచారాన్ని అందించటానికి, రియల్‌టైమ్ ప్రశ్నలకు సమాధానం ఇవ్వడానికి 'నమో' అనే ఏఐ ఆధారిత కమ్యూనికేషన్ ప్లాట్‌ఫాంను ఉపయోగించారు. భారతదేశం అంతటా వేర్వేరు ప్రదేశాలలో ఒకేసారి బహుళ ర్యాలీలలో ప్రసంగించడానికి మోదీ హోలోగ్రాఫిక్ టెక్నాలజీని ఉపయోగించారు. భౌతికంగా హాజరుకాకుండానే చాలామంది

ఓటర్లను చేరుకున్నారు. అదేవిధంగా, 2019 ఫెడరల్ ఎన్నికల సమయంలో, జస్టిన్ ట్రూడో వ్యక్తిగతీకరించిన సందేశాలతో నిర్దిష్ట ఓటర్ సమూహాలను లక్ష్యంగా చేసుకోవడానికి లిబరలిస్ట్‌ఏఐని ఉపయోగించారు. 2016 అమెరికా అధ్యక్ష ఎన్నికల ప్రచారంలో, డొనాల్డ్ ట్రంప్ బృందం కేంబ్రిడ్జి అనలిటికాను ఉపయోగించింది. ఇది నిర్దిష్ట ఓటరు విభాగాలను గుర్తించటానికి, లక్ష్యంగా చేసుకోవడానికి ఏఐ ఆధారిత అల్గారిథమ్‌లను ఉపయోగించింది. ఆ విధంగా ఓటరు ప్రవర్తన, ప్రాధాన్యతలను విశ్లేషించటంలో ఏఐని పెద్ద సహాయకారిగా రాజకీయ పార్టీలు, నాయకులు భావిస్తున్నారు.

సోషల్ మీడియా, ఏఐ, ఎన్నికల రాజకీయాల మధ్య పరస్పర చర్య ప్రపంచవ్యాప్తంగా ప్రజాస్వామ్యాన్ని పునర్నిర్మిస్తోంది. ఈ త్రయం రాజకీయ ప్రచారాలు, రాజకీయాలు-ఓటరు సంబంధం, ప్రజాభిప్రాయ నిర్మాణంలో విప్లవాత్మక మార్పులు తెస్తోంది. ఫేస్‌బుక్, ట్విటర్, ఇన్‌స్టాగ్రాం వంటి సోషల్ మీడియా ప్లాట్‌ఫాంలు రాజకీయ నాయకులు, పార్టీల సాంప్రదాయ మీడియా ఫిల్టర్‌లను దాటవేసి మిలియన్ల మంది ఓటర్లను నేరుగా చేరుకుంటున్నాయి. విస్తారమైన సోషల్ మీడియా సంభాషణ, స్పందనల డేటాను విశ్లేషించటం, ఓటరు ప్రాధాన్యతలను, సెంటిమెంట్‌లు, ట్రెండ్‌లను గుర్తించటం ద్వారా ఎన్నికల రాజకీయాలలో సోషల్ మీడియా ప్రభావాన్ని ఏఐ పెంచుతుంది. మెషిన్ లెర్నింగ్ అల్గారిథమ్‌లు ప్రచారవ్యూహాలను తెలియచేసే అంతర్ దృష్టులను రూపొందిస్తాయి. ఉదాహరణకు, సెంటిమెంట్ విశ్లేషణ అనేది అభ్యర్థి ప్రసంగం లేదా విధాన ప్రతిపాదనకు ప్రజల తక్షణ ప్రతిస్పందనను అంచనా వేయగలదు. ప్రచారాల సందేశాలను వెంటనే సర్దుబాటు చేస్తుంది. సోషల్ మీడియాలో ఏఐ చాట్‌బాట్‌లు ప్రశ్నలకు తక్షణ ప్రతిస్పందనలను అందించటం, ఓటింగ్ ప్రక్రియల గురించి సమాచారాన్ని వ్యాప్తిచేయటం, ఓటరు నమోదును సులభతరం చేయటం, ఓటర్ల భాగస్వామ్యాన్ని, అవగాహనను గణనీయంగా పెంచుతూ వారి చొరవను మెరుగుపరచటం ద్వారా ప్రజాస్వామ్య ప్రక్రియలను బలోపేతం చేయటానికి దోహదపడుతున్నాయి.

అయితే ఏఐ వ్యక్తిగత సమాచారంపై ఆధారపడి ఉండటం వలన, గోప్యత గురించి, రాజకీయ నాయకులు, ఇతర సమూహాలు దుర్వినియోగం చేయటం పట్ల ఒక ఆందోళన పెరిగింది. ఓటర్ల ప్రొఫైల్ రూపొందించటానికి ఉపయోగించే ఏఐ పద్ధతులు ఎన్నికల గోప్యత, ఎన్నికల నిష్పాక్షికతకు గండి కొడుతున్నాయి. డీప్‌ఫేక్ ద్వారా ఏఐ రూపొందించే నకిలీ వీడియోలు, ఆడియో క్లిప్‌లు తప్పుడు సమాచారాన్ని వ్యాప్తి చేస్తూ, ప్రజల అభిప్రాయాల్ని ప్రభావితం చేయటమే కాకుండా రాజకీయ అభ్యర్థుల పరువుకు భంగం కలిగించగలవు. ఇదే కాకుండా ఏఐని విస్తృతంగా వాడే పార్టీలు ప్రజలను చేరుకోవటంలో పైచేయిలో ఉండటం ఇతర అభ్యర్థులు, పార్టీలకు సమస్యగా మారవచ్చు. డీప్‌ఫేక్ కొన్నిసార్లు రాజకీయ వ్యంగ్యానికి మరియు అనుకరణకు ఉపయోగిస్తారు. అవి సాధారణంగా హాస్యం, విమర్శ కోసం ఉద్దేశించినప్పటికీ, వాస్తవికత, కల్పనల మధ్య రేఖను అస్పష్టం చేయగలవు. స్పష్టత కొరవడితే తప్పుడు సమాచారానికి దోహదం చేస్తాయి. అదేవిధంగా ఇప్పటిదాకా ఉన్న సామాజిక విభజనాలు మీద ఆధారితమైన కుల, మత రాజకీయాలను ఏఐ దుర్వినియోగం చేసే అవకాశముంది. డీప్‌ఫేక్ ద్వారా ప్రచారమయ్యే తప్పుడు సమాచారాన్ని మరింత బలపరుస్తాయి. ఈమధ్య వచ్చిన అమిత్‌షా డీప్‌ఫేక్ వీడియో దీనికి ఉదాహరణ. డీప్‌ఫేక్‌లు ఓటరుకి తప్పు సమాచారం చేరటానికి దారితీస్తాయి.

ఏఐ సాంకేతికత, రాజకీయ ప్రక్రియల సంక్లిష్ట, చలన స్వభావం కారణంగా ఎన్నికల రాజకీయాల్లో ఏఐని నియంత్రించటానికి అనేక సవాళ్లున్నాయి. ఏఐ సాంకేతికత వేగంగా అభివృద్ధి చెందుతోంది. కొత్త సామర్థ్యాలు, అప్లికేషన్‌లు ఆవిష్కృతమవుతున్నాయి. ఈ నిరంతర పరిణామం నియంత్రణ వ్యవస్థల నిర్మాణంలో వేగాన్ని కష్టతరం చేస్తుంది. నిబంధనలను ఏర్పాటు చేసే సమయానికి, సాంకేతికత అప్పటికే అభివృద్ధి చెంది ఉండవచ్చు, నిబంధనలను కాలం చెల్లినవిగా చేయవచ్చు. ఎన్నికల రాజకీయాలలో ఏఐ ఓటర్ల నుండి వ్యక్తిగత సమాచారంతో సహా పెద్ద డేటాసెట్‌లపై ఎక్కువగా ఆధారపడుతుంది. అటువంటి డేటా సేకరణ, నిల్వ, వినియోగాన్ని నియంత్రించటానికి బలమైన డేటా రక్షణ చట్టాలు, అమలు విధానం అవసరం. వీటి అమలు, పర్యవేక్షణ కష్టం. ఏఐ వ్యవస్థలు తమ శిక్షణ డేటాలో ఉన్న ప్రస్తుత పక్షపాతాలను శాశ్వతం చేయగలవు లేదా విస్మరించగలవు. ఈ పక్షపాత ధోరణుల్ని గుర్తించటం, తగ్గించటం కోసం అల్గారిథమ్‌లను నిరంతరం పర్యవేక్షించటం, నవీకరించటం అవసరం. ఇది సంక్లిష్టమైన, ఎక్కువ వనరులు అవసరమైన ప్రక్రియ. ఏఐ తన అపూర్వమైన వేగం, స్థాయితో తప్పుడు సమాచారాన్ని రూపొందించగలదు, వ్యాప్తి చేయగలదు. దీనివల్ల నియంత్రణ వ్యవస్థలు సకాలంలో గుర్తించటం, ప్రతిస్పందించటం కష్టతరమవుతోంది. సోషల్ మీడియా వైరల్ స్వభావం సమస్యను మరింత తీవ్రతరం చేస్తుంది. ఎందుకంటే దిద్దుబాటు చర్యలు తీసుకునేటప్పటికే తప్పుడు సమాచారం వేగంగా వ్యాప్తి చెందుతుంది. తప్పుడు సమాచార ప్రచారాలు తరచుగా అనామకంగా లేదా మారుపేర్ల నుండి వస్తాయి. తప్పుడు సమాచారాన్ని సృష్టించటం, వ్యాప్తి చేయటానికి బాధ్యులను గుర్తించటం, జవాబుదారీ చేయటం సవాలుగా మారుతోంది. రాజకీయ పార్టీల విషయంలో ఇది మరింత కష్టమవుతోంది.

భారతదేశంలో సోషల్ మీడియా ప్రజల జీవితాల్లోకి లోతుగా చొచ్చుకుపోవటంతో పార్టీలు, అభ్యర్థులు బాధ్యతాయుతంగా ఉపయోగించేలా చేయటం, ఏఐ వినియోగాన్ని నియంత్రించటం అవసరం. ఈ రకమైన హేతుబద్ధ నియంత్రణ వల్ల ఓటర్లు మరింత మెరుగైన అభ్యర్థుల్ని ఎంపిక చేసుకునే సామర్థ్యాన్ని పెంచే విధంగా రాజకీయ సమీకరణలను గావిస్తూ ఏఐ ప్రజాస్వామ్యాన్ని మరింత పటిష్ఠం చేస్తుంది. ❖

# కొత్త ప్రభుత్వాలు వేగిరం ఈ మార్పుల్ని తెస్తాయా?

- బండారు రామ్మోహనరావు

***జాతీయస్థాయిలో, ఆంధ్రప్రదేశ్‌లో కొత్త ప్రభుత్వాలు ఎన్నికయ్యాయి. సుపరిపాలన అందిస్తామని అధికార పగ్గాలు చేపట్టిన నేతలు ఘంటాపథంగా చెబుతున్నారు. ఆచరణే దేనికైనా గీటురాయి. పరిపాలనలో మార్పు రావాలంటే.. రాజకీయ, పాలనా సంస్కరణలు అవసరం. వివిధ రంగాల్లో జాప్యం లేకుండా రావాల్సిన కొన్ని ప్రధాన మార్పులు, నేపథ్యంపై కథనం..***

మెరుగైన సమాజానికి ఆధారం సుపరిపాలన! పరిపాలన బాగుంటేనే ప్రజలు సుఖశాంతులతో జీవిస్తారు. రాజ్య అవతరణ సిద్ధాంతం రాజ్యం పుట్టుక గురించి వివరిస్తుంది. మొదట కొండచరియల్లో, గుహల్లో నివసించిన మానవుడు.. క్రూర జంతువుల నుంచి తన రక్షణ కోసం సమూహాలుగా బతకడం నేర్చుకున్నాడు. ఆ సమూహాలే పరస్పరం ఘర్షణ పడ్డప్పుడు సమూహాల మధ్య, గుంపుల మధ్య చిన్నపాటి యుద్ధాలు జరిగాయి. నిప్పును కనుక్కోవడం, ఇనుమును, చక్రాన్ని కనుక్కోవడం, పాత రాతి యుగం, కొత్త రాతి యుగం, మాతృస్వామ్య వ్యవస్థ నుండి పితృస్వామ్య వ్యవస్థకు మళ్లడం వంటి పరిణామాలు చోటు చేసుకున్నాయి. ఆహార సేకరణ దశ నుండి ఆహార ఉత్పత్తి దిశగా సమాజ పరిణామక్రమం సాగింది. గుంపులుగా జీవించిన మనుషులు మెల్లమెల్లగా సమష్టి వ్యవసాయం వైపు మళ్లారు. అలా వచ్చిన అదనపు వ్యవసాయ ఉత్పత్తిని దాచుకోవడానికి గుడిసెలాంటి ఇల్లు అవసరమైంది. ఎప్పుడైతే ఇల్లు వచ్చిందో దాని చుట్టూ కంచె వచ్చింది. ఇలా సొంత ఆస్తి ఏర్పడింది. అలా ఏర్పడిన సొంత ఆస్తిని గుర్తించడానికి రాజ్యం పుట్టుక అవసరమైంది. గ్రూపుల మధ్య, సమూహాల మధ్య ఘర్షణ జరిగినప్పుడు అవసరమైన తీర్పు చెప్పే వ్యవస్థగా కూడా రాజ్యం బలపడింది. అలా ఏర్పడిన రాజ్య పాలకులు సామ్రాజ్య విస్తరణ కాంక్షతో ఇతర గుంపులను కలుపుకోవడం, ప్రాంతాలను ఆక్రమించడం చేస్తూ రాజ్యాన్ని విస్తరించి తమ అధికారాలను విస్తృతపరచుకున్నారు. ఆ క్రమంలో రాజ్యం ప్రధాన కర్తవ్యం ప్రజల ధన, మాన, ప్రాణ రక్షణ మాత్రమే. ఇలా మొదలైన రాజ్యం తన కర్తవ్యాలను విస్తరించుకుంటూ పోయింది. ఆ క్రమంలోనే నివాసాల మధ్య మౌలిక వసతుల కల్పన, మంచినీటి బావులు తవ్వించడం, రహదారుల నిర్మాణం, బాటసారులు విశ్రాంతి తీసుకోవటానికి సత్రములు కట్టించడం, చెట్లు నాటించడం.. ఇలా రాజ్యం తన పనిని విస్తృత పరచుకుంది. అందుకే పై పనులు చేసిన చక్రవర్తి అశోకుడు మనకు ఒక ఆదర్శం అయ్యారు.




కాలం మారుతుంది, సమాజం కూడా మారుతుంది. కాలక్రమంలో పాలన తీరు కూడా మారాలి. అలా రాజులు, చక్రవర్తులు మనను పాలించారు. సమాజ పరిణామ క్రమంలో పాలన ఆధునీకరించబడింది. మన దేశంలో సుమారు అయిదారు వందల సంస్థానాలు, రాజ్యాలు ఉన్నా వీటన్నిటినీ కలిపి అప్పటి సామ్రాజ్యాలు ఏర్పడ్డాయి. ఆధునిక భారతంలో బ్రిటిష్ వారి ఈస్టిండియా కంపెనీ మన దేశంలోకి ప్రవేశించడం, ఆ తర్వాత పాలనా పగ్గాలు చేపట్టి సుమారు 200 ఏళ్లు మనల్ని పాలించడం జరిగింది. చివరికి 1947 ఆగస్టు 15న మనకు స్వాతంత్ర్యం లభించింది. ప్రజాస్వామ్య పాలనలోకి ప్రవేశించాం. ఆ తర్వాత 1950లో ఒక రాజ్యాంగాన్ని తెచ్చుకున్నాం.

మెల్లమెల్లగా పాలన తీరు మారుతూ ఈనాటి పరిస్థితికి వచ్చాం. 1935లో భారత రాజ్యాంగం బ్రిటిష్‌వారి హయాంలోనే తయారైంది. దానికి మెరుగులు దిద్ది మనదైన రీతిలో జనవరి 26, 1950 నుండి మన రాజ్యాంగాన్ని అమలు చేసుకుంటున్నాము. విదేశీ పాలన అంతమైనా, మన పాలనలో విదేశీ జాడ్యం వదలటం లేదు. అధికారం అంటే ప్రజల మీద పెత్తనం చలాయించడం అనే భావన నేటికీ ఉంది. ఇది మారాలి.. మారాలంటే రాజకీయ, పాలనా సంస్కరణలు తీసుకురావలసిన అవసరం ఎంతైనా ఉంది.

ఇది గమనించే 1965లో మొరార్జీ దేశాయ్ అధ్యక్షులుగా మొట్టమొదటి పాలనా సంస్కరణల సంఘం ఏర్పడింది. అలా ఏర్పడిన ఆ సంఘం అనేక పాలనా సంస్కరణలను సిఫారసు చేసింది. అవి కొన్ని అమలు కాగా, మరికొన్ని సిఫారసులను మూలన పడేశారు. ఆ తర్వాత 2005లో రెండవ పాలనా సంస్కరణల సంఘం వీరప్ప మొయిలీ అధ్యక్షతన ఏర్పాటయింది. ఇందులో సభ్యునిగా లోక్‌సత్తా జయప్రకాష్ నారాయణ్ వివిధ నివేదికల రూపకల్పనలో కీలక పాత్ర పోషించారు. ప్రజాస్వామ్య పాలన అంటే ప్రజలకు జవాబుదారీగా, పారదర్శకంగా ఉండాలని ఆ సంఘం సిఫారసు చేసింది. అందులోనే న్యాయ, పోలీసు సంస్కరణలతోపాటు రాజకీయ, ఎన్నికల సంస్కరణల విషయం కూడా ప్రస్తావించింది. ఇవాళ చర్చ నడుస్తున్న పౌర సేవ, భూచట్టాలు సహా అనేక పాలనా సంస్కరణల్ని సిఫారసు చేసింది. కానీ అమలులో చాలా జాప్యం జరుగుతోంది. ఈ దశలో మన దేశంలో రాజకీయ, ఆర్థిక, న్యాయ, పోలీసు సంస్కరణలతోపాటు ఎన్నికల సంస్కరణల్ని వేగంగా అమలు చేయవలసిన అవసరం ఎంతైనా ఉంది.

**మొదటిది రాజకీయ సంస్కరణలు**

రాజకీయం ఒక పవిత్రమైన వ్యాసంగం. రాజకీయాల్ని మనం తిరస్కరించవచ్చు, ద్వేషించవచ్చు.. కానీ రాజకీయాలు లేని

సమాజాన్ని మనం ఊహించలేము. రాజకీయం సమాజాన్ని శాసిస్తుంది, లక్ష్యసాధన వైపు నడిపిస్తుంది. మెరుగైన సమాజాన్ని ఏర్పరచడానికి మౌలిక ఉపకరణం పనిని ఇది చేస్తుంది, ఈ పని తప్పనిసరి. కానీ నేటి రాజకీయం, రాజకీయ పార్టీలు ఆ పని చేస్తున్నాయా అని మనం ప్రశ్నించుకోవాలి. ఒకనాడు రాజకీయానికి ఉన్న విలువ ప్రస్తుతం లేదు. ఆనాడు.. రాజకీయమంటే త్యాగం, రాజకీయమంటే స్వార్థం లేకపోవడం, రాజకీయం అంటే సమాజహితం కోరేది. పరిమితమైన వనరులకు, అపరిమితమైన ప్రజల కోర్కెలకు వారధి కట్టేదిగా, ఈ క్రమంలో పరస్పర విరుద్ధ ప్రయోజనాలను కూడా సమన్వయం చేసేదిగా రాజకీయం నిలవాల్సి ఉంది. కానీ ఆచరణలో రాను రాను అది విఫలం అవుతోంది. నేడు రాజకీయం అంటే అర్థం మారిపోయింది. కొందరు ఎద్దేవా చేసినట్లుగా.. రా అంటే రాక్షసంగా, జ అంటే జనానికి, కీ అంటే కీడు చేసే, యం అంటే యంత్రాంగంగా నేటి రాజకీయం తయారైంది. ఈ నిర్వచనం ప్రస్తుత దుస్థితికి అద్దం పట్టొచ్చుగానీ, దీన్ని చూస్తూ కూర్చోవటం మనం చేయాల్సిన పని కాదు. రాజకీయాన్ని ప్రజలకు మేలు చేసే ఒక వ్యవస్థగా పనిచేయించాలి మనం. రాజకీయాలు అలా పనిచేయాలంటే రాజకీయాలు పౌరుల చుట్టూ తిరుగుతూ ఎప్పటికప్పుడు మెరుగుపడుతూండాలి. భూస్వామ్య, పెత్తందారీ లక్షణాలను వదిలించుకుని ఇలా ప్రజాస్వామీకరించబడాలంటే రాజకీయాల్లో వ్యవస్థాపరమైన ఏర్పాట్లు ఎంతో అవసరం.

1950 ప్రజా ప్రాతినిధ్య చట్టంలో తప్ప మన రాజ్యాంగంలో ఎక్కడా కూడా రాజకీయ పార్టీల పుట్టుక, వాటి నడవడిక గురించి చెప్పలేదు. రాజకీయ పార్టీ నమోదు మొదలుకొని ఒకవేళ రద్దు చేస్తే అంతవరకూ, కేవలం ఎన్నికల కమిషన్ దగ్గర రిజిస్ట్రేషన్‌కు మాత్రమే పరిమితమైంది. ఆ తర్వాత ఆయా పార్టీలకు రాష్ట్రాలలో, దేశంలో వచ్చిన ఓట్ల శాతాన్ని బట్టి ఎన్నికల కమిషన్ గుర్తింపునిస్తుంది. రాజకీయ పార్టీల అంతర్గత ప్రజాస్వామ్యం గురించి కానీ, వాటి నిధుల సేకరణ గురించి కానీ, వాటికిచ్చే విరాళాల గురించి కానీ చట్టంలో పకడ్బందీ ఏర్పాట్లు లేవు. నామమాత్రంగానే ఉన్నాయి. రాజకీయ పార్టీలలో సభ్యత్వం మొదలుకొని అంతర్గత ఎన్నికల వరకు ఒక తంతుగా మాత్రమే సాగుతుంది. వీటిని నియంత్రించడానికి సరైన ఏర్పాట్లు లేవు. అలాగే రాజకీయ పార్టీలు ప్రైవేటు ఆస్తులుగా మారిపోయాయి. కొన్ని కుటుంబ పార్టీలుగా మిగిలిపోయాయి. రాజకీయ పార్టీలు సిద్ధాంతాల పైన, విలువల పైన ఆధారపడి ఏర్పడాలి. అలా ఏర్పడిన పార్టీలు కూడా ఇవాళ కుక్కమూతి పిందెలుగా మారిపోయాయి. విలువలకు తిలోదకాలు ఇచ్చాయి. అన్ని పార్టీలు ఒకే తాను గుడ్డలుగా మిగిలిపోయాయి. రంగులు, జెండాలు వేరైనా అన్ని పార్టీల ఎజెండా ఒకటిగా, సంకుచితంగా మారింది. ఈ దశలో ప్రజలు ఒకవైపు, పార్టీలు మరోవైపు మిగిలిపోయాయి. ప్రజాస్వామ్య రాజకీయం ఒక మొక్కుబడి తంతుగా, యాంత్రిక కార్యక్రమంగా మారిపోయింది. ఈ దుస్థితి మారాలంటే రాజకీయ పార్టీల రిజిస్ట్రేషన్ మొదలుకొని పార్టీల విరాళాలు, అంతర్గత ఎన్నికలు, అభ్యర్థుల ఎంపిక, ఎన్నికల వరకు పారదర్శకంగా, ప్రజలకు జవాబుదారీగా జరగవలసి ఉంది. దీన్ని నియంత్రించే వ్యవస్థను మన ఎన్నికల కమిషన్‌కు అప్పచెప్పవలసి ఉంది. ప్రతి పార్టీ వ్యవహారాలు బహిరంగంగా ప్రజలకు తెలిసేలా సమాచార హక్కు చట్టం కిందకి తీసుకురావాల్సిన అవసరం ఎంతైనా ఉంది. ఎవరెవరి ప్రైవేటు బతుకు వారి వారి సొంతం.. పబ్లిక్‌లో నిలబడితే ఏమైనా అంటాం.. అన్న మహాకవి శ్రీశ్రీ వాక్కు మనకు నిరంతరం గుర్తుండాలి. అప్పుడే విశాల ప్రజాహితం కోసం, ప్రజల్లో ఐకమత్యాన్ని, సామరస్యతను పెంచటం కోసం పార్టీలు ఏర్పడి పనిచేస్తాయి, విభజన రాజకీయాలు మాని సమాజహితం కోసం పాటు పడతాయి. అందరి కోసం ఒక్కరు నిలిచి, ఒక్కరి కోసం అందరు కలిసి అన్నట్లు మెరుగైన సమాజ నిర్మాణంలో రాజకీయ పార్టీల నాయకత్వం పోటీ పడి పనిచేస్తాయి, సుపరిపాలనను ఆవిష్కరించగలుగుతాయి.

**ఎన్నికల సంస్కరణలు**

ప్రజాస్వామ్యానికి ఎన్నికలు ఎంతో ముఖ్యం కానీ, ఎన్నికలు జరగడం మాత్రమే ప్రజాస్వామ్యం కాదు. భారతదేశంలో బ్రిటిష్ వారి హయాంలోనే మనకు ఎన్నికల వ్యవస్థ ఉంది. ఆనాటి ఈ బ్రిటిష్ ప్రావిన్సులలో స్థానిక ప్రభుత్వాలకు ఎన్నికలు జరిగాయి. అలాగే రాష్ట్రాల శాసనసభలకు కూడా ఎన్నికలు జరిగాయి. బ్రిటిష్ వారి వలస పాలనలో జరిగిన ఎన్నికలే అయినా అందులో పాల్గొని చట్టసభ సభ్యులుగా, మేయర్లుగా ఎన్నికైనవారు పదవుల్లో ఉంటూనో లేక రాజీనామా చేసో భారత జాతీయ పోరాటంలో పాల్గొన్నారు. ఎన్నికైన పదవులను తృణప్రాయంగా వదులుకున్నారు. భారతదేశానికి స్వాతంత్ర్యం వచ్చాక ఆ నాయకులే కొందరు దేశాన్ని జాతీయస్ఫూర్తితో నడిపించారు. బ్రిటిష్ వారి వలస పాలన తర్వాత వారి ఆలోచనలతోనే ఇతర దేశాల రాజ్యాంగాలను అధ్యయనం చేసి మనం భారత రాజ్యాంగాన్ని తయారు చేసుకున్నాము. కానీ

***1950 ప్రజా ప్రాతినిధ్య చట్టంలో తప్ప మన రాజ్యాంగంలో ఎక్కడా కూడా రాజకీయ పార్టీల పుట్టుక, వాటి నడవడిక గురించి చెప్పలేదు. రాజకీయ పార్టీ నమోదు మొదలుకొని ఒకవేళ రద్దు చేస్తే అంతవరకూ, కేవలం ఎన్నికల కమిషన్ దగ్గర రిజిస్ట్రేషన్‌కు మాత్రమే పరిమితమైంది. ఆ తర్వాత ఆయా పార్టీలకు రాష్ట్రాలలో, దేశంలో వచ్చిన ఓట్ల శాతాన్ని బట్టి ఎన్నికల కమిషన్ గుర్తింపునిస్తుంది. రాజకీయ పార్టీల అంతర్గత ప్రజాస్వామ్యం గురించి కానీ, వాటి నిధుల సేకరణ గురించి కానీ, వాటికిచ్చే విరాళాల గురించి కానీ చట్టంలో పకడ్బందీ ఏర్పాట్లు లేవు. నామమాత్రంగానే ఉన్నాయి.***

ఎన్నికల వ్యవస్థను మాత్రం ఒక ఓటు మెజారిటీతోనైనా గెలిచే, ఒక ఓటు తక్కువొచ్చినా ఓడే ఎఫ్.పి.టి.పి పద్ధతిలోనే రూపొందించుకున్నాం. ఈ పద్ధతిలో ఎలాగైనా ఒక్క ఓటు అయినా ఎక్కువ తెచ్చుకుని గెలవాలని అభ్యర్థులు, రాజకీయ పార్టీలు ఆలోచించడం సహజమే. ప్రజాస్వామ్యం పరిణతి చెందిన దేశాల్లో ఫరవాలేదుగానీ.. ఎంతో అవిద్య, పేదరికం, అపరిపక్వ ప్రజాస్వామ్యం, అధికార పిచ్చి ఉన్న మన దేశంలో ఈ రకమైన పోటీ చాలా పెద్ద ఎన్నికల సంక్షోభానికి దారితీసింది. మనం ఎవరి ఆలోచనలనైతే గుడ్డిగా అనుకరించామో, ఆ బ్రిటన్‌లో కూడా ఇప్పుడు పూర్తిగా ఎఫ్.పి.టి.పి ఎన్నికల విధానం లేదు. అయినా మనం దిద్దుబాటు చేసుకోలేదు. మన దేశానికి తగ్గ ఎన్నికల వ్యవస్థ నిర్మాణం జరగకపోవటంతో ప్రజాస్వామ్యం బదులు మందస్వామ్యం బలపడింది. కర్ర ఉన్నవాడిదే బర్రె అనే సామెత నిజమైంది. స్వతంత్రం వచ్చి 75 ఏళ్లు దాటినా ఎన్నికలను, అందులో గెలుపు గుర్రాలను దాటి ప్రజాస్వామ్యం వికసించలేదు. ఎలాగైనా గెలవాలంటే సమాజంలోని కులం, మతం, ప్రాంతం, భాష, ఇతరత్రా సమాజ సంక్లిష్ట భిన్నత్వాల్ని వాడుకోవటం రాజకీయ పార్టీలకు నిత్యకృత్యమైంది. ఇంతింతై వటుడింతై అన్నట్లు ఈ రుగ్మతే రాజకీయంగా తయారైంది. ఓటు బ్యాంకు రాజకీయాల కోసం దేన్నయినా వాడుకునే దుర్రాజకీయ స్వార్థం ప్రబలింది. రాజకీయాలలో విలువల పతనం పరాకాష్ఠకు చేరుకుంది. సమస్య వర్ణన ఎంతైనా చేయవచ్చు. ఇప్పుడు చేయవలసింది సమస్య పరిష్కారంలో భాగమవటం. పరిష్కారం మరిన్ని సమస్యలు సృష్టించేది కాకూడదు.

కొన్నిచోట్ల అధ్యక్ష తరహా ప్రజాస్వామ్యం, మరికొన్ని చోట్ల పార్లమెంటరీ ప్రజాస్వామ్యం ఉన్నాయి. బ్రిటిష్ వారు పరిపాలించిన మనలాంటి దేశాలలో బ్రిటిష్ వారి అప్పటి ఎన్నికల పద్ధతిని కొనసాగిస్తున్నాం. అదే ఒక ఓటు గెలుపోటములను నిర్ణయించటం. మన దేశంలో కూడా ఎమ్మెల్సీ ఎన్నికల్లో, రాజ్యసభ ఎన్నికల్లో ప్రాధాన్యతా క్రమంలో ఓటు వేసే పద్ధతి ఉంది. కానీ ప్రజలు గ్రామపంచాయతీ నుంచి పార్లమెంటు దాకా ప్రతినిధుల్ని ఎన్నుకోవటంలో మాత్రం ఒక ఓటు మెజారిటీతోనైనా గెలవటం అనే పద్ధతినే పాటిస్తున్నాం.

ప్రపంచంలోని కొన్ని దేశాలలో రాజులు, నియంతలు పాలిస్తున్నా.. చాలా దేశాల్లో ప్రజాస్వామ్యం ఉంది. ప్రజాస్వామ్యంలో కొన్ని పూర్తి ప్రజాస్వామ్య దేశాలు కాగా, మరికొన్ని పాక్షిక ప్రజాస్వామ్య దేశాలు. ఈ ప్రజాస్వామ్య దేశాల ఎన్నికల వ్యవస్థలను ఒకసారి పరిశీలిస్తే కొన్ని విషయాలు మనకు తెలుస్తాయి. కొన్నిచోట్ల అధ్యక్ష తరహా ప్రజాస్వామ్యం, మరికొన్ని చోట్ల పార్లమెంటరీ ప్రజాస్వామ్యం ఉన్నాయి. బ్రిటిష్ వారు పరిపాలించిన మనలాంటి దేశాలలో బ్రిటిష్ వారి అప్పటి ఎన్నికల పద్ధతిని కొనసాగిస్తున్నాం. అదే ఒక ఓటు గెలుపోటములను నిర్ణయించటం. మన దేశంలో కూడా ఎమ్మెల్సీ ఎన్నికల్లో, రాజ్యసభ ఎన్నికల్లో ప్రాధాన్యతా క్రమంలో ఓటు వేసే పద్ధతి ఉంది. కానీ ప్రజలు గ్రామపంచాయతీ నుంచి పార్లమెంటు దాకా ప్రతినిధుల్ని ఎన్నుకోవటంలో మాత్రం ఒక ఓటు మెజారిటీతోనైనా గెలవటం అనే పద్ధతినే పాటిస్తున్నాం. ప్రజల అవసరాలు ఎక్కువగా ఉండే, ప్రజలు చురుగ్గా పాల్గొనే స్థానిక ప్రభుత్వాలు, రాష్ట్ర అసెంబ్లీ ఎన్నికల్లోనూ ఇదే పద్ధతి వల్ల మన దేశం ఉన్న పరిస్థితుల్లో ఎన్నికలు భ్రష్టుపట్టిపోయాయి. తిమ్మినిబమ్మిని చేసయినా గెలవాలని కోట్లాది రూపాయలను వెదజల్లుతూ ప్రజలను, ప్రజాస్వామ్య నాయకత్వాన్ని ఎదగనీయకుండా చేస్తున్నారు. దీన్ని నివారించాలంటే దామాషా పద్ధతిని దేశంలో ప్రవేశపెట్టటమే మెరుగైన పరిష్కారం.

దామాషా పద్ధతి ప్రకారం.. ఎన్నిక మొత్తంలో పోలైన ఓట్లలో ఏ పార్టీకి ఎంత శాతం ఓట్లు వస్తాయో ఆ వచ్చిన ఓట్ల శాతాన్ని బట్టి అసెంబ్లీలోనూ, పార్లమెంటులోనూ ఆయా పార్టీలకు చట్టసభల్లో ప్రాతినిధ్యం కల్పిస్తారు. ఒకటి పార్టీకి, మరో ఓటు నియోజకవర్గ ఎమ్మెల్యేకి, ఎంపీకి వేసే విధంగా ద్విసభ్య నియోజకవర్గాల వ్యవస్థని కూడా ఏర్పాటు చేసుకోవచ్చు. మన దేశ పరిస్థితులకనుగుణంగా అవసరమైన మార్పులు చేసుకోవచ్చు. దీనివల్ల పార్టీలు గెలుపు గుర్రాల వెనకాల పడవు. ఒకటి రెండు శాతం ఓట్ల తేడాతో ప్రభుత్వాలు పడిపోవడం లాంటి పరిస్థితులు రావు. దామాషా ఎన్నికల పద్ధతిలో అవసరమైతే మన దేశ పరిస్థితులకనుగుణంగా ఇంకొన్ని మార్పులను చేసుకోవచ్చు. ఈ ఎన్నికల పద్ధతిలో మంచి నాయకులు పార్టీల విజయావకాశాల మీద ప్రభావం చూపగలరు. రాజకీయ పార్టీలలో అంతర్గత ప్రజాస్వామ్యం, విధానాల బలం, సమర్థ నాయకత్వం ఎంత ఎక్కువగా ఉంటే దామాషా విధానంలో విజయావకాశాలు అంత ఎక్కువగా ఉంటాయి. ప్రపంచంలోని చాలా ప్రజాస్వామ్య దేశాలలో దామాషా పద్ధతి ఎన్నికల విధానమే కొనసాగుతోంది. మనం దామాషాతోపాటు, రాష్ట్రాల్లో ముఖ్యమంత్రుల ప్రత్యక్ష ఎన్నికల పద్ధతిని అనుసరిస్తే ఇప్పుడున్న ఎన్నికల వ్యవస్థలోని సంక్షోభాన్ని అదుపుచేయగలం. వేల కోట్ల నల్లధనాన్ని, నేర చరితుల పోటీని, మద్యం పంపిణీ వంటి వాటిని కట్టడి చేయగలం. ఇటీవల బాగా పెచ్చరిల్లిన ఉచితాలు, తాత్కాలిక తాయిలాలను ఆదాయానికి తగ్గ పరిమితిలోకి తెచ్చి, విధానాల రాజకీయం చేయగలం.

పార్టీల ఎన్నికల మేనిఫెస్టోలను వడబోసి ఎన్నికల ముందుగాని, ఎన్నికల తర్వాతగానీ ప్రజాధనాన్ని వృథా చేయకుండా అడ్డుకట్ట వేయడానికి తగిన వ్యవస్థను ఏర్పాటు చేయాలని ఎన్నికల సంఘానికి, పాలకులకు ఎన్నిసార్లు విజ్ఞప్తి చేసినా స్పందన లేదు. దామాషా పద్ధతిలో ఉచితాలు, తాయిలాలను బరితెగించి ఇచ్చే ధోరణి నుంచి బైటపడే అవకాశం కూడా పార్టీలు, అభ్యర్థులకు లభిస్తుంది. పార్టీల సిద్ధాంతాలకు విలువ లభిస్తుంది. మొదట్లో కాంగ్రెసేతర రాజకీయ పక్షాలైన సీపీఐ, సీపీఎంలతో పాటు

బీజేపీ, శివసేన, నేషనలిస్ట్ కాంగ్రెస్ లాంటి 16 పార్టీలు దామాషా పద్ధతి ఎన్నికల విధానాన్ని తేవాలని ప్రతిపాదించాయి. ఎన్నికల సంస్కరణల కోసం ఈ పార్టీలు అనేకసార్లు ఎలుగెత్తాయి. కానీ అవే పార్టీలు మెజారిటీతో అధికారంలోకి రాగానే ఎన్నికల సంస్కరణల సంగతి పట్టించుకోలేదు.

2004లో కేంద్రంలో యూపీఏ అధికారంలోకి వచ్చినప్పుడు దామాషా ఎన్నికల పద్ధతి కోసం లోక్‌సత్తా వ్యవస్థాపకుడు డా. జేపీ చేసిన ప్రయత్నానికి కమ్యూనిస్టు పార్టీలు సహకరించలేదు. మాకది ప్రాధాన్యాంశం కాదు.. అని సీపీఎం జాతీయ ప్రధాన కార్యదర్శి ప్రకాష్ కారట్ దాటవేశారు. యూపీఏకి కీలక మద్దతుదారుగా ఉన్న సీపీఎం డిమాండ్ చేస్తే కాంగ్రెస్ అంగీకరిస్తుంది అని ఎంత చెప్పినా వినిపించుకోలేదు. పెద్ద రాష్ట్రాలలో జాతీయ పార్టీలు అంతరిస్తున్న తీరును వివరిస్తూ దామాషా పద్ధతి వల్ల కాంగ్రెస్‌కు ప్రయోజనముంటుందని జేపీ వివరించటంతో యూపీఏ ఛైర్‌పర్సన్ సోనియాగాంధీ కొంత సుముఖత వ్యక్తం చేసినా, తగినంత రాజకీయ ఒత్తిడి లేకపోవటంతో ఆరోజు ఆ అవకాశం తృటిలో తప్పిపోయింది. ఆ తప్పిదానికి ఈవేళ కాంగ్రెస్, కమ్యూనిస్టులతోపాటు అనేక పార్టీలు మూల్యం చెల్లిస్తున్నాయనటంలో సందేహం లేదు. నియంతృత్వ పాలనను అదుపు చేయాలని, ప్రత్యామ్నాయ ఆలోచనలను అమల్లోకి తేవాలని ప్రయత్నిస్తున్న రాజ్యాంగ ప్రజాస్వామిక శక్తులకు చట్టసభల్లో అవకాశాలు కరువయ్యాయి. జమిలి ఎన్నికల ప్రతిపాదనను కేంద్రంలో అధికారంలో ఉన్న పార్టీయే ముందుకు తెచ్చింది కాబట్టి.. దీన్నో అవకాశంగా ఉపయోగించుకుని కనీసం రాష్ట్రాల్లో దామాషా ఎన్నికలకు పార్టీలు కృషి చేయాలి. జాతీయ స్థాయిలో దామాషా ఎన్నికల పద్ధతికి ఇప్పట్లో బీజేపీ అంగీకరించే అవకాశాలు తక్కువ. రాష్ట్రాల నుంచి సంస్కరణలు అమలైనా పెద్ద మార్పునకు నాంది పలుకుతుందనటంలో సందేహం లేదు.

**చట్టసభల్లో మహిళలకు ప్రాతినిధ్యం**

దేశవ్యాప్తంగా చూస్తే, లోక్‌సభలో 543 మంది సభ్యులు, రాజ్యసభలో 235 మంది సభ్యులు, శాసనసభల్లో 4,500 మంది దాకా సభ్యులు ఉన్నారు. జనాభా ప్రాతిపదికన వీరిలో సగం మంది మహిళలు ఉండాల్సి ఉండగా.. మహిళల ప్రాతినిధ్యం ఆ దరిదాపుల్లో కూడా లేదు. ఇటీవల యూనియన్ ప్రభుత్వం చట్టసభల్లో మహిళలకు 33% రిజర్వేషన్ బిల్లును ఆమోదించింది. నియోజకవర్గాల పునర్విభజన తర్వాత 2029 నుండి అమలవుతుందని చట్టం పేర్కొంది. అయితే జనగణన ప్రక్రియ వల్ల అమలు ఇంకా ఆలస్యమయ్యే అవకాశముందని కొందరి అంచనా. ఆలస్యం కన్నా కూడా ఈ చట్టంలో ఉన్న మౌలిక లోపం పెద్ద సమస్య. ఎలాగూ కొంత వ్యవధి ఉంది కాబట్టి, సమయాన్ని ఆ లోపాన్ని సవరించటం కోసం వినియోగించాలి. ఈ లోపాన్ని సవరించే ప్రత్యామ్నాయాలతో పౌర సమాజంతో కలిసి లోక్‌సత్తా కొత్త మహిళా బిల్లును తయారు చేసింది. ఈ నమూనాబిల్లు ప్రకారం ప్రతి రాజకీయపార్టీ చట్టసభల్లో మూడోవంతు సీట్లను మహిళలకు కేటాయించాల్సుంటుంది. ఏయే మహిళలను నిలబెట్టాలో అది పార్టీ నిర్ణయం. అయితే పార్టీ బలహీనంగా ఉండే నియోజకవర్గాలు మహిళలకు కేటాయించకుండా ఈ ప్రత్యామ్నాయంలో మూడు పార్లమెంటరీ నియోజకవర్గాల సముదాయాన్ని ఏర్పాటుచేస్తారు. ప్రతి సముదాయంలో మూడోవంతు అసెంబ్లీ స్థానాల్లో, అంటే తెలుగునాట సుమారుగా ప్రతి 21 అసెంబ్లీ సీట్లలో ఏడుగురు మహిళల్ని ప్రతిపార్టీ నిలబెట్టవలసి వస్తుంది. తక్కువమంది మహిళల్ని నిలబెడితే, పురుష అభ్యర్థుల స్థానాల్ని కోల్పోవలసి వస్తుంది. ప్రతి మహిళా అభ్యర్థికీ ఇద్దరు పురుష అభ్యర్థుల్ని వదులుకోవలసి వస్తుంది. అంటే రొటేషన్ లేకుండా ఎన్నికల్లో 33 నుంచి 50 శాతం వరకు సీట్లలో తమ అభ్యర్థులుగా పార్టీలు మహిళలకు బి ఫారాలు ఇవ్వాలి. అలా ఇవ్వని పార్టీలకు.. సరిపడా పురుష స్థానాల్లో కోత విధించే అవకాశం ఎన్నికల సంఘానికి ఉండాలి. తమకు బలం లేని చోట్ల మహిళలకు పార్టీలు టికెట్లిచ్చే అవకాశం ఉండదు. ఈ రకమైన ఏర్పాట్లతో మహిళా రిజర్వేషన్ వల్ల రాజకీయ పార్టీలలో మహిళా నాయకత్వాన్ని సహజంగా పెంపొందించుకునే అవకాశం ఉంది. సమర్థవంతమైన నాయకులుగా మహిళలు ఎదుగుతారు. ఈ ఏర్పాట్లకి రాజ్యాంగ సవరణ కూడా అక్కర్లేదు. స్థానిక ప్రభుత్వాల నుంచి ఎలాగూ 50 శాతం మహిళలు వార్డు మెంబర్లుగా, సర్పంచ్‌గా, ఎంపీటీసీ, జెడ్‌పీటీసీ, మండల పరిషత్, జిల్లా పరిషత్ అధ్యక్షులుగా ఎన్నికవుతున్నారు. వారి నుంచే రాజకీయ పార్టీలు చట్టసభలకు మహిళలను ఎంపిక చేసుకునే అవకాశం ఉంటుంది. దీంతో మహిళలంటే భర్త లేక తండ్రి, కుటుంబంలో ఇతర పురుషులు మరణించినప్పుడే వారసత్వంగా రాష్ట్ర, జాతీయ రాజకీయాల్లోకి వచ్చే పరిస్థితి ఉండదు. చట్టసభల్లో కూడా మహిళా సాధికారత సాధ్యమవుతుంది. చట్టసభల్లో ప్రస్తుతమున్న ఎస్.సి, ఎస్.టి రిజర్వేషన్లు ఎలాగూ కొనసాగుతాయి. కనుక ఆ వర్గాలకు కూడా మహిళా రిజర్వేషన్లు అమలవుతాయి. మొత్తంగా జనాభాలో సగభాగమున్న మహిళలకు రాజకీయ పార్టీల్లో, చట్టసభల్లో ఆ స్థాయిలో చెప్పుకోదగిన ప్రాతినిధ్యమైతే ఉండాలి, అది మన రాజకీయ సంస్కృతిలో భాగమవ్వాలి.

**సార్వజనీన ఓటు హక్కు.. ఓటరు బాధ్యత**

ఆధునిక ప్రజాస్వామ్య ప్రారంభ దశలో కొన్ని పాశ్చాత్య దేశాలలో ఓటింగ్ పద్ధతి అమలులో ఉండేది. ఆస్తి, చదువు ఉంటే పురుషులకు ఓటు హక్కు ఉండేది గానీ, ఆ రెండూ ఉన్నా మహిళలకు ఓటు వేసే అధికారం లేదు. వివక్ష వల్ల. ఆ తర్వాత ఓటుహక్కును విస్తరించినా, కనీసం వందేళ్ల పాటు పోరాటం చేసి మహిళలు ఆయా దేశాల్లో ఓటు హక్కును సంపాదించుకున్నారు. మన దేశంలో అలా కాదు. బాబూ రాజేంద్రప్రసాద్ అధ్యక్షతన ఏర్పాటైన రాజ్యాంగసభకు డా॥ బీఆర్ అంబేద్కర్ ఛైర్మన్‌గా నియమితులయ్యారు. జవహర్‌లాల్ నెహ్రూతోపాటు అప్పటి భారత స్వతంత్ర పోరాటంలో పాల్గొన్న ఎంతోమంది ఉద్దండులు

సభలో ఉన్నారు. అందులో స్వతంత్ర భారతదేశంలో ఓటు హక్కు ఎవరెవరికి కల్పించాలని అన్న చర్చ వచ్చింది. అప్పుడు కొందరు పాశ్చాత్య దేశాలలోలాగా మన దేశంలో కూడా చదువు, ఆస్తి ఉన్నవారికే మొదట ఓటు హక్కు ఇద్దామని ప్రతిపాదించారు. ఆరంభం నుంచే సార్వజనీన ఓటు హక్కును వీరు వ్యతిరేకించారు. వీరి వాదన ఏమిటంటే, ప్రజలకు ఉపయోగపడే చట్టాలను తయారుచేయవలసిన చట్టసభలకు నిరక్షరాస్యులను ఎన్నుకుంటే వారు ఎలా చట్టాలను చేయగలరు? అని. అప్పుడు భారత ప్రథమ ప్రధాని నెహ్రూ, బీఆర్ అంబేద్కర్ లాంటివారు గట్టిగా ఆ వాదనను వ్యతిరేకించి, సార్వజనీన ఓటు హక్కు ఇవ్వాల్సిందేనని వాదించారు. భారత స్వాతంత్ర్య సంగ్రామంలో చాలామంది డాక్టర్లు, లాయర్లు, ఇంజినీర్లు, ఇతర ఉన్నత విద్యావంతులు పాల్గొన్నారు కానీ.. ఇది ఒక పార్శ్వం మాత్రమేనని, మరోకోణంలో ఆలోచిస్తే చాలామంది విద్యావంతులు, ఉద్యోగులు ఆనాటి బ్రిటిష్ ప్రభుత్వానికి దాసోహం అన్నారని, ఒకరకంగా ఆనాటి వలస పాలకులకు ఊడిగం చేశారని విమర్శించారు. అదే సమయంలో చదువులేనివారు, పేద బలహీనవర్గాలవారు ఆ పోరాటంలో మమేకమై తమ ప్రాణాలను తృణప్రాయంగా త్యాగం చేశారన్నారు. దేశంలో అక్షరాస్యత అప్పటికి 10 శాతం లోపే. అలాంటప్పుడు కేవలం కొద్దిమంది పెద్దల రాజ్యంగా భారత్ మారకూడదని, ప్రజాస్వామ్యం కొద్దిమందికే పరిమితం కాకూడదని వారు వాదించారు. అలాగే రాజ్యం వీరభోజ్యం కారాదని, సామాన్యుడు పాలనలో భాగస్వామి కావడానికి ఓటు హక్కు ఒక వజ్రాయుధం అవుతుందని వారన్నారు. సామాన్యులకు ఓటు హక్కు కల్పించాల్సిన బాధ్యత రాజ్యాంగానిదేనన్నారు. ఈ వాదనల అనంతరం మన రాజ్యాంగసభ 21 సంవత్సరాలు నిండిన ప్రతి పౌరునికీ ఓటు హక్కు కల్పించింది. కులం, మతం, ప్రాంతం, భాష, లింగ భేదం లేకుండా అందరూ ఈ వయసు నిండగానే ఒంటరిగానే ఓటును నమోదు చేసుకునే అవకాశాన్ని కల్పించారు. వేరే దేశాల్లో వందల సంవత్సరాల పోరాటం తర్వాత మహిళలు, సామాన్యులకు ఓటు హక్కు లభిస్తే, మన దేశంలో తొలినుంచి అందరికీ ఓటు హక్కు లభించింది. ఇది ఒకరకంగా మంచిదే అయినా, ఈవేళ ఓటర్లను ప్రలోభాలకు గురిచేస్తున్న పార్టీలను చూస్తే ఇందుకా మనం అందరికీ ఓటు హక్కు కల్పించింది అనే ఆవేదన కలుగుతుంది. కానీ, కేవలం సమస్య వర్ణన కాకుండా దాన్ని దాటి ఆలోచిస్తే, పరిష్కారం, అందులో మన పాత్ర స్పష్టమవుతాయి. దామాషా ఎన్నికల పద్ధతికితోడు, అధికారాన్ని వికేంద్రీకరించి స్థానిక ప్రభుత్వాలకు నిధుల్ని, అధికారాల్ని బదిలీ చేసి సిబ్బందిని సమకూరిస్తే, ప్రభుత్వ కార్యాలయాల్లో లంచాలు లేకుండా పనులు జరిగే ఏర్పాట్లు చేస్తే.. తమ ఓటుకి–తాము వివిధ రూపాల్లో చెల్లించే పన్నుల డబ్బుకి–తమ జీవితాలకి మధ్య సంబంధం ఏమిటో ప్రజలకు స్పష్టంగా అర్థమవుతుంది. మన కష్టార్జితం వివిధ ప్రత్యక్ష, పరోక్ష పన్నుల ద్వారా ప్రభుత్వానికి చేరుతోందని, ఆ డబ్బును ప్రభుత్వాలు మనకోసం సద్వినియోగం చేయాలంటే పాలనలో అవినీతిని, అలసత్వాన్ని ప్రశ్నించాలని, సరైనవారిని ఎన్నుకోవాలని బలమైన స్థానిక ప్రభుత్వాల ద్వారా ప్రజలు అర్థం చేసుకుంటారు. ఓటు విలువను ప్రజలు గుర్తించేలా చేయడానికి వారిని చైతన్యవంతుల్ని చేయటంతోపాటు నిధులు, విధులు ఉన్న స్థానిక ప్రభుత్వాలను వారికి అందుబాటులోకి తేవాలి, పౌర సేవల చట్టం వంటివి పకడ్బందీగా అమలు చేయాలి. జాతీయ స్థాయిలో, ఏపీలో కొత్త ప్రభుత్వాలు కొలువుదీరిన సందర్భంగా ఈ మార్పుల గురించి చెప్పినా.. ఇవి తెలంగాణ సహా అన్ని రాష్ట్రాలకూ వర్తిస్తాయి. యూనియన్, రాష్ట్ర ప్రభుత్వాలు కలిసి ఇందుకోసం పని చేయాలి.

ఈ మార్పులన్నిటిపై ప్రజలకు సోషల్ మీడియా, పుస్తకాలు, కరపత్రాలు, ఉపన్యాసాలు, సభలు సమావేశాలు వంటి వివిధ మార్గాల్లో మళ్లీ మళ్లీ చెబుతూండాలి. వీటి సాధనలో భాగస్వాముల్ని చేయాలి. పార్టీలు కూడా ప్రజాస్వామ్యం పట్ల ప్రజలకు నమ్మకం ఇంకా సడలక ముందే మేలుకొని ఈ మార్పుల సాధనకు ఏకాభిప్రాయంతో కృషి చేయాలి. ❖


# పార్టీ రాజకీయాలతో ప్రజాసమస్యల్ని నిర్లక్ష్యం చేయొద్దు

హైదరాబాద్ అల్వాల్ సర్కిల్‌లో ఉన్న మోత్కులకుంట, కొత్తచెరువు, చినరాయుని చెరువులను శుభ్రపరిచి భూగర్భ జలాలు పెరిగేలా పాలకులు, వివిధ రాజకీయ పార్టీల నాయకులు చర్యలు తీసుకోవాలని లోక్‌సత్తా పార్టీ తెలంగాణ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కె.శ్రీనివాసవర్మ డిమాండ్ చేశారు. మల్కాజిగిరి పార్లమెంటు నియోజకవర్గం ఏర్పడిన 15 సంవత్సరాలలో ఈరోజు వరకు ఎన్నిసార్లు ప్రాధేయపడ్డా ప్రభుత్వాలు చెరువులలో పూడికతీత పనులు చేపట్టలేదన్నారు. ఈ మూడు చెరువుల చుట్టూ చాలా కాలనీలు ఉన్నాయని, ఇవి గుర్రపుడెక్కతో నిండిపోయి దోమలబాధ, దుర్వాసనతో ప్రజలు చాలా ఇబ్బంది పడుతున్నారన్నారు. గతంలో బీఆర్ఎస్ ప్రభుత్వం ఉన్నప్పుడు ట్విటర్ ద్వారా కేటీఆర్‌కు పలుమార్లు విజ్ఞప్తి చేసినా చర్యలు తీసుకోలేదన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడ్డాక ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి దృష్టికి కూడా తీసుకెళ్లామన్నారు. పార్టీ రాజకీయాలతో ప్రజల సమస్యలను నిర్లక్ష్యం చేయటం తగదన్నారు. తక్షణం చెరువుల్ని బాగుచేసి భూగర్భ జలాలు పెంచేందుకు చర్యలు చేపట్టాలన్నారు.

# సమాఖ్య వ్యవస్థలో
# ఆర్థిక క్రమశిక్షణ - బాధ్యతలులేని హక్కులు అసాధ్యం

- సుమేధా కూరపర్తి,
ప్రజాస్వామ్య పీఠం పరిశోధనా బృందం

మన దేశంలో ప్రభుత్వ ఆర్థిక నిర్వహణపై చర్చ చాలా అరుదు. ఆ చర్చించినప్పుడు కూడా అవసరమైన లోతు, స్పష్టత చాలా సందర్భాల్లో లోపిస్తాయి. ఆంధ్రజ్యోతిలో మే 14న జి. తిరుపతయ్య గారు రాసిన వ్యాసం ఈ అంశంపై కొంత స్పష్టతకు మంచి అవకాశం. అంతకుముందు (ఏప్రిల్ 21) ప్రచురితమైన ప్రజాస్వామ్య పీఠం (ఎఫ్‌డీఆర్), లోక్‌సత్తా వ్యవస్థాపకులు డా.జయప్రకాష్ నారాయణ్ వ్యాసాన్ని అందులో విమర్శించారు. సాధారణంగా వినిపించే కొన్ని ఆందోళనలు, సందేహాల్ని వ్యక్తపరిచారు. ప్రజా ధన నిర్వహణపై మరింత హేతుబద్ధ అవగాహనతో అటువంటి సందేహాలను పరిష్కరించుకోగలం.




కేరళ అభ్యర్థనను తిరస్కరించి, మధ్యంతర చర్యగా యూనియన్ ప్రభుత్వం అనుమతించిన పరిమితి కంటే ఎక్కువ రుణం తీసుకోవటానికి వీల్లేదని చెబుతూ, కేసులో రాజ్యాంగపరంగా ఉత్పన్నమయ్యే కీలక ప్రశ్నల్ని ఐదుగురు జడ్జిల విస్తృత ధర్మాసనానికి బదిలీ చేస్తూ సుప్రీంకోర్టు ఇచ్చిన తీర్పు నేపథ్యంలో డా.జయప్రకాష్ నారాయణ్ వ్యాసం రాశారు. కోర్టు నిర్ధారించవలసినవి రెండు మౌలికమైన ప్రశ్నలు - రాష్ట్ర ప్రభుత్వ రుణాలను నియంత్రించటంలో జాతీయ ప్రభుత్వానికి ఎంతమేరకు అధికారం ఉన్నది; ఎటువంటి అప్పులను ప్రభుత్వ రుణంగా భావించాలి. ఎన్నికల్లో ఏ కూటమి అధికారం చేపట్టినా, దేశ భవిష్యత్తుకు ఆర్థిక నిర్వహణ కీలకమని డా.జేపీ అభిప్రాయపడ్డారు. ఆ నేపథ్యంలో, ఆయన మెరుగైన ప్రభుత్వ ఆర్థిక నిర్వహణ కోసం నాలుగు సూత్రాలు ప్రతిపాదించారు - సాధారణ రోజువారీ ఖర్చు కోసం అప్పు చేయకుండా, ఉన్న ఆదాయానికి పరిమితం చేయటం (రెవెన్యూ లోటు లేకుండా చూసుకోవడం); ఈవేళ్టి నిర్ణయాల వల్ల భవిష్యత్తులో పడే ఆర్థిక భారానికి ఇప్పుడే నిధులు కేటాయించటం (ప్రభుత్వోద్యోగుల పెన్షన్లు వంటి అంశాలు); పెట్టుబడులు కూడా ఖర్చుకు తగ్గ ఫలితం వచ్చేలా హేతుబద్ధమైన విశ్లేషణ ఆధారంగా చేయటం; చెల్లించగలిగే సామర్థ్యానికి మించి అప్పు చేయకపోవటం.

జి. తిరుపతయ్య తన వ్యాసంలో డా.జేపీ చెప్పిన కొన్ని అంశాలను వ్యతిరేకిస్తూ తనదైన పలు వాదనలు చేశారు.

మొదటగా, రాష్ట్రాలవారీ స్థూల ఉత్పత్తి (జీఎస్‌డీపీ)లో 40% వరకు అప్పులు తీసుకోవచ్చు అని, 2023-24లో కేరళ అప్పులు 36.5% ఉండగా, అది కేరళ ఆర్థిక బాధ్యత, బడ్జెట్ నిర్వహణ (ఎఫ్ఆర్‌బీఎం) చట్టం పరిధిలోనే ఉన్నట్లు పేర్కొన్నారు. ఆ గణాంకాలు సరైనవి కావు. నిజానికి చాలాకాలం క్రితమే ఒక రాష్ట్రం అప్పుల మొత్తం ఆ రాష్ట్ర జీఎస్‌డిపిలో 20 శాతానికి పరిమితం కావాలని ప్రతిపాదించారు. 15వ ఆర్థిక సంఘం సిఫార్సుల ఆధారంగా సవరించబడిన కేరళ సొంత ఎఫ్ఆర్‌బీఎం చట్టం ప్రకారం, 2023-24 సంవత్సరానికి రాష్ట్ర స్థూల ఆదాయంలో అప్పుల వాటా 33.7% కి పరిమితం కావాలి, 40%కి కాదు. తాజా బడ్జెట్ పత్రాలలో ఇచ్చిన సవరించిన అంచనా 34.29% కూడా ఆ పరిమితిని మించిపోయింది.

రాష్ట్రాలు ఒక సంవత్సరంలో అదనంగా చేయగలిగే అప్పుపై గరిష్ఠ పరిమితిని విధించటం ద్వారా జాతీయ ప్రభుత్వం వారి రుణాల భారాన్ని నియంత్రిస్తుంది. ఆ పరిమితి ఆర్థిక సంఘం సిఫార్సుల ప్రకారం రాష్ట్రం కట్టుబడి ఉండాల్సిన ద్రవ్యలోటు పరిమితిపై ఆధారపడి ఉంటుంది. ఇంకా, ఎఫ్ఆర్‌బీఎం చట్టం ప్రకారం ద్రవ్యలోటు సాధారణంగా రాష్ట్ర స్థూల ఆదాయంలో 3%కి పరిమితం అవ్వాలి. కానీ, కొన్ని విద్యుత్ రంగ సంస్కరణలను చేపట్టిన నేపథ్యంలో అదనంగా 0.5% వరకు అప్పు తీసుకోవచ్చు.

ఇటువంటి సమస్యలను పరిష్కరించుకోవడానికి కోర్టును ఆశ్రయించే హక్కు కేరళకి లేదని కాదు. ఆర్థిక నిర్వహణకి సంబంధించిన ఈ ప్రశ్నలు కోర్టు ముందుకు రావడం ఇదే మొదటిసారి. సుప్రీంకోర్టు తుది నిర్ణయం కోసం వేచి చూడాల్సిందే. కానీ ఈ కేసు లేవనెత్తిన మౌలికమైన అంశాలపై అవగాహన ముఖ్యం. ప్రభుత్వాల ఆర్థిక నిర్వహణ మనందరి భవిష్యత్తుని ప్రభావితం చేస్తుంది. రాష్ట్ర రుణాన్ని నియంత్రించటంలో యూనియన్ పాత్ర లేదని కేరళ చేస్తున్న వాదన తప్పు. ఆ అధికారాన్ని రాజ్యాంగం నిస్సందేహంగా జాతీయ ప్రభుత్వానికి అప్పగించింది. ఎందుకంటే భారతదేశం మొత్తంలో ఆర్థిక స్థిరత్వాన్ని కాపాడే బాధ్యతని కూడా రాజ్యాంగం జాతీయ ప్రభుత్వానికిచ్చింది. ఈ బాధ్యతను సమర్థంగా నిర్వహించాలి అంటే రాష్ట్ర అప్పులను నియంత్రించే అధికారం తప్పనిసరి. ఇలాంటి నియంత్రణ జాతీయ స్థాయిలోనే ఎందుకు జరగాలి? రాజ్యాంగ సభలో కె.ఎం మున్షీ నిర్ద్వంద్వంగా చెప్పినట్లు భారతదేశ ఆర్థిక వ్యవస్థ ఒక్కటే. ఒకవైపు జాతీయ ప్రయోజనాలను, మరోవైపు ప్రతి రాష్ట్రానికి ఉన్న సొంత అవసరాలను సమర్థంగా సమతూకం గావించటం జాతీయస్థాయిలోనే సాధ్యం. ఎటువంటి పర్యవేక్షణలేని సందర్భంలో రాష్ట్రాలు జాతీయ ప్రయోజనాలను విస్మరించి తమ ప్రాంతీయ ప్రయోజనాలకు అనుగుణంగా విపరీత ధోరణులతో ప్రవర్తించే ప్రమాదం ఉంది. అందుకే చాలా ముందుచూపుతో

రాజ్యాంగంలో 293వ అధికరణాన్ని చేర్చారు.

రెండు, ప్రభుత్వాలు తమ రోజువారీ ఖర్చుల కోసం అప్పులు చేయకూడదని డా. జయప్రకాష్ నారాయణ్ చేసిన ప్రతిపాదన సరైనది కాదని తిరుపతయ్య అభిప్రాయపడ్డారు. రుణాలు అందుబాటులో ఉన్నందువల్లే స్వాతంత్ర్యానంతరం భారీ పెట్టుబడితో మౌలిక సదుపాయాలను నిర్మించగలిగామన్నారు. ఇక్కడ కొంచెం స్పష్టత అవసరం. ప్రభుత్వ వ్యయం రెండు రకాలు – రోజువారీ ఖర్చు (రెవెన్యూ), పెట్టుబడి (క్యాపిటల్). రోజువారీ ఖర్చులు (రెవెన్యూ) అంటే – జీతాలు, పెన్షన్లు, వడ్డీ చెల్లింపులు, ఇతర నిర్వహణ ఖర్చులు, సంక్షేమ పథకాలు. అదే పెట్టుబడి (క్యాపిటల్) అయితే మౌలిక సదుపాయాలు, దీర్ఘకాలంలో రాబడినిచ్చే ఆస్తులను సృష్టించటానికి చేసే ఖర్చు. అప్పు చేసి తెచ్చుకున్న డబ్బు రోజువారీ అవసరాలను తీర్చటానికి కాకుండా దీర్ఘకాలంలో ఉత్పాదకతను పెంచే ఆస్తుల సృష్టికి వెళ్లాలని డా. జయప్రకాష్ నారాయణ్ ప్రతిపాదించారు. మరోవిధంగా చెప్పాలంటే, రెవెన్యూ లోటు ఉండకూడదు. ఏ ప్రభుత్వమైనా రోజువారీ వ్యయాన్ని ఆదాయానికే పరిమితం చేయాలి, అప్పు చేసి తెచ్చిన డబ్బు పెట్టుబడికి ఉపయోగించాలి.

మూడు, పెట్టుబడుల విషయంలో కూడా ప్రజాధనం వృధా అవ్వకుండా ఖర్చుకు తగిన ఫలితాలు వచ్చేలా చూసుకోవాలి అని డా. జేపీ చేసిన వాదనను హేతుబద్ధంగా ఆలోచించేవారెవరూ వ్యతిరేకించలేరు. ప్రజాధనం బాధ్యతాయుతంగా ఉపయో గించబడాలి అంటే ప్రతిపాదిత ప్రాజెక్టుల ముందస్తు విశ్లేషణ జరగాలి. ఇటువంటి విశ్లేషణ రాష్ట్రంపై దశాబ్దాలపాటు ఆర్థికభారం విధించే కాళేశ్వరం వంటి అత్యంత ఖరీదైన ప్రాజెక్టుల విషయంలో మరింత కీలకం. ప్రభుత్వ వనరులు పరిమితం. కానీ చెల్లింపు భారం దీర్ఘకాలిక అనివార్యత. పెట్టుబడుల పేరుతో అనుత్పాదక పథకాల కోసం ప్రజాధనాన్ని వృధా చేస్తే భవిష్యత్తు ప్రమాదంలో పడుతుంది.

చివరిగా, రాష్ట్ర ప్రభుత్వాల పట్ల యూనియన్ అన్యాయంగా వ్యవహరిస్తోందని, పన్ను ఆదాయంలో వారి న్యాయమైన వాటా వాళ్లకు బదిలీ చేయటం లేదని తిరుపతయ్య ఆరోపించారు. సెస్‌లు, సర్‌చార్జీల సమస్య వాస్తవమే. కానీ గమనించాల్సిన విషయమేమంటే, యూనియన్ స్థూల పన్ను ఆదాయంలో సెస్ మరియు సర్‌ఛార్జీల వాటా కోవిడ్ మహమ్మారి సమయంలో 20% గరిష్ట స్థాయి నుండి స్థిరంగా తగ్గి ఇప్పుడ 14%కి చేరు కుంది. పక్షపాత రాజకీయాలను పక్కనపెడితే, యూనియన్ నుం డి వనరుల పంపిణీలో రాష్ట్రాలు తమ వాటాను పొందటం లేద నటానికి ఎటువంటి ఆధారాలు లేవు.

వాస్తవానికి, జి.ఎస్.టికి ముందు ఉన్న విధానం కంటే ఇప్పుడు రాష్ట్రాలు 24% ఎక్కువ ఆదాయం పొందుతున్నాయి. మనలాంటి సంక్లిష్టమైన, గట్టి పోటీ తత్వమున్న రాజకీయ వ్యవస్థలో సహకార సమాఖ్య వాదం సాధించిన గొప్ప విజయం జి.ఎస్.టి వ్యవస్థ. నిజానికి అన్ని రకాల పద్దులని కలిపితే – అంటే పన్నుల్లో వాటా, ఇతర గ్రాం టులు, కేంద్ర ప్రతిపాదిత పథకాలు– యూనియన్ ప్రభుత్వానికి వచ్చే ఆదాయంలో 52 శాతం – రాష్ట్రాలకి వెళు తోంది.

మన లోపభూయిష్ట పన్నుల వ్యవస్థ కారణంగా కూడా అప్పులపై ఆధారపడాల్సి వస్తోందని మరో విమర్శ చేశారు. పన్నుల ఆదాయంలో అత్యధిక శాతం ప్రత్యక్ష పన్నుల నుండి కాకుండా పరోక్ష పన్నుల నుండి వచ్చే పరిస్థితి (60%) మన దేశంలో మాత్రమే ఉందన్నారు. ధనికులు పన్ను రాయితీలు పొందుతున్న కారణంగా ప్రత్యక్ష పన్నుల ఆదాయం వాటా తక్కువగా ఉందని, ఆ లోపాన్ని సరిచేసినట్లయితే మరింత ఆదాయం రావచ్చన్నది వారి సూచనగా అర్థమవుతుంది. పన్ను రేట్లు ఇంకా వసూలు ప్రక్రియను మెరుగుపరచటానికి ఎటువంటి హేతుబద్ధమైన చర్యలనైనా స్వాగతించాలి. కానీ మనం గుర్తించాల్సిన విషయం, ప్రత్యక్ష పన్నులైనా, పరోక్ష పన్నులైనా, మన జాతీయ స్థూల ఉత్పత్తిలో పన్నుల రూపంలో ప్రభుత్వాలకు ఇప్పటికే దాదాపు 18% వెళ్తోంది. మన ఆర్థికాభివృద్ధి స్థాయిపరంగా ఇది తక్కువ కాదు. మనతో పోల్చుకుంటే ఐదు రెట్లు ఎక్కువ తలసరి ఆదాయం ఉన్న చైనాలో కూడా ఈ వాటా 20% మాత్రమే. దానర్థం, దేశంలో ఆర్థిక కలాపాల్ని అస్తవ్యస్తం చేయకుండా, పన్నుల రూపంలో ప్రభుత్వాలు ఆదాయం పెంచుకోవటానికి పెద్దగా ఆస్కారం లేదు. అవసరాలకు సరిపడే ఆదాయంలేనప్పుడు పరిష్కారం, తిరిగి చెల్లించే సామర్థ్యానికి మించి బాధ్యతారహితంగా అప్పులు చేయటం కాదు. సమాఖ్య దేశం అయినందున, పన్నుల ఆదాయాన్ని రాష్ట్రాల మధ్య ఏ ప్రాతిపదికన పంచాలి అనే ప్రశ్న భారత్‌లో ఎప్పట్నుంచో ఉంది, భవిష్యత్తులో కూడా ఉండబోతుంది. ఎప్పటికప్పుడు పరిస్థితులను బట్టి ఈ సంక్లిష్టమైన ప్రశ్నలను పరిష్కరించుకోవాలి.

ముఖ్యంగా గుర్తించాల్సిన విషయం, ఈ ఆర్థిక సూత్రాలు రాష్ట్రాలకే కాకుండా, జాతీయ స్థాయి ప్రభుత్వానికి కూడా సమానంగా వర్తిస్తాయి. ఉల్లంఘిస్తే యూనియన్ ఆర్థిక స్వయంప్రతిపత్తిని కూడా పరిమితం చేయాలి. పక్షపాతం లేకుండా న్యాయమైన, పారదర్శక పద్ధతిలో ఆ సూత్రాలు అమలవ్వాలంటే నియంత్రించే అధికారాన్ని ఒక స్వతంత్ర వ్యవస్థకు అప్పగించాలి. ఈ ప్రక్రియపై ప్రజావిశ్వాసాన్ని, రాజకీయ విశ్వాసాన్ని ఎట్టి పరిస్థితుల్లో కాపాడుకోవాలి.

బాధ్యతలులేని హక్కులు అసాధ్యం. మన హక్కు ఇంకొకరి బాధ్యత అయినట్లే, ఇంకొకరి హక్కు మన బాధ్యత అవుతుంది. ప్రతి హక్కుకూ పరిమితులుంటాయి. రాజ్యాంగంలో ప్రాథమిక హక్కులకు కూడా పరిమితులు ఉన్నాయి. హక్కులకు అర్హులమవ్వాలి అంటే, బాధ్యతతో వ్యవహరించాలి. అవసరాన్ని బట్టి అప్పు తీసుకోవటం ప్రభుత్వాల హక్కు అన్నది వాస్తవం. కానీ ఆ హక్కుకి కూడా పరిమితులు ఉన్నాయి. తాహతుకు మించి అప్పు చేయకూడదు, అప్పు చేసి తెచ్చుకున్న డబ్బుని బాధ్యతతో భవిష్యత్తు పరిరక్షణకి అవసరమైన పెట్టుబడుల కోసం సద్వినియోగం చేయాలి. వచ్చేతరం భవిష్యత్తుని నాశనం చేసి, వారి మీద ఆస్తులులేని అప్పుల భారాన్ని పెట్టే హక్కు మన తరానికి లేదు.

జాతీయ స్థాయి ప్రభుత్వ చర్యలు దేశం మొత్తాన్ని ఎలా ప్రభావితం చేస్తాయో అదే విధంగా, రాష్ట్రాల ఆర్థిక నిర్ణయాలు కూడా దేశంలోని అన్ని ప్రాంతాలను ప్రభావితం చేస్తాయి. రాబోయే 10-20 ఏళ్లలో భారతదేశం వేగంగా అభివృద్ధి చెందాలంటే ప్రభుత్వాల ఆర్థిక క్రమశిక్షణ అత్యంత కీలకం. ❖


# వాతావరణం మారుతోంది, ఓటరు అడిగితేనే మార్పు సాధ్యం

– నమ్రత

ప్రపంచ సగటు కంటే భారత్ ఉష్ణోగ్రతలు రెట్టింపు స్థాయిలో పెరుగుతున్నాయి. ఢిల్లీలో ఉష్ణోగ్రతలు 52 డిగ్రీల వరకు పెరిగాయి. అందువల్ల ఢిల్లీ విద్యుత్ డిమాండ్ 7,572 మెగావాట్లకు చేరుకుంది. ఇది మరింత శిలాజ ఇంధన వినియోగానికి దారితీస్తుంది. క్రమేపీ గ్లోబల్ వార్మింగ్‌ను మరింత పెంచుతుంది. ఇలా ఒక విషవలయంలో మన దేశం చిక్కుకుంది. హైదరాబాద్‌లో కూడా గతేడాదితో పోలిస్తే 5 డిగ్రీల అధిక ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి. ఐటీ కేంద్రాలైన బెంగళూరు, హైదరాబాద్‌లు తీవ్ర నీటిసమస్యలు ఎదుర్కొంటున్నాయి. మనం మరో మానవ సంక్షోభాన్ని ఎదుర్కొంటున్నామా?

ఉష్ణోగ్రతలు వరుసగా రెండు రోజులపాటు మైదాన ప్రాంతంలో 40 డిగ్రీలు, కొండ ప్రాంతాల్లో 30 డిగ్రీలు, తీర ప్రాంతాల్లో 37 డిగ్రీలు దాటితే వడగాల్పులుగా పరిగణించాలని ప్రపంచ ఆరోగ్య సంస్థ నిర్దేశించింది. అదే 47 డిగ్రీల కన్నా అధికంగా ఉంటే తీవ్రమైన వడగాలి తరంగాలుగా పేర్కొంటూ హెచ్చరికలు జారీ చేస్తారు.

1990లలో ఐక్యరాజ్యసమితి మద్దతు గల ఐపిసిసి నివేదిక సారాంశం ప్రకారం, శిలాజ ఇంధనాలను కాల్చడం వల్ల కర్బన ఉద్గారాలు/ జీహెచ్‌జీల సాంద్రత పెరుగుతుంది. ఇది ప్రపంచ సగటు ఉష్ణోగ్రతల పెరుగుదలకు దారితీస్తుంది. పెరిగిన భూతాపంతో ఊహించినట్లుగానే మరింత తీవ్రమైన వాతావరణ ప్రభావాలు వచ్చాయి. అత్యవసర పరిస్థితిని దృష్టిలో ఉంచుకుని ప్యారిస్ ఒప్పందంపై 195 దేశాలు సంతకాలు చేశాయి. పారిశ్రామిక పూర్వస్థాయిలో పోలిస్తే ప్రపంచ సగటు ఉష్ణోగ్రతలను 2 డిగ్రీల సెల్సియస్ కంటే తక్కువగా ఉంచాలని దాన్ని 1.5 డిగ్రీలకు పరిమితం చేయటానికి ప్రయత్నించింది.




### వేడి తరంగాలు – విధ్వంసాలు

అధిక ఉష్ణోగ్రతల కారణంగా పంటల దిగుబడి తగ్గుతుంది. పంటను బట్టి, ఈ వేడి తరంగాల కారణంగా ఎదుగుదలకాలం కూడా మూడింట ఒక వంతు వరకు తగ్గుతుంది. దీంతో నిత్యావసరాల ధరలు మరింతగా పెరుగుతాయి. దాంతో పేదవాడి బతుకు దుర్భరంగా మారుతుంది. తీవ్రమైన వేడి కారణంగా ప్రజలు తమ పంటలను లేదా పశువులను కోల్పోతే ఆహారం, జీవనోపాధి భద్రత కూడా దెబ్బతింటాయి.

దేశంలో ప్రధానమైన 150 జలాశయాల్లో ప్రస్తుత నిల్వలు 10 సంవత్సరాల కంటే దారుణంగా పడిపోయాయి. వీటి మొత్తం

నీటి నిల్వ సామర్థ్యం 17,900 కోట్ల ఘనపు మీటర్లు. ప్రస్తుతం కేవలం 5,040 కోట్ల ఘనపు మీటర్ల మేరకే జలాలు ఉన్నాయి. గతేడాది భారీగా వానలు కురిశాయి, ప్రాజెక్టులు పూర్తిగా నిండాయి. కానీ అధిక ఉష్ణోగ్రతల వల్ల నీరు వేగంగా ఆవిరి అవుతుంది. కావున జలవనరుల్లో నీరు తగ్గిపోయి తాగునీటి ఎద్దడి ఏర్పడుతుంది.

అధిక ఉష్ణోగ్రతల వల్ల అసంఘటిత రంగం కుంటుపడుతుంది. ఫలితంగా 10 శాతం వరకు ఉత్పత్తి తగ్గిపోతుంది. 'వాతావరణ పారదర్శకత-2021' నివేదిక ప్రకారం దేశంలో అధిక ఉష్ణోగ్రతల ఫలితంగా వ్యవసాయ, తయారీ, నిర్మాణ, సేవా రంగాలలో సుమారు రూ.13,25,000 కోట్లకు పైగా (159 బిలియన్ డాలర్ల) నష్టాన్ని కలిగిస్తాయి. దేశ జీడీపీలో అది 5.4 శాతం. పరిస్థితులు ఇలానే కొనసాగితే 2050 నాటికి ప్రపంచ ఆర్థిక వ్యవస్థ 19 శాతం వరకు నష్టపోతుందని 'నేచర్ జర్నల్' ప్రచురించిన అధ్యయనం విశ్లేషించింది. ఆ నష్టం భారత ఆర్థిక వ్యవస్థలో 22 శాతం ఉంటుందని హెచ్చరించింది.


వేడి తరంగాల వల్ల దేశంలో ఏటా అధిక సంఖ్యలో మరణాలు సంభవిస్తున్నాయి. 2023లో వడగాల్పుల కారణంగా 14 రాష్ట్రాల్లో మొత్తం 264 మంది మరణించినట్లు యూనియన్ ఆరోగ్య శాఖ లోక్‌సభలో వెల్లడించింది. అధిక ఉష్ణోగ్రలు వడదెబ్బ, గుండెపోటు, మూత్రపిండ వ్యాధులు, మధుమేహ తీవ్రతకు దారితీస్తాయని వైద్యులు హెచ్చరిస్తున్నారు. అధిక ఉష్ణోగ్రతల వల్ల శరీరం వేడెక్కకుండా చెమట రూపంలో చల్లబరిచే పని మానవ దేహంలో నిరంతరం జరుగుతుంది. అలా బయటికి వెళ్లే నీరు, పోషకాలను శరీరంలో ఎప్పటికప్పుడు భర్తీ చేస్తూ ఉండాలి. ఈ ప్రక్రియ జరగని పక్షంలో ప్రాణాలు కోల్పోయే ప్రమాదముంది.

**ఈ విధ్వంసానికి కారణాలు**

కాలాలకు అనుగుణంగా వాతావరణంలో వేడి పెరగటం సాధారణ ప్రక్రియ. కొన్ని నెలల్లో అధిక ఉష్ణోగ్రలు ఉంటాయి. వర్షాకాలం వాటిని చల్లబరుస్తుంది. కానీ సాధారణం కంటే వర్షాలు తక్కువగా కురిసినప్పుడు, వాతావరణం వేడిగా ఉంటుంది. ఎడారి ప్రాంతాలు, వెచ్చటి వాతావరణం ఉండే సముద్రాలు, కొన్నిసార్లు స్థానిక పరిస్థితులతో వాటిల్లే మార్పుల ఫలితంగా అధిక ఉష్ణోగ్రతలకు అవకాశాలు ఉంటాయి. దేశంలో పలుచోట్ల ఇప్పుడు అలాంటి పరిస్థితుల్ని చూస్తున్నాం. 10 సంవత్సరాలకు జరిగే వాతావరణ మార్పులు కొన్నిసార్లు మూడు సంవత్సరాలకే వస్తున్నాయి.

ప్రధానంగా కర్బన ఉద్గారాల విడుదల అధికం కావటంతో భూతాపం పెరిగిపోతోంది. ఈ వాతావరణ మార్పులు కరవు, వేడి తరంగాలు, వరదలు, తుపానుల తీవ్రతను మరింత పెంచాయి. మన సమాజాలు, ఆర్థిక వ్యవస్థలు, అన్నిటికంటే ముఖ్యంగా మానవ జీవితాలపై, పర్యావరణంపై మిక్కిలి ప్రభావం చూపిస్తున్నాయి.

ఎన్నికల ప్రచారాల మధ్య అనేక రాష్ట్రాలు వేడిగాలులను




చవిచూశాయి. అయితే రాజకీయ పార్టీల దృష్టి పర్యావరణ భౌతిక వేడి కంటే రాజకీయ వేడి మీద ఎక్కువగా ఉంటుంది. ఈ సంవత్సరం, సామాన్య ప్రజలలో ప్రధాన చర్చనీయాంశం వేడి గాలుల తరంగాలు. కానీ రాజకీయ పార్టీలు తమ ఎన్నికల ప్రచారాలు లేదా మేనిఫెస్టోల్లో ఈ ముఖ్యమైన అంశాన్ని ప్రస్తావించలేదు. వాతావరణ మార్పులకు వ్యతిరేకంగా ప్రజలకు హక్కు ఉందని ఆరోగ్యకరమైన వాతావరణంపై హక్కు ఉందని దేశాన్ని పాలించాలనుకుంటున్న పార్టీలు గుర్తించుకోవాలి.

వేడి తరంగాల ప్రమాదాలపై ప్రజల్లో ఆందోళన ఎక్కువగానే ఉంది. బ్యాలెట్ బాక్సు వద్దే కాదు, వీధుల్లో జరుగుతున్న నిరసనలు, సోషల్ మీడియా స్పందనల్లో కూడా అది కనిపిస్తోంది. పెట్టుబడిదారులు కూడా మేల్కొన్నారు. 35 ట్రిలియన్ డాలర్లకు పైగా విలువైన పెట్టుబడులు - పెట్టుబడి పెట్టిన మొత్తం ఆస్తులలో మూడింట ఒక వంతు కంటే ఎక్కువ - ఇప్పుడు ప్రపంచ పర్యావరణ, సామాజిక, పాలనా లక్ష్యాలతో సంధానం గావిస్తూ కేటాయించారు.

కానీ పర్యావరణ కాలుష్యం వల్ల తలెత్తే కొన్ని రకాల పెనుఉత్పాతాల్ని నిలువరించటానికి పైన పేర్కొన్న చర్యలు కూడా చాలవు.

**భూతాపాన్ని తగ్గించే చర్యలు**

ఎన్ నినో, లా నినా పరిణామాలను నియంత్రించటం సాధ్యం కాదు. కానీ కట్టుదిట్టమైన చర్యల ద్వారా భూతాపాన్ని తగ్గించుకునే అవకాశం మన చేతుల్లోనే ఉంది. శిలాజ ఇంధనాల వినియోగానికి స్వస్తి పలికి పునరుత్పాదక ఇంధనాల వైపు వేగంగా మళ్లటం ద్వారా పరిస్థితులలో కొంత మార్పు తీసుకురావచ్చు.

అధిక వేడిని ఎదుర్కోవటానికి, మనం మరిన్ని ఎక్కువ ఏసీలను ఉపయోగిస్తున్నాము. తద్వారా హీట్ ఐలాండ్ ఎఫెక్ట్ అనే చట్రంలో ఇరుక్కున్నాం. ఈ చక్రాన్ని విచ్ఛిన్నం చేయటానికి తనని తాను చల్లబరచుకునే స్మార్ట్‌సిటీలను నిర్మించాలి. అంటే పచ్చని ప్రాంతాలు, మరిన్ని నీటి వనరులు, మరింత శక్తిసామర్థ్యమున్న హరిత భవనాలు నిర్మించాలి. నగరాలు, పట్టణాల్లో పర్యావరణ అనుకూల నిర్మాణాలు చేపట్టాలి.

వాతావరణంలోని కర్బన ఉద్గారాలను అధికంగా విడుదల చేసే ఏసీలు, వాహనాల వాడుకను తగ్గించాలి. ఇందులో భాగంగా ప్రజారవాణా వినియోగాన్ని పెంచాలి. ఇలా కర్బన ఉద్గారాలను త్వరితగతిన తగ్గించటం ద్వారా ప్రపంచ ఉష్ణోగ్రతలు తగ్గుతాయి.

ఎక్కడికక్కడ చిన్న నీటిపారుదల వ్యవస్థలను బలోపేతం చేయాలి. చెక్‌డ్యాములనైనా నిర్మించి స్థానికంగా జలమట్టాలను పెంచుకోవాలి. ఒకప్పుడు హైదరాబాద్ నీటి అవసరాలను హిమాయత్‌సాగర్, మంజీర తదితర స్థానిక వనరులు తీర్చేవి. అనంతరం నాగార్జునసాగర్ నుంచి, ఇప్పుడు గోదావరి పైనున్న ప్రాజెక్టుల నుంచి నీటిని తరలిస్తున్నారు. స్థానిక జలవనరులను ఎండబెట్టి, ధ్వంసం చేసి అవసరాలన్నింటికీ జలాశయాలపై ఆధారపడటం తగనిపని. కాబట్టి స్థానిక నీటి వనరులను పునరుద్ధరించుకోవాలి. లేకుంటే, ఎన్ని ప్రాజెక్టులు కట్టినా నీటి సమస్యలు ఖాయం.

వ్యవసాయ విధ్వంసం, ఆహార అసమతుల్యత నేపథ్యంలో, సుస్థిర ఆహార భద్రత కోసం చిరుధాన్యాలు ఒక ఆశాదీపంగా ఉద్భవించాయి. పర్యావరణహితంలో, పోషక సామర్థ్యంలో సాటిలేని చిరు ధాన్యాలు కిలోగ్రాముకి 200 లీటర్ల నీటిని మాత్రమే డిమాండ్ చేస్తాయి. ఒక కిలో వరి పండించటానికి 5000–8000 లీటర్ల నీరు అవసరమవుతుంది (ఇంకా తక్కువ సరిపోతుందని కొన్ని అధ్యయనాలు చెబుతున్నప్పటికీ, సాధికారికంగా నిరూపణ కావాల్సి ఉంది). మిల్లెట్లు (జొన్నలు, సజ్జలు, రాగులు, కొర్రలు, సామలు, అరికెలు మొదలైనవి) బంజరు భూముల్లో కూడా పండగలవు. వీటి సాగులో భాగంగా బహుళ ఆనకట్టల్ని నిర్మాణం, సహజ పర్యావరణ వ్యవస్థల తారుమారు అవసరం లేదు.

ప్రభుత్వాలతోపాటు ప్రజలు సైతం విస్తారంగా మొక్కలు పెంచాలి. ఒక అధ్యయనం ప్రకారం, మామిడి చెట్టు 50 ఏళ్ల జీవితకాలంలో 81 టన్నుల కార్బన్ డయాక్సయిడ్‌ను పీల్చుకొని 271 టన్నుల ప్రాణవాయువును విడుదల చేస్తుంది. అలాగే ఐదు ఏసీలు వెయ్యి గంటల పాటు పనిచెయ్యటం ద్వారా వచ్చే చల్లదనాన్ని ఏపుగా పెరిగిన ఓ మామిడిచెట్టు ఇస్తుంది. ఇటువంటి విషయాలపై ప్రతి ఒక్కరికీ అవగాహన కలిగించి పచ్చదనాన్ని పెంచేందుకు కృషి చేయాలి. అప్పుడే భూతాపాన్ని తగ్గించి ప్రకృతి విపత్తులను నివారించగలం.

పరిపాలనాపరమైన చర్యలు తీసుకోవాల్సిన అవసరం ఉంది. మన దేశంలో ఇప్పటికీ తక్కువ వనరుల మధ్య జీవితం సాగిస్తున్నవారు అనేకమంది ఉన్నారు. ఆరుబయట పనిచేసేవారు, గదుల్లోనూ శీతల వ్యవస్థ లేనివారు, పేద ప్రజలు వేడి తాకిడికి గురయ్యే ప్రమాదాన్ని ఎక్కువగా ఎదుర్కొంటున్నారు. వాళ్లని రక్షించటానికి మనకు సరైన విధానాల అమలు కావాలి. అవగాహన ప్రధానం. భారతదేశంలో కమ్యూనిటీ ఆరోగ్య కార్యకర్తల నమూనా చాలా విజయవంతమైంది. వారంతా ఇంటింటికీ వెళ్లి ఆరోగ్యంపై వేడి ప్రభావాన్ని ప్రజలకు వివరించవచ్చు. అదేవిధంగా, కమ్యూనిటీ సమావేశాలను నిర్వహించవచ్చు. క్లినిక్‌లు, కమ్యూనిటీ ఆరోగ్య కేంద్రాలు మొదలైనవి కూడా తప్పనిసరిగా తగిన సమాచారాన్ని అందించేవిధంగా చర్యలు తీసుకోవాలి.

రాజకీయ నాయకులు తెలివైనవారు. ఓటర్లు ఏమి పట్టించుకుంటారో వారు చాలా దగ్గరగా గమనిస్తారు. అయితే ప్రజల ఆకాంక్షలకు తాత్కాలిక పథకాలను పరిష్కారాలుగా చూపుతూ ఓట్లు దండుకుంటుంటారు. పర్యావరణానికి జరుగుతున్న నష్టాన్ని పట్టించుకోరు. ముఖ్యంగా ఎన్నికలు సమీపిస్తున్నకొద్దీ వ్యవసాయ బావులకు ఉచిత విద్యుత్తు, నీటి ఛార్జీల ఎత్తివేత వంటి ఆకర్షణీయ పథకాలను ప్రకటిస్తుంటారు. ప్రజల దీర్ఘకాలిక ప్రయోజనాలను పణంగా పెడతారు. ఓటరు మేలుకొంటేనే ఈ పరిస్థితి మారుతుంది. వాతావరణ మార్పుల వల్ల జీవితాలు దుర్భరంగా మారకూడదంటే, పర్యావరణ పరిరక్షణ కోసం ఓటర్లుండాలి, అందుకోసం ఓట్లు పడాలి. మెక్సికో నూతన అధ్యక్షురాలిగా పర్యావరణ శాస్త్రవేత్త క్లాడియా షేన్‌బామ్ ఎన్నికవటం మనకు స్ఫూర్తినివ్వాలి. మన రోజువారీ జీవితంలో పర్యావరణాన్ని కాపాడటంతోపాటు, వాతావరణ మార్పుల కట్టడిని రాజకీయ ఎజెండాగా కూడా డిమాండ్ చేసినప్పుడే, దేశీయంగా, అంతర్జాతీయంగా అందుకోసం సమర్థంగా కృషి చేయగలిగినవారిని ఎన్నుకున్నప్పుడే భారతదేశంలో జీవన నాణ్యత, సుస్థిరాభివృద్ధికి నిజమైన భరోసా సాధ్యమవుతుంది. ❖

# విద్యాప్రమాణాలు అత్యంత కీలకం

తెలంగాణ ప్రభుత్వం నాణ్యమైన విద్యకి అత్యంత ప్రాధాన్యతనివ్వాలని లోక్‌సత్తా పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు తుమ్మనపల్లి శ్రీనివాసు అన్నారు. హైదరాబాద్‌లోని రాష్ట్ర కార్యాలయంలో నిర్వహించిన పార్టీ కార్యవర్గ సమావేశంలో మాట్లాడుతూ, ప్రయివేటు విద్యాసంస్థల్లో ఫీజులు తల్లిదండ్రులకు భారమవుతున్నాయన్నారు. ప్రభుత్వం ఏటా రూ.80,000కిపైగా ఒక్కో విద్యార్థి మీదా ఖర్చు చేస్తున్నా, సర్కారీ బడుల్లో చదువురాక సామాన్యులు ప్రయివేటు స్కూళ్లను ఆశ్రయిస్తున్నారన్నారు. రాష్ట్రంలోని పాఠశాలల పనితీరు, తీసుకోవాల్సిన చర్యలపై నివేదిక రూపొందించి ప్రభుత్వానికి అందచేస్తామని తెలిపారు. అంత డబ్బు ఖర్చు చేస్తున్నా ఎందుకు చదువు రావటంలేదో ప్రభుత్వం చర్చించి దిద్దుబాటు చర్యలు తీసుకోవాలన్నారు. లోక్‌సత్తా రాష్ట్ర ఉపాధ్యక్షుడు మెట్ల జగన్, ప్రధాన కార్యదర్శి శ్రీనివాసవర్మ తదితరులు మాట్లాడారు.

# నిత్య చైతన్య శీలి కాచరాజు

**-బండారు రామ్మోహనరావు**



ఎన్‌కౌంటర్లలో నక్సలైట్లు మరణించినా పోలీసులు మరణించినా అందరూ మనుషులేనని మానవతా సమతా వాదాన్ని ప్రేరేపించిన నిత్య చైతన్య శీలి, గొప్ప మానవతావాది అజాతశత్రువు లోక్‌సత్తా ఉద్యమ సంస్థ ఉమ్మడి నల్గొండ జిల్లా మాజీ సమన్వయకర్త కాచరాజు జయప్రకాష్ రావు అని లోక సత్తా ఉద్యమ సంస్థ ఉభయ తెలుగు రాష్ట్రాల సమన్వయకర్త బండారు రామ్మోహనరావు అన్నారు. మే 25న భువనగిరి లో జరిగిన కాచరాజు ప్రథమ వర్ధంతి సభలో రామ్మోహనరావు ముఖ్యఅతిథిగా పాల్గొని ప్రసంగించారు.

"హక్కులకై కలబడు' బాధ్యతలకై నిలబడు"అనే నినాదాన్ని సొంతం చేసుకొని భువనగిరి తో పాటు జిల్లాలో జరిగిన అవినీతిపై పోరాటం చేసి అనేక సంఘాలను స్థాపించిన జయప్రకాశరావు స్ఫూర్తిని తీసుకోవాలని ఉపాధ్యాయ సంఘాలైన ఏపీటీఎఫ్ యుటిఎఫ్, డిటిఎఫ్ తో పాటు వివిధ సామాజిక యువజన మహిళ సంఘాల నాయకులు కోరారు.

కవిగా,రచయితగా, సామాజికవేత్తగా బహుముఖ ప్రజ్ఞాశాలిగా పేరొందిన ఆయన పెద్దల్లో పెద్దగా పిల్లల్లో పిల్ల వాడిగా కలిసిపోయి అనేక ఉద్యమాలు నిర్మించారని వారు పేర్కొన్నారు.

సంఘాల సమావేశం కోసం తన సొంత ఇంటి పైన కాచరాజు మినీ సమావేశ మందిరాన్ని నిర్మించి వారంలో కనీసం రెండుసార్లు వివిధ సమస్యలపై చర్చావేదికలు పెట్టారని ఆయనకు నివాళి అర్పించిన వారు పేర్కొన్నారు.

మహిళలకు విద్యను అందించడం, ఉద్యోగ అవకాశాలను పెంపొందించడం తో పాటు వారిలో పొదుపును ప్రోత్సహించి ఎంతోమంది జీవితాలను తీర్చిదిద్దారని మహిళా హక్కుల సంఘం నాయకులు కళ్యాణి, డాక్టర్ జయశ్రీ, వైజయంతి పేర్కొన్నారు. లోక్‌సత్తా ఉద్యమ సంస్థ ద్వారా ఎంతో మందిని సమావేశపరిచి ప్రజాస్వామ్య సంస్కరణలు పాలనా సంస్క రణలపై డాక్టర్ జయప్రకాశ్ నారాయణ గారిని భువనగిరికి పిలిచి అనేక సమావేశాలు నిర్వహించారని విద్యావేత్త, లోక్‌సత్తా నాయకులు దిడ్డి బాలాజీ, సామాజికవేత్త జంపాల అంజయ్య తదితరులు పేర్కొన్నారు. ప్రజల హక్కుల కార్యకర్తగా ఆయన బహుముఖమైన సేవను గుర్తు చేసుకుంటూ సమావేశంలో పాల్గొన్న వివిధ సంఘాల నాయకులు కాచరాజు జయప్రకాష్ రావుకు ఘనంగా నివాళులు అర్పించారు.





ఎన్నికల బరిలో ఉన్న ఏ అభ్యర్థీ నచ్చనప్పుడు ఓటరు తన అయిష్టతను తెలపడానికే నోటాను ఏర్పాటు చేశారని, ఎన్నికలను బహిష్కరించే బదు లు ఓటింగ్‌లో పాల్గొని ప్రజాస్వామ్య బద్ధంగా తన వ్యతిరేకతను తెలియజేసే హక్కును పంచాయతీ ఎన్నికల్లోనూ కల్పించాలని పలువురు వక్తలు డిమాండ్ చేశారు. పంచాయతీ ఎన్నికల్లో నోటా అమలుపై సుపరిపాలన వేదిక ఆధ్వర్యంలో హైదరాబాద్ ప్రెస్‌క్లబ్‌లో నిర్వహించిన సమావేశంలో పలు సంఘాల నాయకులు పాల్గొన్నారు. లోక్‌సత్తా ఉద్యమ సంస్థ ఉభయ తెలుగు రాష్ట్రాల సమన్వయకర్త బండారు రామ్మోహన రావు, రాష్ట్ర ఎన్నికల సంఘం మాజీ కమిషనర్ నాగిరెడ్డి , సుపరిపాలన వేదిక కార్యదర్శి పద్మనాభ రెడ్డి , ఆలోచన ఉద్యమ సంస్థ వ్యవస్థాపకులు జన్నేపల్లి శ్రీనివాస్ రెడ్డి లోక్‌సత్తా పార్టీ రాష్ట్ర మాజీ అధ్యక్షులు పాండురంగరావు తదితరులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు. తమ అభిప్రాయాలను వెల్లడించారు.

## తెలంగాణ ఉద్యమకారులపై కేసులు ఎత్తివేయాలి

తెలంగాణ దశాబ్ది ఉత్సవాలు జరుపుకుంటున్న ఈ శుభ తరుణంలో తెలంగాణ మలిదశ ఉద్యమ కారులపై పోలీసులు పెట్టిన కేసులను ఇప్పటికీ ఎత్తివేయక పోవడం దుర్మార్గమని జస్టిస్ చంద్ర కుమార్ అన్నారు. తెలంగాణ లౌకిక ప్రజాస్వామ్య వేదిక మే 25న సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌లో నిర్వహించిన సమావేశానికి ఆ సంస్థ అధ్యక్షులు పృథ్వీరాజ్ అధ్యక్షత వహించారు. తెలంగాణ ఉద్యమంలో ఎక్కువ మంది పేదలు దళితులపై కేసులు నమోదయ్యాయని, ఇప్పటివరకు అవి ఎత్తి వేయలేదని లోక్‌సత్తా ఉద్యమ సంస్థ సమన్వయ కర్త బండారు రామ్మోహనరావు అన్నారు. నాయ కులపై కేసులు ఎత్తివేసారని కానీ సామాన్యులు ఇప్పటికి కోర్టులకు తిరుగుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో రాజ్యసభ మాజీ సభ్యుడు అజీజ్ పాషా, సీనియర్ జర్నలిస్ట్ పాశం యాదగిరి తదితరులు మాట్లాడారు.






హైదరాబాద్‌లోని జెనిసిస్ పాఠశాల ఇటీవల ఉపాధ్యాయుల శిక్షణను నిర్వహించింది. ప్రజాస్వామ్య పీఠం (ఎఫ్‌డీఆర్), లోక్‌సత్తా వ్యవస్థాపకులు డాక్టర్ జయప్రకాష్ నారాయణ్ కార్యక్రమాన్ని ప్రారంభించారు. ప్రస్తుత విద్యావ్యవస్థకు సంబంధించిన సమస్యలు, కాన్సెప్ట్‌లు, ఉపాధ్యాయుల పాత్రపై వివరించారు. టీచర్ కమ్యూనిటీ అడిగిన పలు ప్రశ్నలకు ఈ సందర్భంగా జేపీ సమాధానాలిచ్చారు.



RNI. Regd No. 69976/98 Postal Reg. No. HCD-913/2024-2026 Published on 10th June, 2024 Posting Date 15 &16th of every month

# క్యూఆర్ కోడ్ స్కాన్ చేయండి
# జనబలం చందాదారులుగా చేరండి




*If undelivered please return to:*
*LOKSATTA UDYAMA SAMSTHA,*
*H.NO. 6-3-678,B-106,*
*PASHA COURT 71, Somajiguda,*
*Behind TRIBHUVANDAS*
*JEWELLERS (TBZ),*
*Hyderabad - 500 082*

**Edited, Printed and Published by Dr. Jayaprakash Narayan, National Coordinator, Loksatta for and behalf of Foundation for Democratic Reforms, H.NO. 6-3-678,B-106,PASHA COURT 71, Somajiguda, Behind TRIBHUVANDAS JEWELLERS (TBZ), Hyderabad- 500 082. Printed at Kala Jyothi Process Pvt Ltd, 1-1-60/5, RTC “X” Roads, Hyderabad 500 020**